


ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాధుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938–1972]

శుక్రవారం : 2–4–'82

దుందుభినామ సం. చైత్ర శు. నవమి

సంపుటము 75 : సంచిక 30

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

*

పోస్ట్‌లో ఏడాది చందా రు. 67–60

ఆరు మాసాల చందా రు. 33–80

విడిప్రతి వెల రు. 1–25 పైసలు

ఆంధ్రపత్రిక కార్యాలయము

గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం: ఉగాది ఊహలు (చిత్ర రచన:

శుభాకాంక్షలు

పాఠకులు, రచయిత(త్రు)లు, ఏజంట్లు, ప్రకటన కర్తలందరికీ

మా ఉగాది

శుభాకాంక్షలు.

-సం.

* * *

ముఖచిత్రం

మా అభిమాన నటీనటులు కృష్ణ, జయప్రద ముఖ చిత్రంతో వెలువడిన సంచికను చూచిన తర్వాత నేను పొందిన ఆనందం భాష కందనిది. ఈ సంచిక నన్ను బాగా ఆకర్షించినది. ఇలాంటి చక్కటి ముఖ చిత్రాలే మాకు కావాలి.

నరేందర్, రవీందర్ (మహబూబ్‌నగర్)

* * *

5—3—82 నాటి సంచిక అందాల జంట, నా అభిమాన జంట కృష్ణ—జయప్రద అందాలతో ముగ్ధ మనోహరంగా ముస్తాబయింది. చూస్తున్నంత సేపు అలాగే చూడాలనిపించేంత ఆకర్షణ ఆ ముఖ చిత్రంలో తొణికిసలాడింది.

ఎల్. వి. చలపతిరావు (పెదరావూరు)

కథలు

5—3—82 సంచిక కృష్ణ, జయప్రద ముఖచిత్రం అత్యంత ఆకర్షణీయంగాఉంది. మనస్తత్వాలు, ఆడది కథలు రెండు చాలా బాగున్నాయి. చిత్రకారుడు గీసిన బొమ్మలు చూడముచ్చటగా, జీవకళ ఉట్టిపడుతున్నట్లుగా అనిపించింది.

ఉమామోహన్‌పండా (కాశీబుగ్గ)

* * *

ఆడది కథలో పెళ్లిళ్ళు అయిన కొంత మంది స్త్రీల ఆలోచనలు, ముఖ్యంగా స్వార్థపు ఆలోచనలు ఏ విధంగా ఉంటాయో చక్కగా వర్ణించారు. ఇకపోతే 'మనస్తత్వాలు' కథలో రిక్షారు అయిన మగవాని మనసును చాలా చక్కగా వర్ణించేరు.

ఎస్. కన్నతల్లి (శ్రీకాకుళం)

* * *

5—3—82 పత్రికలో ప్రచురించిన కథలలో అధికారి—అంతరాత్మ మరియు పాలవెల్లి కథలు ప్రత్యేకమైన విలువలను కలిగి వున్నవి.

పులపర్తి శ్రీరంగ, పులపర్తి రత్నమాల (మొగల్తూరు)



సీరియల్స్

'మనసు కథ' చాల వైరైటీగా ఉంది. ఇటువంటి సీరియల్ ఈ మధ్య కాలంలో చదవలేదు. సుజాత మనస్తత్వము ఎలాంటిదో అర్థము కావడంలేదు. మంచి సస్పెన్సుతో కళ్ళు త్రిప్పకుండ ఏక బిగిన చదివిస్తున్నది.

ఎస్. ఇందుముఖి (హైదరాబాద్)

* * *

ఈ వారం (తే 5—3—82 దీ) మా (మీ) పత్రికపై ప్రచురించిన ముఖ చిత్రాన్ని చూచిన తరువాత... నిజంగా కృష్ణ, జయప్రదల జంట చూడముచ్చటగా ఉంటుంది. తార సీరియల్ ప్రతివారము మమ్ములను ఉత్కంటతో చదివిస్తుందనుటలో అతిశయోక్తి ఏమీలేదు.

ఎమ్.హేమావతి, ఎమ్.మాధవీలత (విశాఖపట్నం)

* *

ఈ వారం (5—3—82) పత్రిక ముఖ చిత్రము కృష్ణ, జయప్రద చూసి చాలా సంతోషమైనది. మనసు కథ సీరియల్ ఆరంభం నుంచే కొత్త తరహా రీతిలో మొదలయింది. ఈలాంటి సీరియల్ వేస్తున్నందుకు మీకు నా ధన్యవాదములు రచయిత్రిగార్కి నా అభివందనములు.

ఏ. సురేష్‌కుమార్ (జంషెడ్‌పూర్)

ఉమెన్ కార్టూన్

5—3—82 నాటి ఆంధ్ర సచిత్ర వార పత్రిక పై ముఖచిత్రం కృష్ణ, జయప్రదల జంట చాలా నీట్‌గా ఉంది. వుమెన్ లోకం పోకడ కార్టూన్ రాజకీయపు ఒడారి ఇప్పటి రాజకీయపు పరిస్థితులను చాలా చక్కగా తెలియజేస్తున్నది.

పి. నరేంద్ర, ప్రసాద్, కామేష్, నవీన్, నర్సన్, రాప్ (ఖర్గపూర్)


వ్యాసాలు

కృష్ణ, జయప్రదల ముఖచిత్రం గల ఈవారం పత్రికలో తెలుగు నాటక రంగంలో నూతన సంచలనం సృష్టించిన వూరేగింపు నాటిక గూర్చి టి. ఎల్. కాంతారావుగారి వ్యాసం ఎంతో బాగుంది. చైతన్యవంతమైన పాటక లోకానికి వూరేగింపు నాటకం గూర్చి తెలియజేసిన మీ కృషికి కృతజ్ఞతలు.

మందలపు రోశయ్యచౌదరి (వాల్తేరు)

మనవి

'దుందుభిలో మీ యోగం-భాగ్యం' రాశిఫలాలవి సకాలంలో అందనికారణంగా ఈ వారం వెయ్యలేక పోతున్నాము. పై వారం సంచికలో వేస్తాము. -సం.



ఉగాది పుట్టుపూర్వోత్తర గాథలు!

"ఉగస్య ఆదిః ఉగాది"–అని శాస్త్రోక్తి. 'ఉగ' అనగా 'నక్షత్ర గమనం' అని అర్థము. నక్షత్ర గమనమునకు ఆది అనగా నక్షత్రములు నడక ఆరంభించిన (సృష్టి ఆరంభమైన) దినమే యుగాది లేక 'ఉగాది.' 'యుగము' అనగా 'ద్వయము' లేక 'జంట' అని కూడ అర్థము. ఉత్తరాయణ, దక్షిణాయణ మనబడే ఆయన ద్వయముతో కూడిన 'సంవత్సరము' యుగము కాగా, ఆ యుగమునకు (సంవత్సరమునకు) ఆది 'యుగాది' యనికూడ 'ఉగాది' పర్యానామ సార్థకతమ గురించి భావనలు గలవు.

ఉగాది 'చైత్ర శుద్ధ పాడ్యమి' నాడే యెందుకు జరుపవలెనను ప్రశ్నకు సమాధానముగా 'నారద పురాణము'నందు ఈ శ్లోకము చెప్పబడినది.

'చైత్రే మాసి జగత్ బ్రహ్మ
సనర్జ ప్రథమేహని ౹
శుక్ల పక్షే సమగ్రం
వైతదా సూర్యోదయ సతి
వత్సరాదవు వసంతాదవు
రవి రాజ్యేత దైవచ'

'బ్రహ్మ సృష్టి' గాథ

–చైత్రశుక్ల పాడ్యమి నాటి సూర్యోదయ వేళ బ్రహ్మదేవుడు విశాల జగమును సృష్టి చేశాడని భావము. కనుక సృష్టి ఆనాడే ఆరంభించబడినది కనుక చైత్ర శుద్ధ పాడ్యమియే 'సంవత్సరాది' గా నిర్ణయించ బడినది.

ఉగాది పుట్టుపూర్వోత్తరాలకు సంబంధించిన కొన్ని పురాణ గాథలు, జానపదుల గాథలు పెక్కు ప్రాంతాలలో ప్రచారంలో ఉన్నవి.

ఈ గాథలలో ఒకటి 'అరుణోదయ'గాథ. వేదాలనుబట్టి ఆరు నెలల కాలం ఆర్యులకు పూర్తిగా చీకటిగా వుండేదని, ఆరు నెలలు పూర్తిగా పగలుగా వుండేదని తెలియుచున్నది. వారికి అరుణోదయం కావటమే గొప్ప అనుభూతి అనీ, అదే 'యుగాది' పర్వమనే భావన కూడా ఉన్నది.



'అరుణుని' వృత్తాంతం

'అరుణుడు' అనే పదం సూర్య పర్యాయ పదాలలో ఒకటైనా 'అరుణుడు' వేరనీ, 'సూర్యుడు' వేరనీ పురాణ విదితం. పక్షిరాజు అయిన గరుత్మంతుని అగ్రజుడు అనూరుడు ఇతడు అండాకారములో నున్న దశలో ఆతృత కొద్దీ పూర్తిగా పొదగబడని గుడ్డును చిదమటం వలన తొడలు లేకుండా జన్మించిన వాడు 'అనూరుడు'. ఊరువులు లేక నిర్వీర్యుడై వున్న అనూరుని సూర్యుడు తన రథ సారధిగా చేసుకొనెనట. ఆ అనూరుడే 'అరుణుడు'. అతడు ఉషస్సంధ్యావర్ణములో నుంటాడు. కనుకనే సూర్యోదయ సమయంలో తెల్లని సూర్యకాంతికన్న ముందు అనూరుని అరుణకాంతులు మనకు కనిపిస్తాయి. సూర్యునికన్న ముందు రథసారథి అరుణుడు దర్శనమిస్తాడు అరుణోదయ సమయాన్ని ఆరు నెలల తర్వాత ధ్రువ ప్రాంతీయులు దర్శించిన శుభసమయమే యుగాది యని భావించబడుచున్నది.

'కపిల మహర్షి' కథ

మన సంస్కృతీ సాంప్రదాయాలనే ఎక్కువగా పోలియున్న 'కాంబోడియా'లో ఉగాదికి సంబంధించి వింత కథ ఒకటి వాడుకలో నున్నది. పూర్వము 'కపిలమహర్షి' ఒకానొకసారి ధర్మపాలుని మూడు చిక్కు ప్రశ్నలు అడిగి, ఆ ప్రశ్నలకు సరైన సమాధానము తెలుపకున్న ధర్మపాలుని తల నరికి వేగలదనీ, సరైన సమాధానాలు చెప్పగలిగినచో తన తల ఖండించుకొనగలననీ తెలిపెనట. గడువులోగా సమాధానాలెట్లు చెప్పగలనను భయముతో విలపించుచున్న ధర్మపాలునికి ఆ సమాధానాలు అరణ్యములో ఒక గరుడ పక్షుల జంట వలన అప్రయత్నంగా తెలిసినవట. ధర్మపాలుడు సరైన సమాధానాలు

చెప్పటవలన కపిలమహర్షి తన శిరస్సును ఖండించుకొని, తన శిరస్సు భూమిని తాకిన భూమి మండిపోగలదనీ, ఆకాశంలో విసిరేస్తే వర్షాలు రాకుండా పోగలవనీ, సముద్రంలో విసిరిన నీటిబొట్టయినా లేకుండా పోగలదనే ఉపద్రవాలను దృష్టిలో నుంచుకొని ఋషి తన ఏడుగురు కుమార్తెలను పిలిచి, తన తల నరకబడిన వెంటనే దానిని ఒక బంగారు పళ్ళెంలో పట్టుకోమని ఆదేశించెనట. అట్లే అతని తల నరకబడగానే పెద్ద కుమార్తె 'తుంగ్యా' పళ్ళెములో పట్టుకొనెనట. ఆ ఏడుగురు కుమార్తెలు తండ్రి శిరముగల స్వర్ణ పళ్ళెమును పట్టుకొని మేరు పర్వతం చుట్టూ ప్రదక్షిణం చేస్తూంటారట. ఉగాదివాడు ఏ కూతురు ప్రదక్షిణంచేస్తుందో దాని ననుసరించి ఏడాది పొడుగునా కొన్ని ఫలితాలు వారి పంచాంగాలలో వ్రాసియుంటారట. దీని ప్రకారం ఆ సంవత్సరంలో తమ తమ భవిష్యత్తును ముందే తెలుసుకొంటారట.

'మత్స్యావతార' గాథ

చైత్రశుద్ధ పాడ్యమినాడే శ్రీ మహావిష్ణువు మత్స్యాకృతి దాల్చి సోమకుని చంపి వేదాలను తెచ్చి, విధాత కప్పజెప్పినట్లు కూడ చెప్పబడి యున్నది. కనుక మత్స్యావతార పరాక్రమ చైతన్య విస్ఫూర్తికి సంకేతం ఈ ఉగాది!

ఆచారాలలో అంతరార్థం

'ఉగాది' నాటి ఆచారాలలో అంతరార్థం లేకపోలేదు. ఉగాదివాడు మనం ఆస్వాదించే వేపపూత పచ్చడిలో మనల నందర్నీ శాసించే సుఖ దుఃఖాత్మక ద్వంద్వ ప్రకృతి ఇమిడి యున్నదని గమనిస్తే ఇటేంతా ముద్ర వేసుకొనిన సమస్యలెన్నో చిక్కువీడిపోతాయి. దుఃఖంతో క్రుంగి బ్రతుకును భారంగా గడిపే నిర్భాగ్యులలో సైతం నూతన విశ్వాసాన్ని ఆపాదింపచేసి జాతీయ జీవితపునరుజ్జీవనానికి నవనవోన్మేష సందేశాన్నిస్తుంది ఉగాది! అంతేగాక వివిధరోగ ఉపశమన గుణాలు కలిగిన ఈ ఉగాది పచ్చడిని పూర్వులు ఆరోగ్య చర్యగా ఆహారయానంలో నిర్దేశించారనడం అందరికీ తెలిసినదే.

పంచాంగ శ్రవణ ఫలం


ఉగాదినాటి పంచాంగ శ్రవణ ఫలం గురించి "సూర్యశ్శౌర్య మథేందురింద్ర పదవీం"- అన్న శ్లోకములో- "పంచాంగ శ్రవణం చేసినవారికి సూర్యభగవానుడు శౌర్యాన్ని, చంద్రుడు ఇంద్రసమాన విభవాన్ని, కుజుడు శుభాన్ని శని ఐశ్వర్యాన్ని, రాహువు బాహుబలాన్ని, కేతువు కులాధిక్యతను కలుగ చేస్తారని చెప్పబడినది. సంవత్సరాది నాటి పంచాంగ శ్రవణం గంగాస్నాన సమఫలంను లభింపచేస్తుందని కూడ పురాణ ప్రతీతి.

సౌభ్రాతృత్వం ప్రబలి, స్వార్థ ద్వేష భావ ప్రవృత్తిని పరిహరించి, ఆంధ్రుల జాతీయ జీవన వికాసానికి ఈ 'దుందుభి' ఉగాది సమ్యగ్దృష్టి, అభ్యుదయ మార్గం చూపగలదని ఆశిద్దాం.

—మారుతి

తెలుగు ప్రేమ

కొలను వేంకట దుర్గాప్రసాద్



'సుందరీ! నా... సుందరీ! రా నాదరీ!'

పాట వినవస్తోంది గట్టిగా. అర్ధరాత్రి సినిమాపాట ఏమిటి? ఈ సుబ్బారావుగాడు రేడియో కట్టేయకుండా పడుకుని వుంటాడు. ఏ మలేసియానో, మారీషస్ స్టేషనో అయి వుంటుంది— అనుకుంటూ చెత్త తెలుగు సినిమా చూసినంత విసుగ్గా లేచి రేడియో కట్టేయబోయాడు రాజా. ఆశ్చర్యం! అది కట్టేసే వుంది. మరయితే పాట ఎక్కడ్నుంచీ! ప్రక్క ఇంట్లోనుంచా? వుహు!

బెడ్‌లైటు వెలుతురులో నిద్రపోతున్న సుబ్బారావు వంక చూసాడు. సదరు పాట అతగాడి నోట్లోంచి ధారాళంగా వస్తోంది! రాజా కళ్లునులుముకుని చూసాడు. సుబ్బారావు నోట్లోంచి పాట వస్తూనే వుంది. మళ్ళీ మళ్ళీ నులుముకున్నాడు. అదే దృశ్యం. ముచ్చెంగా మూడోసారి కళ్ళు నులుముకుందామనుకున్నాడుగానీ, కనుగుడ్లు నెప్పి అనిపించి మానేశాడు.

రాజా గభాల్న లైటు వేశాడు. పద్దెనిమిదేళ్ళ పాపాయి నవ్వినంత వెలుగొచ్చింది గదిలో. రాజా సుబ్బారావు పక్కమీదికి దూకి భయం భయంగా తట్టి లేపాడు. 'ఒరేయ్ సుబ్రావ్? సుబ్రావ్ ?' అని బావురు మన్నాడు. సుబ్బారావు కంగారుగా లేచాడు.

'ఏమిట్రా ఏమయిందీ?— ఏం కొంప మునిగింది?' అడిగాడు సుబ్బారావు.

'నువ్వేదో కలవరిస్తున్నావు, పాటలుపాడుతున్నావు, సంగీతం కూడా విన వచ్చింది మధ్య మధ్యలో. నాకేమిటో భయంగా, దిగులుగా వుంది? అయినా దయ్యాలగురించి భూతాల గురించి వద్దురా అంటే చదువుతావు!' అన్నాడు రాజా.

'పాట పాడానా? ఏం పాట? తెలుగా, హిందీనా?'

'తెలుగే! సుందరి నా సుందరి-రానాదరి! అని పాడావు. ఇది ఏ సినిమాలోది? పాతది కాదనుకుంటా. కొత్తదే! రాబోయే సినిమా? పేరేమిటీ? హీరో ఎవరూ? హీరోయిన్నెవ్వరు? జయమాలినుందా?' ప్రశ్నల వర్షం కురిపించాడు రాజా.

'ఆగు!' సుబ్బారావు ఉరిమాడు.

రాజా తన వర్షాన్ని ఆపాడు.

సుబ్బారావు మొహం ఛిరగా వుంది. 'అది సినిమా పాట కాదు. నా సొంతపాట. కలలో నా ప్రేయసితో పాడతున్నాను. బంగారం లాంటి కల చెడగొట్టావు మళ్ళీ అలాంటి కల వస్తుందా? ఎన్ని రోజులు నిద్రగాసి ఈ కలగన్నానో నీకు తెలుసా?... ఒరే! నిన్ను వెలగని మున్సిపాలిటీ లైటు స్తంభానికి కట్టేసి, అమావాస్య అర్ధరాత్రి పూట, దయ్యం కథ చదివి వినిపిస్తా! ముందసలు పదిలక్షలకు 'సంతోషనష్టంవావా

చేస్తా!' అంటూ గింజుకుంటూ లేచాడు సుబ్బారావు.

రాజా వణికిపోయాడు దయ్యం కథ అనగానే! 'వద్దు! వద్దు! నాకు దయ్యం కథ వద్దు!' అరిచాడు.

'చదవనులే! అది చదివే ధైర్యంపోయింది నాకు! అందుకే సంతోష నష్టం దావావేస్తున్నాను! ఇచ్చేయ్ పది లక్షలు' అరిచాడు సుబ్బారావు.

'ఆగాగు! మీద పడకు! ఇప్పుడే ఇచ్చేస్తా! నేరకపోయి నిద్ర లేపా నిన్ను!' అంటూ లేచి పెట్టెలోంచి ఒక పంచరంగుల కాగితం తీసి ఇచ్చాడు.

'ఏవిటిది, యే క్యాషై?'

'లాటరీ టికట్టు! పది లక్షలు బంపరు! రేపే డ్రా! ఆలసించిన ఆశా భంగం! మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి...!'

'ఆపు గోల!' అని దాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు పక్కమీదకు వాలి దుప్పటి కప్పుకున్నాడు. మళ్ళీ గభాల్న లేచి 'ఇక నన్ను లేపకు!' అన్నాడు.

'ఆ! అంటే, మళ్ళీ లేవవా!' వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ అడిగాడు రాజా.

'అబ్బ! నువు లేపకు. నేను లేస్తాలే! ఓ విషయం బాగా గుర్తు పెట్టుకో! నేను నిద్రలో పాట పాడుతున్నప్పుడు లేపకు. అర్థమయిందా?' అని ముసుగు తన్నాడు.

రాజా చాలా సేపు కూర్చుండి పోయాడు, సుబ్బారావు నోటిలోంచి మరేదైనా పాట వస్తుందేమోనని.

సుబ్బారావు అటు మెదిలాడు– యిటు మెదిలాడు, బోర్లా పడుకున్నాడు. వెల్లకిలా పడుకున్నాడు. ఇక లాభం లేదనుకుని లేచి కూర్చున్నాడు.

'నేను లేపలేదు,నువ్వేలేచావు, తెలిసిందా?' కొస్త భయంగా అన్నాడు రాజా.

'సరేలే! ఆ కల మళ్ళీ రాలేదు. సినిమా విశ్రాంతిలోనే ఆగిపోయినట్టయింది; ఒరే రాజా! వచ్చేజన్మలో నువు ఫ్లాప్ సినిమా నిర్మాతవయి పుడతావు!' అని శపించాడు.

'అయినా నిన్నని లాభమేవిటి! నా కర్మ అలా వుంది! నువ్వు పడుకో!'అని నిట్టూర్చి రాజాని నిద్రపుచ్చాడు. రాజా నిద్రపోయాడు అమాయకంగా.

'పిచ్చి రాజా! రేపు ప్రజల్ని ఎట్లా పాలిస్తాడో ఏమిటో?' అనుకున్నాడు. నిద్ర పట్టక లేచి పచార్లు మొదలెట్టాడు.

రాత్రి రెండయింది. రాజాకి మెలుకువొచ్చింది. సుబ్బారావు అట్లా పచారు చేస్తూనే వుండటం గమనించి 'ఏరా, నిద్ర రావడంలేదా?' అడిగాడు.

'లేదురా! అవును కానీ, నీ దగ్గర ఏకన మిక్సు టెకస్టు బుక్కుందా? కాలేజీలో ఏ పిల్లకైనా ఇచ్చావా?''.

'లేదు, నా దగ్గరే వుంది, అయినా చదువు మీద అంత శ్రద్ధ వచ్చిందేమిరోయ్!'

'అదిచదివితేనన్నానిద్రపడుతుందేమోనని?' ఆశగా అన్నాడు సుబ్బారావు.

రాజా పుస్తకం ఇచ్చాడు. సుబ్బారావు పక్కమీదకూర్చుని దీర్ఘంగా చదువుతున్నాడు. పదినిముషాలయింది. సుబ్బారావు పుస్తకం మూసాడు.

'ఏరా నిద్రవస్తోందా?' సంతోషంగా అడిగాడు రాజా.

''లేదురా! తలనెప్పి వస్తోంది.'' విచారంగా మొహం రుద్దుకున్నాడు సుబ్బారావు.

రాజాకు దుఃఖం పెల్లుబికి వచ్చింది. వెంటనే సుబ్బారావు రెండు చేతులుపుచ్చుకుని 'ఒరే సుబ్బారావు! నన్ను క్షమించు. శపించు. నీ కలను చెదరగొట్టాను. నీ నిద్ర చెదరగొట్టాను. నీ పక్క చెదరగొట్టాను. నీ తల చెదరగొట్టాను .. ఇంకా...ఇంకా...' అటూ ఇటూ మాటలకోసం వెతుకుతున్నాడు రాజా.

'నీ బాధ అర్థమయింది! దీనికి అన్ని సార్లు సినిమాలో మాదిరిగా డైలాగులు చెప్ప

"....దుందుభి–!"

కన్నీటి కడలి
కెరటాల హోరుతో
భగ్నగుండియ
వికృతరావాలతో
పథవిహీన బతుకు
పితూరల అపశ్రుతులతో
చిక్కుల చిమ్మచీకట్లతో
నిండిన ఈ ధాత్రికి
విచ్చేసిన దుందుభి
ముదంతెచ్చిందో!
లేక ఖేదమే తెచ్చిందో!
చూడాలి మరి??

– డి సి. కేశవరావు

క్కర్లేదు. అయినాగానీ ఒరే పిచ్చివాడా! కర్మ ప్రకారం అన్నీ జరుగుతాయి. చెడగొట్టడం, బాగుచెయ్యడం నీ చేతుల్లో ఏం వుంది?' సుబ్బారావు వేదాంతిలా సీలింగుకేసి చూస్తూ చెప్పాడు.

రాజా చెయ్యి చూసుకున్నాడు. 'అవును నా చేతిలో ఏమీ లేదు' అన్నాడు.

'నీకూ కర్మ సిద్ధాంతం తెలుస్తోంది!' సుబ్బారావు కళ్ళు సగం మూసి అన్నాడు.

'అంతా నీ దయ!' సిగ్గుపడ్డాడు రాజా.

సుబ్బారావు బరువుగా నిట్టూర్చి 'రాజా! నువ్వు ఒట్టి అమాయకుడవిరా! రేపు ఈ వూరిని నీ చేతుల్లో పెడితే ఎట్లా పరిపాలిస్తావురా?'

'నాకు సెక్రటరీలు వుంటారుగా!' అన్నాడు రాజు, అసలు పేరు రాజారావు.

'పోన్లే! ఆ మాత్రం తెలుసుకున్నావు!' అని మళ్ళీ దుఃఖంలో మునిగిపోయాడు.

'సుబ్రావ్! నీవిచారానికి కారణమేమిట్రో? ఇంటిదగ్గర్నుంచి మనియార్డరు రాలేదా? కొత్త సినిమా టిక్కట్లు దొరకలేదా? రేపట్నుంచి కామర్సు క్లాసులో ముందుసీట్లో కూర్చోమన్నాడా లెక్చరరు? కొత్త డ్రెస్‌వళ్ళు చిరుగుళ్ళువాచినెప్పిగావున్నాయా? కొత్తబూట్లు కరిచాయా? ఇల్లు గల్నాయన రూము ఖాళీ చెయ్యమన్నాడా?... ఏవిటి... ఏవిటి... చెప్పరా! నేను చేయగలిగింది చేస్తాను. మళ్ళీ నీకు ఆ కల రావాలా? నాకు చేతకాదు. ఇంకే మయినా చెప్పు. నా టెక్స్టు బుక్కులన్నీ ఇచ్చేయ్ మన్నావా? క్షమించు. గైడ్సు ఇవ్వను. నా సైకిలు ఇచ్చేయనా? నా భోజనం టిక్కట్లు పుస్తకం ఇచ్చేయనా? ఇంకా పలభై ఏళ్ల తర్వాత నా ప్రాణాన్ని ఇచ్చేయమన్నావా?' రాజా ఆవేశంగా అడిగాడు.

'వద్దులే! నే చెప్పేది విను! నేను ఓ అమ్మాయిని ప్రేమించాను. మన క్లాసే!' ఆగాడు సుబ్బారావు.

'ఎవ్రరా అది? తొందరగా చెప్పు! కొంప దీసి నే ప్రేమించిన పిల్లనే నువు కూడా ప్రేమించలేదు గదా?' రాజా కంగారుగా అడిగాడు.

'నువ్వు ప్రేమించావా? ఎవర్ని? చెప్పూ?'

'నువ్వు చెప్పు!'

'లేదు, నువ్వే చెప్పు!'

'నువ్వే చెప్పాలి!'

'నేను ప్రేమించిన అమ్మాయి పేరు

సుందరి!' అని ఆగి సందేహంగా రాజా మొహంలోకి చూసాడు.

రాజా నవ్వాడు. గట్టిగా నవ్వాడు — సుబ్బారావుని కౌగలించుకుని సంతోషంగా అరిచాడు.

'నేను ప్రేమించిన అమ్మాయి సుందరి కాదు! సూర్యకుమారి'సంతోషంగా చెప్పతూ అన్నాడు రాజా.

'బతికించావు. అట్నా వచ్చేసరికి భగ్న ప్రేమికుడవయి పిచ్చెక్కిందనుకున్నాను. పొన్లే గొప్ప ప్రమాదం తప్పిపోయింది. అందుకనే నీతి ఏమిటంటే, నువ్వు ఎవరినన్నా ప్రేమించావనుకో, వెంటనే, అది నీ స్నేహితుడికి చెప్పేయాలి. అప్పుడు వాడు నీకు అడ్డురాడు' అన్నాడు సుబ్బారావు.

'సరే, నీ ప్రేమ కథ చెప్పు!'

'సుందర్ని ప్రేమించావని చెప్పాగా! చాలా గాఢంగా ప్రేమించాను. నవ మన్మథులు తమ పదవుల్ని వింతగా ప్రేమిస్తారో, అంత గాఢంగా నన్నమాట! ఇక వుండబట్టలేక ఉత్తరం రాసేసాను!'

'అమ్మో!' గుండెలమీద చెయ్యి వేసుకుని కళ్లు పెద్దవి చేసి అన్నాడు, 'తర్వాత?'

'తర్వాత పోస్టు చేసాను!'

'మరయితే, దిగులెందుకు? స్టాంపులు అతికించలేదా?' రాజా అడిగాడు;

'అదీ చేసాను!'

'అడ్రసు రాయలేదా? లేక పొరపాటున జయమాలిని అడ్రసు రాసావా?'

'లేదు కరక్టు అడ్రసే రాసాను.'

'ఇది నా స్వంత రచన, దేనికీ అనువాదం గానీ, అనుసరణ గానీ కాదని, ఇంతకు ముందు ఈ ప్రేమలేఖని ఎవరికీ పంపలేదని హామీపత్రం రాసావా?' రాజా అడిగాడు.

'అదీ రాసాను!'

'మరయితే, దిగులెందుకు?' దిగులుగా అడిగాడు రాజా.

'సుందరి తెలుగు భాషాభిమాని అట! ఉత్తరంలో ఇంగ్లీషు వ్రాస్తే వాడ్ని ప్రేమించకపోగా, ద్వేషిస్తుందట!'

'మరి నువ్వు ఏ భాషలో రాసావు? ఇంగ్లీషులోనా?' ఎంతో ఆశ్చర్యంగా అడిగాడు.

'లేదు, సగం ఇంగ్లీషు, సగం తెలుగు, —రెండూ కలిపి రాసాను'అన్నాడు సుబ్బారావు.

'అయితే నిన్ను ప్రేమిస్తూ ద్వేషిస్తుందేమో?' లేదా, రెండూ చెయ్యడం మానేస్తుందేమో?'

'అయితే నా ప్రేమేంగాను?'వున్నట్టుండి బావురుమన్నాడు సుబ్బారావు.

'అదేమిటా అలా అయిపోయావు? నేనున్నానుగా. నీ ఆపద నా ఆపద. పద!' అన్నాడు రాజా.

ఏడుపు ఆపి 'ఎక్కడికి?' అడిగాడు సుబ్బారావు.

'ఆ అమ్మాయి దగ్గరికి వెళ్లి, ఇట్నా మా వాడు ఉత్తరం రాసాడు. దాని సంగతేం జేసారు? అని అడుగుతాను. అన్నట్టు నువు రాసి ఎంత కాలమయింది?'

'పది రోజులు!'

'చిన్న ప్రేమ లేఖను పరిశీలించడానికి ఇన్ని రోజులా? అని అడుగుతాను' అన్నాడు రాజా.

'నిజంగానా?' ఆరాధనా పూర్వకంగా అడిగాడు సుబ్బారావు.

'మగవంట'కు గుర్తింపు

కొద్ది సంవత్సరాల క్రిందటిమాట— జపానులో పురుషులు వంటింట్లోకి ప్రవేశిస్తే, స్త్రీవారికి బొద్దింకమొగుళ్లని మారు పేర్లతో పిలిచేవారు. అలాంటిది యీ నాడు పరిస్థితి పూర్తిగా మారి వంట చేసే మగవారికి అపారమైన గౌరవం కూడా లభిస్తున్నది. రోజులు మారడంతో మగవంటకు గుర్తింపు లభించింది. దరిమిలా జపానులో 1977 లో "వంటింటి పురుషుల క్లబ్బు" అనే క్లబ్బు కూడా ఏర్పడింది. కేవలం 30 మందితో ప్రారంభమైన యీ క్లబ్బులో ప్రస్తుతం 600మంది సభ్యులున్నారు. వీరిలో పెద్ద ఉద్యోగాలలో వున్నవారు, డాక్టర్లు, లాయర్లు కూడా వున్నారు. వీరు ప్రతి నెలా సమావేశాల్ని జరుపుకొని విదేశీ వంట నిపుణులను ఆహ్వానించి క్రొత్త వంటలను కూడా నేర్చుకుంటున్నారు.

'నిజంగానే! పద!'

'ఇప్పుడెళితే దొంగలనుకుని పట్టుకుంటారు. తెల్లారిన తర్వాత, ఫ్రెష్‌గా వెళదాం!' అన్నాడు సుబ్బారావు.

'ఇంగ్లీషు మాటలు వాడడం మానేయ్! అదే అన్ని అనర్థాలకు మూలం!' కసురుకున్నాడు రాజా.

సుబ్బారావు రెండు మూడు సార్లు నాలిక కరుచుకున్నాడు ఇంగ్లీషు మాటలు రాకుండా తర్వాత ఇద్దరూ నిద్రపోయారు— ఎప్పుడు తెల్లారుతుందా అనుకుంటూ!

తెల్లారింది. ఇద్దరూ దిగ్గున లేచారు. గబగబా మొహాలు కడుక్కుని స్నానాలుచేసి హోటలుకెళ్లి రెండిడ్లీ కారప్పొడి తినేసి కాఫీ తాగి, సైకిళ్లేసుకుని (కిళ్లీలు కాదు) సుందరి ఇంటి ముందు వాలారు.

రాజా ధైర్యంగా సుందరి వాళ్ల భవనం గేటు తెరిచాడు.

'ఎవరు కావాలి?' పనిమనిషి అడిగాడు.

'సుందరిగారి కోసం వచ్చాం!' అన్నాడు రాజా ధైర్యంగా!

సుబ్బారావు పిరికిగా రాజావెనక నడిచాడు.

'హాల్లో కూర్చోండి! అమ్మాయిగార్కి చెప్పేసి వస్తాను!' అన్నాడు.

రాజా సైకిలు స్టాండు వేసి దర్జాగా లోపలికి నడిచాడు. 'వీడిధైర్యం మండిపోనూ! పగలు ప్రతాపరుద్రుడు, రాత్రిళ్లు (ఏడుపు) రాగాల రాజా.' అనుకున్నాడు సుబ్బారావు. సైకిలు స్టాండు వేసి తనూ రాజాతోపాటు హాల్లో సోఫామీద కూర్చున్నాడు.

హాల్లో గోడలకు లేడి తలకాయ, పులి తలకాయ కనిపించాయి. రేపు తన తలకాయ కూడా అక్కడ వుంటుందేమో అనిపించింది సుబ్బారావుకి. లోపల చలిజ్వరం మొదలయింది.

అక్కడ అందమైన బల్లమీద అన్ని తెలుగు పత్రికలున్నాయి.

సుందరి మందరంగా హాల్లోకి వచ్చి చూసింది. సుబ్బారావు దిగ్గున లేచాడు. అటూ ఇటూ కంగారుగా ప్రవహిస్తోంది అతని ఒంట్లోని రక్తం.

రాజా కూడా లేచాడు.

'సుబ్బారావుగారా! కూర్చోండి! రాజాగారూ కూడా వచ్చారే! ఏమిటీ విశేషం? ఇంత ఉదయాన్నే?' అడిగింది నవ్వుతూ. తనూ ఎదురుగుండా సోఫాలో కూర్చుంది.

'మా సుబ్బారావు ఒక ప్రేమలేఖ రచించాడు. పరిశీలనార్థం మీకు పంపించాడు. అది మీకు ఆమోదయోగ్యమా లేదా? తెలుసుకుందామని వచ్చాం!' అయిదు విముషాల తర్వాత అన్నాడు రాజా.

'అమ్మో! అమ్మో!! వీడి ధైర్యం మండిపోను. ఇడ్లీలో కారప్పొడి బాగా వేయించుకుని తిన్నాడేమో? పొన్లే నన లేకుండా చెప్పేసాడు' అనుకున్నాడు సుబ్బారావు.

సుందరి మొహం వీరనయింది! ఓ విముషం తర్వాత అంది: 'ఉత్తరం రాసింది సుబ్బారావుగారు కనుక, నేను ఆయనతో మాట్లాడుతాను!' అని సుబ్బారావు కేసి తిరిగింది.

సుబ్బారావుకి చెమటలు పట్టేశాయి. అది చూసి 'మా వంకా అంతకంటే వేగంగా తిరగదు, ఏమీ అనుకోకండి' అంది. వెంటనే 'సుబ్బారావుగారూ! మీ ఉత్తరం చదివాను. మీకు తెలుగ్గానీ, ఇంగ్లీషుగానీ రాదని తెలుస్తోంది- ఆ ఉత్తరం చూస్తోంటే! ఇంగ్లీషు పరాయి భాష కాబట్టి సర్దుకుంటాము. తెలుగు కూడా రాయడం రాదు కదా! అన్నీ తప్పులే! ఒకదాని కొకటి దీర్ఘాలు, ఒకదానికొకటి వత్తులు, మీరసలు తెలుగు వారేనా?' అడిగింది.

'తెలుగు వాళ్ళమేనండి!'

'ఏ ప్రాంతం? ఏం జిల్లా?'

చెప్పాడు.

'సిగ్గు లేదూ? తెలుగు నడిగడ్డ మీద పుట్టి తెలుగు సరిగా రాయడం చేతకాదు. ఇట్లా అయితే మీ రెప్పుడు బాగుపడతారు? మన భాష ఎప్పుడు బాగుపడుతుంది?' ఆవేశంగా అంది.

రాజాకి కూడా కోపం వచ్చింది. సుబ్బారావు వంక తిరిగి 'ఏరా? ఉత్తరం చివర్లో తప్పులున్న ఎడల క్షమించి ఒప్పులుగా భావించవలెను అని రాయలేదా?' అని మళ్ళీ సుందరి వేపు తిరిగి 'వాడుట్టి కంగారు గొడ్డు, రాయడం మర్చిపోయాడు' అని నవ్వాడు.

'అది తెలుస్తూనే వుంది. ఆ ఉత్తరంలో సగానికి పైగా ఇంగ్లీషు మాటలు. డియర్.. లవ్ .ఐ లవ్ యూ..పార్కు,హార్టు .టైము.. ఇంట్లా ఎన్నో. మీలాంటి వారిని ఏం మొహం పెట్టుకుని ప్రేమించను? మీరు తెలుగువారు. తెలుగు భాషమీద అభిమాన ముండాలి. కన్న తల్లి లాగే కన్న భాష తెలుగు భాష నేర్చుకోవాలి తెలుగు చదవాలి తెలుగు రాయాలి. ఇతరలకు నేర్పించాలి. ఇతర చేత రాయించాలి. మనదేశంలో ఎక్కువగా ప్రజలు మాట్లాడే భాషలో రెండవ స్థానం ఆక్రమించింది- ఆ విషయం మీకు తెలుసా?'

'తెలీదు'అన్నాడు ఆశ్చర్యంగా సుబ్బారావు.

"అందుకే గురజాడ 'మనవాళ్ళుట్టి వెధివాయిలోయ్' అన్నారు" అంది సుందరి ఆవేదనగా.

'చిన్న కరెక్షను!' అన్నాడు రాజా.

సుందరికి ఒళ్ళు మండిపోయింది. 'ఇంగ్లీషు మాటలొద్దు, తెలుగులో పలకండి దానిని!' అంది.

రాజా తమాయించుకుని 'చిన్న వివరణ' అన్నాడు.

సుందరికి మళ్ళీ ఒళ్ళు మండింది. 'వివరణ గాదు! సవరణ' అని అనాలి' అన్నాడు సుబ్బారావు.

సుందరి ఆశ్చర్యంగా సుబ్బారావు వంక చూసి, అనక ప్రేమగా చూసి నవ్వింది.

'అవును, చిన్న సవరణ?' అన్నాడు రాజా.

'ఏమిటది?' సుందరి అడిగింది.

'అది గురజాడ అప్పారావు అనలేదు!'

'మరి?' కళ్ళు పెద్దవిచేసి చూసింది!

'గిరీశం అన్నాడు' అన్నాడు రాజా. సుందరి గలగలా నవ్వేసింది.

'అమ్మయ్య మీ కోపం పోయినట్టుంది!' అన్నాడు రాజా.

'ఇంకా పోలేదు. గురజాడ ఆ మాట గిరీశం చేత అనిపించి మంచిపని చేసాడు. మన వాళ మీద కోపం వచ్చినప్పుడల్లా తిట్టుకోడానికి' అంది.

'ఇంతకీ మా సుబ్బారావు ప్రేమలేఖ?' రాజా నసిగాడు.


'పరిశీలించడం జరిగింది. తపాలా బిళ్ళలు జతచేసి స్వంత చిరునామా రాసిన కాగితపు సంచీ వున్నట్టయితే, దానిని తిప్పి పంపడం జరుగుతుంది' అంది గంభీరంగా.

'ఆఁ!' అన్నాడు సుబ్బారావు.

'తెరిచిన నోరు మూసుకుని ఇకవెళ్ళిరండి!' అంది సుందరి విసురుగా.

సుబ్బారావు దిగులుగా లేచి తల వంచుకుని వెళిపోయాడు రాజా సుందరి దగ్గరగావెళ్ళి 'మీరు వాణ్ని క్షమించాలి. వాడికి తెలుగు సరిగ్గా రాదు- పాపం చిన్నప్పడంతా కాన్వెంటులో చదివాడు.

'మరయితే ఇంగ్లీషు కూడా తప్పులేకదా!' విసుగ్గా అంది సుందరి.



తెలుగు ప్రేమ

చదివింది కాన్వెంటులోనైనా, అక్కడ టీచరుకు ఇంగ్లీషు సరిగారాక, పాఠాలు తెలుగులో చెప్పేవారట. ఆ విధంగా పాపం, అటు తెలుగూరాక, ఇటు ఇంగ్లీషూ రాక, మీ ప్రేమకు నోచుకోకపోయాడు, ఎట్లాగయినా అతన్ని మీరే కాపాడాలి !'


'నేనేం చెయ్యను ?' విసుగ్గా అంది.

'మీరే అతనికి తెలుగు బోధించండి. పండితుడ్ని చేయండి. గొప్పవాడ్ని చేయండి.' రాజు ఆవేశంగా చెప్తున్నాడు.

'ఆగండి. కొన్ని షరతులు సుబ్బారావే కాకుండా, మీరంతా ఇకనుంచి, తెలుగులో బాగా రాయడం నేర్చుకోవాలి. తెలుగుపత్రికలు విరివిగా చదవాలి. తెలుగు దినపత్రికలను విధిగా చదవాలి. ఎక్కడికెళ్ళినా తెలుగు వాడినని గర్వంగా చెప్పుకోవాలి.

తెలుగు సినిమా గానీ, సాహిత్యం గానీ, బాగోలేకపోతే, దాన్ని ఖండించాలి. పత్రికలకు ఎప్పుడూ ఉత్తరాలు వ్రాసి మీ అభిప్రాయాలను వెలడి చేసుకోవాలి అడ్డమైనవాటికి కాకుండా తెలుగు బాషకు అభిమాన సంఘాలు పెట్టాలి ! ఇంత పెద్ద దేశంలో మనమూ వున్నాం అని తెలియజెయ్యాలి ! ఎంతసేపూ సినిమా కబుర్లు చెప్పుకోకుండా, తెలుగుభాష మీద చర్చలు పెట్టుకోండి. స్త్రీల కళాశాల వారి వాహనం వెళుతున్నప్పుడు 'పాల వ్యాను' అని అరవడం మానెయ్యండి. ఆడపిల్లను గౌరవించడం నేర్చుకోండి. తెలుగు బాషను ఆడపిల్లలాగే ఎగతాళి చెయ్యకండి. దాన్ని గౌరవించడం నేర్చుకోండి. ఇప్పుడు నే చెప్పిన షరతులన్నీ కాగితం మీద రాసి మీ విద్యార్థులంతా సంతకం పెట్టండి. అప్పుడు నేను సుబ్బారావుని తెలుగు కన్నా ఎక్కువగా ప్రేమించడానికి నాకు అభ్యంతరం లేదు. శలవు !' అని సుందరి వెళ్ళిపోయింది వేగంగా.

'అబ్బో ! చాలా గొడవుందే ? కాలేజీ కుర్రాళ్ళంతా చెబితే వింటారా ? తానేమైనా రాజకీయనాయకుడా! వాళ్ళను బుట్టలో వేసుకుని, కాగితాల మీద రాసి సంతకాలు పెట్టించుకోడానికి ? ఇదేదో తేలే వ్యవహారంలా లేదు. ఒరే! సుబ్బారావు ! ఇక నీకు దేవుడే... కాదు కాదు ... తెలుగే దిక్కు !' అంటూ సుబ్బారావుని వెతుక్కుంటూ బయలుదేరాడు రాజారావు.





ఆరోగ్యమిచ్చిందే పళ్ళు, చిగుళ్ళకోసం నమ్మకంగా వాడబడేది లవంగనూనె

కొత్త


ఇదిగో

ప్రామిస్ పళ్ళపొడి

అనాదిగా వాడబడుతున్న లవంగనూనెతో కూర్చినది

లవంగనూనెతో కూడిన ప్రామిస్ పళ్ళపొడి మీకెలా తోడ్పడుతుందో చూడండి.

- నోటిలో దుర్వాసనను, దంతక్షయాన్ని కలిగించే క్రిములని తొలగిస్తుంది. మీ నోటిని శుభ్రంగా రూపొందిస్తుంది.
- మీ చిగుళ్ళ ఆరోగ్యం చిందించేలా చేసి అతి మెల్లగా రుద్దుతుంది.
- మీ పళ్ళను తెల్లగా తళతళలాడేలా చేస్తుంది.
- పిప్పరమెంట్ మరియు లవంగనూనె యొక్క సాటిలేని రుచి.



3 బలసారా
—సౌఖ్యమైన జీవనానికి ఆధునాతన సాధనాలు

కొత్తది. సాటిలేనిది. లవంగనూనె గలది ప్రామిస్ పళ్ళపొడి

(CHAITRA-B[illegible])

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

హనుమాన్ – విజయవాడ

రామలక్ష్మి గారూ! మీరు పద్ధతికి విరుద్ధంగా పేరు పెట్టుకున్నారే? సీతారాములు, రుక్మిణీ కృష్ణుల్లాగా కాకుండా?

బాబా ఇది నే పెట్టుకున్న పేరు కాదు. మా అత్తయ్య పేరు. ఈ గయ్యాళితనం ఏమి నా దగ్గర లేదంటూ మేనంటూ ... వాళ్ళు.

సూటిగా సమాధానం చెప్తే గర్వం అనుకుంటారు కదండీ

నీళ్ళు నమిలిన సంగిరి అనుకోరా? ఎలా చెప్పినా ఏదో ఒకలా అనుకుంటారు కనుకనే అనుకున్నది చెప్పడం.

జి. జి. ఆర్. – విజయనగరం

నేను అందరితో స్నేహంగా వుంటాను. కాని అందరూ స్నేహంగా వుండి నన్ను అభిమానంగా చూస్తున్నారు?

ఏ క్లాసు చదువుతున్నావోయ్ ...గా ధరం? మరి అలా వెర్రిబాగులవాడిలాగా వుంటే— లోకువే చేస్తారు మరి.

పి. ఆర్. ఆర్. – సూళూరుపేట

రెండు ఆడపేర్లు కలిసి ఉన్న మీరు— రాముని భక్తులా? లేక లక్ష్మీదేవి భక్తులా?

డబ్బుంటే ఇష్టం లేక పోలేదు కాని డబ్బే దైవంకాదు నాకు. దేవుడంటేనా ఇష్టమేకాని భయంలేదు.

కె. ఎస్. కె. ఆర్. – హైదరాబాదు

ఒకవైపు ఆదర్శం, ఒకవైపు తల్లిదండ్రుల బాధ. ఏవైపు వుండాలి?

భార్యను పోషించలేనప్పుడు తల్లిదండ్రులను ఒప్పించడం నీవల్ల కాదు. అది లేకుండా ఆదర్శానికి తావుండదు. పెళ్ళాన్ని పోషించుకోలేని నీకో ఆదర్శం కూడానా? అంటారు.

విం ఎస్. ఆర్. – టి_వలి

మీకూ, నాకు గల ఆ అవినాభావ సంబంధాన్ని ఒక్క ప్రశ్నావళే అనాలా?

కాక?

శ్రీనివాసులు – ఆదోని

నేనో అమ్మాయిని ప్రేమించాను. కాని ఆ అమ్మాయి పెళ్ళి నిశ్చయం చేస్తున్నారు. నన్నేం చేయమంటారు?

మూర్ఖుడివటు? అంతగా ప్రేమించిన అమ్మాయి పెద్దల ముందు నిలబడే ధైర్యం లేని కుర్రాణ్ణి పెళ్ళి చేసుకుని ఏం సుఖపడుతుందా అమ్మాయి?

వి. ఎల్. – ధరూర్

నిరుద్యోగ సమస్య పెరుగుతున్న మనదేశంలో స్త్రీలకు ఉద్యోగాలు ఎందుకండీ? నిరుద్యోగ సమస్య మరీ పెంచడానికా?

కాదు. కట్నాలు పోసి మొగుళ్ళని కొనుక్కుందుకు. అదే ప్రశ్న ఉద్యోగార్హతలు కల్గి ఉద్యోగం దొరక్క ఉన్న ఆడది మిమ్మల్ని అడిగితే ఏం చెప్తారు?

వి. ఎమ్. – సికింద్రాబాదు

జీవితమే పోరాటం అంటే ఎన్నాళ్ళు సాగించగలం?

జీవితం ఎప్పుడూ — బలహీనులకి పోరాటంగానూ, బలవంతులకి ఆటగానూ వుంటుంది మూర్తిగారూ. తప్పదు.

బి. వి. జి. ఆర్. – కర్నూలు

ఆడది అంటే అబల అంటారు. ఏమంటారు?

అంతా అలా వుండకల్గితే ఎంత బాగుండును అంటాను. ఎందుకంటారా? రాబందులూ డేగలూ, రాక్షస జాతి మనుష్యులూ తిరిగే ఈ సమాజంలో కాస్త ధైర్యంగా బ్రతికేది వాళ్ళే.

వై. ఎస్. – ఆదోని

ఎలక్షన్‌లో ప్రచారం చేయడం ఎందుకు? ఎన్నికల ముందు కనీసం అతగాడైనా పేరు చెప్పేవాడు వుండాలని.

మధు – మామిడిపల్లి

నేటి రచయిత్రులు సంఘం నేలల్తి చూపించే రచనలే చేస్తున్నారు. స్త్రీ అభ్యుదయానికి పాటుపడే నవల చైతన్యాన్ని అందించలేరు. ఎందుకు?

ఎందుకేమిటి మధుబాబు, రాయడం చేతకాక. అక్కడికీ ఎలాంటి రచనలు చేయాలో, మగ రచయితలు చూపిస్తూనే వున్నారు. అయినా చాలా మంది అంత అభ్యుదయం అంటే వూహించలేని సాధారణ ఆడవాళ్ళు, మతిని పెంచక పోతేనరి. మరి పోకాల్చే రచనలు చేయనందుకు ఆనందించకూడదా?

జి. కె. ఎమ్. – హైదరాబాదు

వర్తమానానికి అర్థం ఏమిటి కె. రా. గారూ?

భవిష్యత్తుకి కారణమై గతానికి ఫలితమైన ఈ వర్తమానం మూర్తిగారూ.

కె. వి. ఎస్. ఎస్. – కొవ్వాడ

మాటకి విలువ ఎక్కువా? మనిషికి విలువ ఎక్కువా?

మాటచ్చే మనిషిని పట్టి వుంటాయి.

పి. పి. ఎస్. – పొన్నూరు

స్నేహితులు మంచివారని, వారివద్ద ఎంతో విజ్ఞానాన్ని సంపాదించవచ్చునని భావించి స్నేహం పెంచుకొన్నాను. కాని నన్ను చాలా మంది మోసం చేశారు.

విశ్రవాడ, నరధాని కంపెనీ, విజ్ఞాన సముపార్జనకి ఏకాంతం కావాలని తెలియదా?

ఎమ్. కె. – సికింద్రాబాదు


మార్క్సిస్టు అయితేగాని అభ్యుదయవాది కాలేడా?


నాకు తెలియదు. కాని ఒక్కటి మాత్రం నిజం. ఎదుటివాడికి తాను కోరుకొనే స్వేచ్ఛ కోరని వాడి స్వేచ్ఛకూ రక్షణ లేదు! మతం పుచ్చుకొంటేగాని ముందు పనిచేయడనడం— హాస్యాస్పదం!

ఆర్. వి. – అనకాపల్లి

నేటి బాల్సరే రేపటి పౌరులు అన్నది నాటి సూక్తి. నేటి బాల్సరే రేపటి కూలీలు నేటి సూక్తి—అంటాను ఏమంటారు?

అంత ధైర్యంగా ఎలా చెప్పగల్గుతున్నారు. కూలీనా దొరుకుతుందని?!





కాకతాళీయం

రావిపల్లి నారాయణరావు

సుమారు ఐదు గంటలకు రావలసిన కృష్ణా ఎక్స్‌ప్రెస్ గంటన్నర లేటుతో ఖమ్మం చేరుకుంది. అంతవరకు ఇంటర్వ్యూకి వెళుతున్నానన్న ఆనందంతో ఉరకలు వేసిన నా మనసు తీరా రైలు వచ్చాక వెళ్లాలా, వద్దా అన్న మీమాంసలో పడ్డాను. రైలు రైట్ టైముకు వస్తుందన్న ధీమాతో ఒంటరిగా హైదరాబాద్ ప్రయాణం కట్టాను. "హైదరాబాద్ వెళ్లేసరికి చాలా పొద్దు పోతుంది, రోజులు బాగాలేవు?" అని అంకుల్ వార్నింగిచ్చినా – 'హైదరాబాద్ నాకేం కొత్త కాదులే బాబాయ్, రైలు దిగగానే బొలారం లోకల్ ఎక్కి కూర్చుంటే పదినిముషాల్లో మల్కాజ్‌గిరి చేరుకోవచ్చు?' – అని మొండికెత్తి బయల్దేరాను. మర్నాడే ఇంటర్వ్యూ... లేకపోతే నేను కూడా అంత తొందరపడే దాన్ని కాదు.

గార్డు విజిల్ వినిపించింది. ఆలోచించి కాలయాపన చేస్తే యిక లాభంలేదని బండి ఎక్కి కూర్చున్నాను. ధైర్యంగా బయల్దేరాను కాని సింహంలా గర్జించి కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఖమ్మం స్టేషన్ వదలగానే నా గుండెలు దడదడా కొట్టుకోసాగాయి. స్టేషన్ ప్లాటుఫారం రైలు విడిచి పెట్టిందో లేదో బండిలో లైట్లు వెలిగాయి. కిటికీ నుండి బయటకు తొంగి చూసాను. ఆకాశంలో చీకట్లు కమ్ముకున్నాయి. ఇదే లేటుతో బండి హైదరాబాద్ వెళితే టైం పదిన్నరదాటుతుంది. ఆఖరి లోకలైనా అందుతుందో లేదో?!

రోటిలో తల దూర్చి రోకటి పోటుకు భయపడ్డమదేనికి? గుండె రాయి చేసుకుని, హేండ్‌బ్యాగ్ తెరిచి చూసాను. ఇంటర్వ్యూకు హాజరు కమ్మని పంపిన కాల్ మెమో, కావలసిన సర్టిఫికేట్లు పెట్టుకున్నానో లేదోనని. అన్నీ సరిగ్గా ఉన్నాయని కన్‌ఫర్మ్ చేసుకున్నాక మనస్సు కుదుటపడింది.

బండి వేగాన్ని పుంజుకుంది. పెట్టెలో కదలక మెదలక కూర్చున్న నేను నాలుగు వైపుల దృష్టిని ఒకసారి పోనిచ్చాను. రకరకాల మనుషులు, ఎవరి బాధలు వారివి. బాధల్లో ఉన్నవారు బండి ఎప్పుడు తమ గమ్యస్థానం చేరుతుందా, ఇంటికి ఎప్పుడు చేరుకుంటామా అని మీనమేషాలు లెక్క పెడుతూ కూర్చుంటే, బాధాబందీ లేనివాళ్లు బండల్ని బద్దలు కొట్టినట్టు ప్రపంచ రాజకీయాల్ని ఒక్కసారిగా ఏకరువు పెడుతున్నారు.

నా ఎదుట బెంచీలో కిటికీ ప్రక్కన కూర్చున్న వ్యక్తి మాత్రం ఏ సంభాషణలోను జోక్యం కలుగజేసుకోకుండా మౌనంగా కూర్చున్నాడు. కాని అతనెందుకో నావైపే చూస్తున్నట్లు కనిపించాడు. అతన్ని నేనెక్కడైనా చూశానా? అతనే ఎక్కడైనా నన్ను చూశాడా?!... ఏమో గుర్తుకు రావటంలేదు. అతను అంతగా చదువుకున్నట్టులేదు, కాకీ దుస్తులు వేసుకున్నాడు. నల్లటి విగ్రహం అయినా బలిష్ఠంగా ఉన్నాడు. తలకి నూనె రాసి, గెడ్డానికి బ్లేడ్ స్పర్శ తగిలి చాలా కాలం అయి ఉంటుంది. దూరానికి క్రైమ్ చిత్రాల్లోని విలన్‌లా కనిపిస్తాడు.

వరంగల్‌లో రైలు ఆగి మళ్లీ వేగాన్ని పుంజుకుంది. చివరి వరకు అలాగే పరుగిడితే హైదరాబాద్‌లో ఆఖరి లోకల్ తప్పక దొరుకుతుందన్న ధైర్యం కలిగింది.

మనిషి చాలా విచిత్రమైన మనిషి. ఏదైనా తనకు అనుకూలంగా ఉంటుందని ఆశిస్తాడు. ఆసుపత్రిలో చేరిన ప్రతి రోగికి ప్రాణాలతో తిరిగి బయట పడతానన్న ఆశ ఉన్నట్టే, పరీక్ష రాసిన విద్యార్థులంతా పరీక్ష పాసవుతామన్న విశ్వాసంతో ఫలితాలకోసం ఎదురు చూస్తారు. ఆఖరి లోకల్ దొరుకుతుందన్న నా ఆశ కూడా అలాగే ఉంది!

హేండ్ బ్యాగ్‌లోని జెనరల్ నాలెడ్జి బుక్ తీసి చదువుదామని కూర్చున్నాను. పేజీలు తిరగవేస్తూ ఎదుట బెంచీలో కూర్చున్న కాకీ దుస్తుల వ్యక్తిని చూసాను. అంతవరకు నా వైపు చూస్తున్నవాడు మొహం పక్కకు తిప్పేసుకున్నాడు. ఇతను ఎవరు? ఎక్కడ నుండి వస్తున్నాడు? ఒంటరిగా బండి

ఎక్కడం చూసి నా వెంట బడ్డాడా? సముద్రంలోని కెరటాల్లా అంతులేని ఆలోచనలు.

మనిషి మనసుకు హద్దంటూ లేదు. చిటికెలో అది సప్త సముద్రాలు దాటేస్తుంది. ముల్లోకాల్ని చుట్టి వస్తుంది. తనకు నచ్చిన వ్యక్తి ఎదుట కూర్చుని తన వైపు ఒకసారి చూస్తే చాలు, తన అందానికి ఆ వ్యక్తి చలించిపోయి వుంటాడని విర్రవీగి పోతుంది. తనకు నచ్చని వ్యక్తి అలాగే చూసాడో- రౌడీ వెధవ, ఎలా చూస్తున్నాడో చూడు— అని మనస్సులో తిట్టుకుంటుంది.

ఆ కాకీ దుస్తుల వ్యక్తి నేను బండి ఎక్కకముందే పెట్టెలో కూర్చుని ఉన్నాడను కుంటాను. పైగా అతను ఎందుకు చూస్తున్నాడో! దురుద్దేశంతోనేనని మనం ఎందుకు ఊహించాలి?! ధైర్యం నాలో ప్రవేశించేక మనస్సు పుస్తకం మీద లగ్నం అయింది. అయిదు నిముషాలు అలా చదివానో లేదో ప్రక్క 'బే'లో రాజకీయాలు మాట్లాడు కుంటున్న ఆరుగురు భళ్ళున నవ్వారు. మళ్ళీ వాదనలో పడ్డారు. నా చదువు సాగలేదు. పుస్తకం మూసి హేండ్ బ్యాగ్‌లో పెట్టాను.

పట్టాలమీద రైలు చకచకా పోతున్నట్టే మనస్సులో ఒకటి వెంబడి మరొకటి- సమాధానం దొరకని ప్రశ్నలు.

ఎన్నాళ్ళిలా ఇంటర్వ్యూలకు వెళ్ళాలి? ఉద్యోగం దొరికేదెప్పుడు?-ఈ ప్రశ్న హైదరాబాద్‌లోని బావగారు చాలాసార్లు వేశారు— 'పోస్టుగ్రాడ్యుయేట్‌వి. పైగా డిస్టింక్షన్‌లో పాసయ్యావు, నీకే ఉద్యోగం దొరకలేదంటే నాకే చిన్నతనంగా ఉంది మరదలా!' అంటూ.

ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ చేరేసరికి పావు తక్కువ పదకొండు అయింది టైము. బొలారం ఆఖరి లోకల్ వెళ్ళిపోయి వుంటుం దన్న భయంతో బండి దిగాను.

"బొలారం లోకల్ కొద్ది నిముషాల్లో నాల్గవ నెంబరు ప్లాటుఫారం నుండి బయ ల్దేరును"— అన్న అనౌన్సుమెంటు విన్న తర్వాత పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్ట యింది. ఓవర్ బ్రిడ్జి దాటుకుని వెళ్ళి నాల్గో నెంబరు ప్లాటుఫారంలో ఉన్న లోకల్ ఎక్కి కూర్చున్నాను. బండి అంతా చాలా ఖాళీగా ఉంది. నేను ఎక్కి కూర్చున్న పెట్టెలో ఇద్దరు ముగ్గురు ప్యాసింజర్లకన్నా ఎక్కువ లేరు. కూర్చున్న కొద్ది నిముషాలకు

కాకతాళీయం

ఒక్కొక్కరి ముఖంలోకి పరిశీలనగా చూడగా ఖమ్మం నుండి నాతో పాటు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన కాకీ దుస్తులవాడు ఆ పెట్టెలోనే కనిపించాడు.

ఆ పెట్టె దిగి మరో పెట్టె ఎక్కాలను కునే సమయంలో లోకల్ కదిలింది.

ఈ కాకీ దుస్తుల వ్యక్తి ఎవరు? ఎన్నెందుకిలా వెంబడిస్తున్నాడు?? నేను ఒంటరిగా బయల్దేరుతున్నానన్న విషయం ఖమ్మంలోనే ఇతను గ్రహించాడా???

తైల సంస్కారంలేని జుత్తు— మాసిన గెడ్డం— కాకీ దుస్తులు— ఇతను ఏదో దురుద్దేశంతోనే నా వెంటపడి వుండాలి, లేకపోతే ఆరు పెట్టెలున్న ఈ లోకల్ ట్రైన్లో సరిగ్గా నేనెక్కిన పెట్టెలోనే తను ఎందుకుంటాడు? ఏమిటో ఇదంతా మిస్టరీలాగుంది. నాదగ్గ రేముందని నన్ను వెంబడిస్తున్నాడు? హేండు బ్యాగ్‌లో కాల్ మెమో, సర్టిఫికేట్లు తప్ప తిరిగి వెళ్ళడానికి రైలు చార్జీలు కూడా లేవు. అక్కయ్య దగ్గర తీసుకొని వెళ్ళాలి. మెడలో కనీసం రోల్డుగోల్డు హారం కూడా లేదు. తల్లిదండ్రిలేని బిడ్డను హైద్రాబాద్‌లో ఉన్న అక్క – ఖమ్మంలో ఉన్న పిన్ని – ఆదరాభిమానాలతో నేను జీవిస్తున్నాను. రేపు ఇంటర్వ్యూలో సెలక్టయితే చిక్కడపల్లి వెళ్ళి వెంకటేశ్వర స్వామికి రెండు కొబ్బరి కాయలు కొడతానని మొక్కుకున్నాను.

నా బాధంతో నేను చస్తూంటే వీడెవడో నా వెంట పడతాడేమిటి? – "బ్రదర్ నా దగ్గరేమిలేదు. నీకు ఆశాభంగం కలిగించటం నాకు యిష్టం లేదు, అందుకే ముందుగా చెబుతున్నాను" అని చెప్పాలనుకున్నాను. కాని నోట మాట రాలేదు. భయంతో శరీరం ముడుచుకు పోయింది. ధైర్యంగా ఉన్నదానికి మల్లే హేండ్ బ్యాగ్‌లోని జనరల్ నాలెడ్జి పుస్తకం తీసి పేజీలు తిరగేస్తు కూర్చున్నాను. లాలాగూడ స్టేషన్లో ఇద్దరు దిగిపోయారు. ఇక ఆ పెట్టెలో మిగిలింది ఆ కాకీ దుస్తుల వ్యక్తి, నేను. ఆ నిశ రాత్రిలో రైలు పెట్టెలోని విద్యుద్దీపాల వెలుతుర్లో ముక్కుమొహంతెలియని ఒకవ్యక్తి సమక్షంలో పుస్తకంలోని ఎన్ని పేజీలు తిరగేసినా తలకెక్కేది సున్న. మూడో వ్యక్తి ఆ పెట్టెలో లేకపోవడంతో నా గుండె దడ

హెచ్చయింది. చిన్నప్పుడో విన్న కథలు మస్తిష్కంలో ప చా రు చేసాగాయి ... సికింద్రాబాద్ స్టేషన్ దాటగానే లేడీపాసింజర్ల మెడలోని నెక్‌లెస్, యియర్ రింగులు తెంపుకుని పరుగెత్తే రైలు నుండి కిందకు దుమికి పారిపోయే దుండగులు — ఒక్కొక్కప్పుడు శరీరం మీద వస్తువులేవి కనబడకపోతే వారి శరీరావయవాలతో కామదాహాన్ని తీర్చుకునే కిరాతకులు— ఆ మధ్య రమీజాబి, షకీలా మొదలైన కథలు ఎన్ని వినలేదు ! !— తలచుకుంటే వొళ్ళు జలదరిస్తోంది. గాలికి క్రిందకు జారే పమిట సర్దుకు కూర్చున్నాను అతను నా దిక్కే చూస్తున్నాడా ? ఏమో ! నేను అతని వైపు చూడలేదు. పుస్తకంలో మొహం దూర్చేసాను—'చీకట్లో పడుకోడం భయమైతే తల మీదవరకు ముసుగేసి దుప్పటి కప్పుకు పడుకో' అని చిన్నప్పుడు అమ్మ చెప్పే మాటలుగుర్తుకు తెచ్చుకుంటూ.

లోకల్ లాలాగూడ విడిచి రెండు నిముషాలైంది ఇంకా రెండు నిముషాలు కళ్ళు మూసుకుంటే మల్కాజ్‌గిరి చేరుకోవచ్చు, హేండ్ బ్యాగ్‌లో పుస్తకం పెట్టి కూర్చున్నా.

అతను లేచి నిలబడ్డాడు. నేను మల్కాజ్‌గిరిలో దిగుతానని తెలుసుకున్నాడేమో, నా వైపే వస్తున్నాడు శరీరం చెమట్లు పోసింది. శరీరం నిండా పమిట కప్పేసుకున్నాను. చేతికి హేండ్‌బ్యాగ్ తగిలించేసాను. బండి మల్కాజ్‌గిరి 'ఎ' కేబిన్ దాటింది. నేను లేచి ద్వారం దగ్గర నిలబడ్డాను. అతను కిటికీ దగ్గర నిలబడి అటు యిటు చూస్తున్నాడు — తన తోటి దుండగులను ఎవరినైనా స్టేషన్లో వెయిట్ చేయమని చెప్పాడేమో ! — అమావాశ్య, అర్ధరాత్రి ... ఊరవతల ఓ కొండ గుహలో నలుగురు దుండగులు పదహారేళ్ళ ఒక అబలను బలవంతంగా — డిటెక్టివ్ నవలలోని ఒక వాక్యం గుర్తుకొచ్చింది. 'హే భగవాన్' అనుకుంటూ కళ్ళు మూసుకున్నాను ఒక క్షణం. మల్కాజ్‌గిరిలో బండి ఆగింది. అటు ఇటు చూడకుండా ఫుట్‌బోర్డు(?) మీద నుండి క్రిందకు దుముకేసి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ గౌతమ్ నగర్‌లో ఉంటూన్న మా అక్కయ్య గారింటికి దారి తీసాను. అయిదునిముషాల్లో ఇంటికి చేరుకున్నాను. అంత రాత్రివేళ ఒంటరిగా వచ్చినందుకు అక్కయ్య చివాట్లు పెట్టింది. "ఏం మరదలా, తెల్లారితే ఇంటర్వ్యూ అంటే ఈ రాత్రి బండిలోనే రావాలా ? ఒకటి రెండు రోజులు ముందుగా వస్తే నీ సొమ్మేమి పోయిందట!" బావగారు నవ్వుతూ అడిగారు.

"దాని సొమ్మేలా పోతుందండీ! మీసొమ్మే తరిగిపోతుందేమోనన్న భయంతో మా చెల్లి ముందుగా రాలేదు." అక్క సమాధానానికి అంతా నవ్వుకున్నాం

* * *

భోజనం చేసి నిద్ర పోటానికి చాలాసేపు ప్రయత్నించాను. కాని ఒకంతట నిద్రరాలేదు. తెల్లారితే ఇంటర్వ్యూ- ఏమౌతుందో— ఎంతమంది వస్తారో? ఈ ఉద్యోగమైనా దొరుకుతుందో లేదో?? ఎన్నాళ్ళిలా ఒకరి మీద ఆధారపడి జీవించాలి???— వయసొచ్చిన పిల్లల్ని పెంచటానికి కన్న తల్లిదండ్రులకే కష్టమనిపించే ఈ రోజుల్లో నా లాంటి అనాధను అక్క, పినతల్లి ఎన్నాళ్ళని ఆదుకుంటారు? అలా ఆలోచిస్తూ అటు యిటు కొంతసేపు దొర్లాను. ఎప్పుడు నిద్రాదేవత వొడిలోకి వాలిపోయానో నాకే తెలీదు.

"తొమ్మిదిన్నరకే ఇంటర్వ్యూఉందన్నావ్, ఎనిమిది గంటల లోకల్‌కు వెళ్ళవా ఏమిటి?" అక్క తొందర చేసేవరకు నేను నిద్రనుండి బయటపడలేదు.

పక్కమీద నుండి లేస్తూ గోడగడియారం వైపు చూశాను. టైము ఏడయింది. తొందరగా కాలకృత్యాల్ని ముగించి బట్టలు వేసుకునేసరికి పావుతక్కువ ఎనిమిది అక్క చేసిన టిఫిన్ పూర్తిచేసి స్టేషన్ వైపు పరుగెత్తాను. మల్కాజగిరి స్టేషన్ చేరానో లేదో కాకీ దుస్తులు వేసుకున్న వ్యక్తి ప్రత్యక్షమయాడు. నేను ముందుకు దూసుకు పోతుంటే— 'ఏమండీ, ఏమండీ' అంటూ అతను నా వెనక పరుగెత్తుకొచ్చాడు. నా కాళ్ళకు సడన్ బ్రేక్ పడింది. వెనక్కి తిరిగి చూసాను.

"రాత్రి ట్రైన్‌లో ఏవో కాగితాలు దొరికాయి. మీవే అయి ఉండొచ్చు" అన్నాడతను నెమ్మదిగా.

"ఆఁ, నా కాగితాలేమిటి?—" హేండ్ బ్యాగ్ తెరిచి చూసాను. గుండె ఆగినంత పనైంది. ఇంటర్వ్యూ కాల్‌మెమో సర్టిఫికేట్ ఒకటి దానిలో కనబడలేదు.

"మీరు దిగిన వెంటనే రైలు కదిలింది. మీరు కూర్చున్న బెంచీక్రింద గాలికి ఎగురు



కాకతాళీయం

తున్నాయి ఈ కాగితాలు. మీవే ఉంటుందని తలచి వివరాలు చదివాను– 'మిస్. కమల, కేరాఫ్ కే. జీ. రావ్, ఖమ్మం' అని వుంది. ఇంటర్వ్యూ తేదీ చూసి కదులుతున్న రైలు నుండి క్రిందకు గెంతాను, కాగితాలు వెంటనే మీకు అందించాలన్న ఉద్దేశంతో. కాని ఆ చీకట్లో మీరు కనబడలేదు. ఇంటర్వ్యూకి ఈ రోజు వెళ్ళవలసి ఉంది కదా. ఎంత బాధ పడిపోతారోనని నాలుగు వీధులు తిరిగాను. మీ ఆచూకీ తెలుసుకోలేక పోయాను. అందుకే ఇక్కడే కాసుకు కూర్చున్నా" అతను కాగితాలు అందించాడు.

అతన్ని చూస్తూ, కొన్ని క్షణాలు స్థాణువై పోయాను. మనస్సు ఆనందంతో తేలిపోయింది. కాని ఏ విధంగా నేను అతనికి కృతజ్ఞత తెలుపుకోను? ఈ మనిషిని గురించేనా నేను గడచిన రాత్రి లోకల్ ట్రైన్లో రకరకాలుగా ఊహించుకున్నాను. ఏదో దురుద్దేశంతో నా వెంటపడి ఉంటాడని భావించాను. నేను ఎంత మూర్ఖురాలను?

నేను మొహం పైకెత్తి చూసేసరికి అతను చాలా దూరం వెళ్ళిపోయాడు. పరుగెత్తి వెళ్ళి కలుసుకోటానికి కూడా అవకాశం లేదు. సికింద్రాబాద్ వైపు వెళ్ళే లోకల్ ట్రైన్ కదలటానికి సిద్ధంగా ఉంది. కృతజ్ఞత పూర్వకంగా అతనివైపు చూస్తూ రైలు ఎక్కాను.

* * *

కాలచక్రంలో ఒక సంవత్సరం గడిచి పోయింది.

మా కంపెనీకి ఒక నమ్మకమైన వాచ్ మెన్ కావల్సి వస్తే స్థానిక పేపర్సులో అడ్వర్టైజ్ చేసాం. కొన్ని వందల అప్లికేషన్సు వచ్చాయి. సెలెక్షన్ బోర్డులో ఆ కంపెనీ పర్సనల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న నన్ను ఛైర్మన్‌గా వేయటం, ఇంటర్వ్యూ నాడు ఆ ఉద్యోగానికి సంవత్సరం క్రిందట ఖమ్మం నుండి వస్తుండగా ట్రైన్లో కలసిన కాకీదుస్తుల వ్యక్తి ఒక అభ్యర్థిగా నా ఎదుట నిలబడటం కాకతాళీయంగా జరిగింది.

మాకు అభ్యర్థి విద్యార్హతతో పనిలేదు. మనిషి యొక్క నమ్మకం మాకు కావలసింది.

ఆ వ్యక్తిని ఉద్దేశించి అడిగాను – 'నీ పేరు?'

'ఆంజనేయులు.' చెప్పాడతను.

'నివాసం?'

'మల్కాజ్‌గిరి.'

'చదువు?'

'ఎస్. ఎస్. సి వరకు చదివాను.'

ఇంకా ఏమీ ప్రశ్నించదలచుకోలేదు రేపే వచ్చి డ్యూటీలో చేరవచ్చు - అని చెప్పాను.

రెండు చేతులు జోడించి 'నమస్కారం' అంటూ బయటకు వెళ్ళాడు.

పదిరోజుల తర్వాత లంచ్ టైములో టిఫిన్ పూర్తిచేసి కంపెనీ టిఫిన్ షెడ్ల ప్రక్కనుండి ఎమ్. డి ఛేంబర్సు వైపు వెళ్తుంటే వర్కర్ల మాటలు కొన్ని నా చెవిలో పడ్డాయి. వెనక్కు తిరిగి చూసాను. ఆంజనేయులు చెప్పుకుపోతున్నాడు – అతను నా రాకను గమనించలేదు.


'మన పర్సనల్ ఆఫీసర్ కమలమ్మగారు సంవత్సరం క్రిందట ఖమ్మం నుండి వస్తున్నారు. ఇద్దరు రౌడీ వెధవలు ఆమెను ఎట్లాగైనా దారి తప్పించి పట్టుకుపోవాలని ప్లాను వేసారు. నేను వారి ఆటలు సాగనివ్వ లేదు. ఆమె మా ప్రాంతంలోనే పెరిగింది, మా ఊళ్ళోనే చదివింది. ఆమెను ఎలాగైనా కాపాడాలని మల్కాజ్‌గిరి చేరేవరకు ఆమెనే అనుసరించాను. ఆ రౌడీ వెధవలు ఎక్కడ మాయమయ్యారో మళ్ళీ కనబడలేదు' టిఫిన్ తింటూ గలగలా నవ్వాడు ఆంజనేయులు.

ఆనాటి ఆంజనేయుడు లంకలో సీతాదేవిని కాపాడితే, ఈ ఆంజనేయులు ఆ నాటి ప్రయాణంలో నన్ను దుండగుల పశుత్వానికి బలికాకుండా రక్షించాడు. మనసులో మరొకసారి ఆంజనేయుల్ని అభినందించకుండా ఉండలేకపోయాను.

"విలువ"

–"పదిమంది
కొలిస్తేనే దేవుడు ...
నలుగురు
నడిస్తేనే బాట...
పగలు, రేయి
కలిస్తేనే రోజు ...
వర్తమానం
గడిస్తేనే భవిష్యత్తు..."

\- అవనిగడ్డ సూర్యప్రకాష్



మీ స్నానమునందు ఒక క్రొత్తదనము నిచ్చు
సబ్బు - ప్రేమ్
క్రొత్త
సుకుమారమైన మీ చర్మ సౌందర్యమునకు ప్రేమ్.
దీని పరిమళము స్వచ్ఛమైన నురగ మీ శరీరమును
ఆహ్లాదింపజేయును
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చు సబ్బు-ప్రేమ్.
NEW
Prem
REFRESHING SOAP
PREM
ప్రేమ్ - తాజాతనము నందించు సబ్బు.
Imageads-M-AP-1527 Tel

సీరియల్

మనసు కథ

వాసిరెడ్డి సీతాదేవి

"మీ ఫ్రెండు ఎవరో తెలుసుకోవచ్చా ?"

సుజాతకు వీపుమీద బల్లులు పాకినట్టు అయింది. గిరుక్కున వెనక్కు తిరిగిచూసింది.

"మీకు అభ్యంతరం లేకపోతేనే చెప్పండి." ఆమెకు శరత్‌బాబు చూపులు తన వీపును గుచ్చుతున్నట్టుగా అన్పించింది.

అభ్యంతరమా ? తమాషాగా మాట్లాడుతున్నాడు. ఎందుకు అడుగుతున్నాడో తనకు తెలుసు.

"ఆమె నా క్లాస్‌మేట్, పేరు సునీత."

"మీ పేర్లు కూడా చాలా దగ్గర దగ్గరగా ఉన్నాయ్ ! సునీత – సుజాత ఇద్దరూ చాలా క్లోజ్ ఫ్రెండ్సు అనుకుంటా."

"మీ ఇద్దరిమధ్యా ఉన్నంత క్లోజ్ ఫ్రెండ్‌షిప్ లేదేమోలెండి." సుజాతకు వెనక్కుతిరిగి అతని ముఖం చూడాలనిపించింది. కాని వెనక్కు తిరగలేదు. అతని రియాక్షన్ కోసం ఎదురుచూసింది.

"మా స్నేహం అపూర్వం !"

ఆహా !

"అపూర్వ సోదరగళ్ !"

అదేదో అరవ సినిమా !

ఒకడిని మించి మరొకడుంటాడు.

"అపూర్వమే కాదు. మీ స్నేహం ప్రపంచానికే ఆదర్శం" ఏమిటో అనేసింది.

ఇతనితో మాటలు పెంచడం కూడా మంచిది కాదు. తన మనసులో ఉన్నదాన్ని బయటికి లాగాలని ప్రయత్నం చేస్తున్నాడు.

"మీ స్నేహితురాలి భర్త ఏం చేస్తుంటాడూ?"

"పోలీసు ఆఫీసరు !" గబుక్కున అనేసింది.

తను అతడి నెత్తిన పిడుగు పడేసింది !

ఈ దెబ్బతో అయ్యగారు అన్నుపట్టిపోయుంటాడు.

గిరుక్కున తిరిగి అతనికేసి చూసింది.

శరత్‌బాబు ముఖానికి బదులు న్యూస్‌పేపరు కన్పించింది.

ముఖానికి పేపరు అడ్డం పెట్టుకొని చదువుతున్నట్టు నాటకం ఆడుతున్నాడు.

ఆ ముఖం చూడాలి !

ఆ ముఖంలోని మార్పును చూడాలి !

సుజాత కిటికీ దగ్గరనుంచి అతను కూర్చుని ఉన్న సోఫా దగ్గిరగా వచ్చి నిల్చుంది.

"పోలీసు ఆఫీసరా ?" పేపరు పక్కన పెడుతూ అడిగాడు.

తలెత్తి ఆమె ముఖంలోకి చూశాడు.

అవలిస్తే పేగులు లెక్కపెట్టే రకం.

తను అక్కడకు ఎందుకొచ్చిందోకూడా గ్రహించేశాడు. తాపీగా ఉన్నాడు. నింపాదిగా ఉన్నాడు. తగిలిన షాక్‌ను బయటికి కన్పించకుండా జాగ్రత్త పడ్డాడు. ఏమీ వినన ట్టే, జరగనట్టే, ప్రశాంతంగా ముఖం పెట్టాడు. గుండెలుతీసిన బంటు !

"ఏం ? మీకు పోలీసాఫీసర్లంటే ఇష్టం లేదా ?" కన్పించింది సుజాత.

"అలా ఎందుకనుకొన్నారూ ?" నొసలు విరిచాడు శరత్‌బాబు.

"మీ మొహం చూసి !"

(గత సంచిక తరువాయి)

"ఫట్ ఫట్" అతన్ని ఆ చంపా ఈ చంపా వాయించినట్టు సంతృప్తిపడింది సుజాత

కాని అతడి పెదవులమీద కదిలిన హాసరేఖలు ఆమె హృదయానికి ములుకుల్లా నాటాయి.

ఆమె నుదుటిమీద చిరుచెమటలు పోశాయి.

"కూర్చోండి ! అలా నిలబడే ఉన్నారేం ?

జరిగిన కథ - 5 : ఢిల్లీ కాన్ఫరెన్స్‌కని వెళ్లిన శివప్రసాద్ అక్కడికి వెళ్లకుండానే తన ఫ్రెండ్ శరత్‌బాబుతో తిరిగొచ్చిన భర్తను చూసి ఆశ్చర్యపోతుంది సుజాత. తను కాన్ఫరెన్సుకు వెళ్లి తిరిగొచ్చేవరకు శరత్ ఇక్కడే వుంటాడని చెప్తే ఏం చెప్పాలో తోచక ఆలోచన్లో పడిపోతుంది. ప్రసాద్ ఢిల్లీ వెళ్లకపోవడానికి గల కారణమేమిటో చెప్పకపోవడంతో, ఏమేమో వూహించుకొంటుంటుంది సుజాత. నిద్రపట్టక వెర్రి ఆలోచనలను చేస్తున్న సుజాతతో కాంపోజ్ టాబ్లెట్ మింగించి నిద్రపుచ్చుతాడు శరత్. ఇంట్లో జరిగిన కొన్ని సంఘటనవల్ల న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్‌ను కూడా శరత్‌బాబే పేల్చివేశాడన్న అనుమానంతో అతన్ని పోలీసులకి పట్టివ్వాలని నిర్ణయించుకొంటుంది సుజాత. తను వేసుకున్న ప్లాన్ అడ్డం తిరగటంతో చేసేదిలేక తన స్నేహితురాలు సునీత రాకకోసం ఎదురు చూస్తుంటుంది సుజాత.

ఇంటిదాకా వచ్చిన ఫ్రెండు వెనక్కు తిరిగి పోదులెండి."

సుజాత మంత్రించిన బొమ్మలా అతని కెదురుగా ఉన్న సోఫాలో కూర్చున్నది.

"నాకు పోలీసాఫీసర్లంటే ఇష్టమే ! కాని పోలీసాఫీసర్ల పెళ్లాలంటేనే ఇష్టంలేదు."

"ఏం ? ఎందుకని ?"

"వాళ్ళు చాలా పొగరుగా ఉంటారు. భర్తకు లేని అధికారాలు కూడా వాళ్లు చలాయిస్తుంటారు."

"నా ఫ్రెండు అలాంటిది కాదు."

"మీ ముందు అలా ప్రవర్తించకపోవచ్చు. మీ ఇద్దరూ చాలా క్లోజ్ ఫ్రెండ్సు కనక."

"ఇప్పుడు మీకొచ్చిన ఇబ్బంది ఏమిటి ? నా ఫ్రెండు మీమీద అధికారం చలాయిస్తుందని భయపడుతున్నారా ?"

"నామీదా ?" బిగ్గరగా నవ్వాడు శరత్.

"సుజా ! ఇంకా వాళ్లు రాలేదా ?" అంటూ శివప్రసాదు వచ్చాడు.

సుజాత చేతి వాచీ చూసుకుంది.

ఐదుకు పది నిముషాలే ఉంది.

అవును ! వాళ్ళింకా రాలేదేం ?

నిజంగా వాళ్ళొస్తున్నారా ?

లేక వీళ్ళు నాటకం ఆడుతున్నారా ?

తనను బయటికి వెళ్లకుండా చెయ్యడానికి వేసిన ఎత్తు కాదుకదా ఇది ?

"సునీత ఎప్పుడొస్తామని చెప్పింది ?" భర్తకేసి సందేహంగా చూస్తూ అడిగింది సుజాత.

"ఈపాటికి రావల్సిందేనే ? నాలుగున్నర ఐదు మధ్య వస్తానని చెప్పింది" ప్రసాద్ టైం చూసుకొని అన్నాడు.

భర్త మాటల్లో ఏ కల్మషం కన్పించలేదు సుజాతకు. అతని ముఖం నిర్మలంగా ఉన్నది.

చక్కగా తల దువ్వుకొని ముస్తాబై వచ్చిన భర్తను చూస్తుంటే సుజాతకు మనసులోని బరువును దించేసికొన్నట్టుగా ఉన్నది.

తనను ఎంతో ప్రేమించే భర్త లభించడం తన అదృష్టంగానే భావించింది. మేధావీ, ఐశ్వర్యవంతుడూ తనకు లభించడం పూర్వజన్మ సుకృతంగా భావించింది. ఇదుగో, ఈయనగారు, స్నేహితుడి రూపంలో సైతాన్‌గా దాపరించాడు. అప్పటినుంచే తన భర్తలో యీ మార్పు వచ్చింది.

వల పన్ని తన భర్తను పట్టుకున్నాడు.

ఉచ్చువేసి బిగించాడు.

సాలెగూడులో ఇరికించాడు.

ఈ విష వలయం నుంచి తను తన భర్తను రక్షించుకోవాలి. సునీత భర్త తనకు సహాయం చెయ్యగలడు. సమయానికి వస్తున్నాడు. భగవంతుడే అతణ్ణి ఇక్కడకు పంపిస్తున్నాడు. తనను కాపాడటానికే అతను ఇక్కడకు వస్తున్నాడు.

ఈ రాత్రికే ఈ సైతాన్‌గాడి ఆటకట్టు –

సుజాత గుండెల నిండుగా గాలిపీల్చుకుంది.

నరాల వత్తిడి తగ్గింది.

రిలీఫ్ వచ్చింది.

పచ్చటి మైదానంలో ఏ రెండలో కూర్చున్నప్పుడు చల్లగాలి ముఖాన్ని తాకుతుంటే కలిగే అనుభూతి లాంటిదే ఆమెకు కలిగింది.

"సుజాతా మంచినీళ్ళిస్తావా?" భర్త అడిగాడు.

సుజాత లేచింది.

"మీరు కూర్చోండి. అదేమిట్రా శివా! లేచి వెళ్ళి మంచినీళ్ళు కూడా తాగలేవా?" శరత్‌బాబు అన్నాడు.

సుజాత శరత్‌బాబుకేసి చూసింది.

ఆహా: ఏం మర్యాద?

ఏం మన్నన?

స్త్రీ అంటే ఎంత గౌరవం?

నాగరికత ప్రదర్శిస్తున్నాడు!

"ఫర్వాలేదులెండి. మీ ఆవిడ చాలా అదృష్టవంతురాలనిపిస్తుంది నాకు."

ప్రసాదు ముఖం ముడుచుకున్నాడు.

శరత్‌బాబు చూపులు తిప్పి కిటికీలోనుంచి బయటికి చూడసాగాడు.

ఫ్రిజ్‌లో నుంచి వాటర్ బాటిల్ తీస్తున్న సుజాత మనసు ఏదోలా ఉంది.

ఇదంతా ఇద్దరూ కలిసి ఆడుతున్న నాటకమే. తనను ఏదో సాకుతో ఎడంగా పంపించి ఏదో మాట్లాడుకోవడానికే మంచినీళ్ళు అడిగాడు. అసలు తనకు బుద్ధిలేదు. సునీత భర్త పోలీసు ఆఫీసరని అతనికి ముందే చెప్పాల్సింది కాదు. తను చాలా పెద్ద పొరపాటే చేసింది. సునీతావాళ్ళు వచ్చేలోపలే వీళ్ళు మరో కొత్త పథకం వేస్తారు.

ఆ అవకాశం వాళ్ళకివ్వకూడదు.

ఆదరాబాదరాగా గ్లాసు అందుకుంది. పక్కనున్న మరో గ్లాసు కిందకు జారింది. దాన్ని పట్టుకోబోయి చేతిలో ఉన్న గ్లాసును జారవిడిచింది!

గచ్చుమీద గాజుపెంకులు చిందర వందరగా పడ్డాయి!

చీపురు తెచ్చి ఊడ్చి గాజుపెంకులు ఎత్తేసింది.

తను త్వరగా వెళ్ళాలనుకుంది. కాని మరీ ఆలస్యం అయింది. ఈపాటికి వాళ్ళు మాట్లాడుకోవాలనుకున్నదేదో మాట్లాడుకొనే ఉంటారు.

నీళ్ళసీసా, గ్లాసూ తీసుకొని సుజాత హాల్లోకి వచ్చింది.

గ్లాసూ, బాటిలూ, వాళ్ళ ముందున్న బల్లమీద పెట్టింది. కిటికీ దగ్గరకెళ్ళి గేటుకేసి చూస్తూ నిలబడింది.

గడియారం మోగింది.

ఐదూపది అయింది.



అయినా వాళ్ళింకా రాలేదు.

రోడ్డుమీద వచ్చే పోయే కార్లను ఆశగా చూస్తున్నది. ఒక్కటీ తమ గేటు ముందు ఆగడం లేదు.

ప్రసాదూ, శరత్‌బాబూ మెల్లగా ఏదో మాట్లాడుకుంటున్నారు.

బయటికి చూస్తూనే వాళ్ళ మాటలు వినడానికి ప్రయత్నిస్తున్నాది సుజాత. న్యూక్లియర్ కాంప్లెక్సు ఫైర్ యాక్సిడెంటు గురించి వాళ్ళు మాట్లాడుకుంటున్నట్టు ఆమెకు అర్థం అయింది.

యాక్సిడెంటా?

నో! నో! సాబటేజ్!

అది చేసిందెవరో తనకు తెలుసు.


రుజువులున్నాయి తన దగ్గర.


అవకాశం దొరకాలి. అంతే!

సునీత భర్త చెవులో ఈ రహస్యాన్ని వేస్తే మిగతా పనంతా అతనే చూసుకుంటాడు. తెల్లవారేసరికి ఈ శరత్‌బాబుగారు పోలీసు లాకప్‌లో ఉంటారు!

సమయానికే వస్తున్నాడు!

దేవుడిలా వస్తున్నాడు!





కాని... ఏదీ ఇంకా రారేం ?

ఐదుంపావు అయింది. ఇంకా రాలేదు.

అసలు వస్తారా ?

ఇదంతా ఒక స్టంట్ అయి ఉంటుందా ?

తనను ఇంట్లోనే బంధించి ఉంచడానికి వేసిన ఎత్తుగడ ?

ఎదురు చూసి చూసి ఆమె కళ్ళు నొప్పులు పుడుతున్నాయి.

నిరీక్షణ ఎంత దారుణంగా ఉంటుందో తనకు అర్థం అవుతోంది.

రాని మనుషుల కోసం ఎదురు చూడటం ఎంత బాధాకరం ?

హారిబుల్ !

హోప్లెస్ !

అన్ బేరబుల్ !

అంతా మోసం !

దగా !

కుట్ర !

"ఏమండీ సుజాతగారూ ! ఐదున్నర అవుతోంది. మీ ఫ్రెండు ఇంకా రాలేదేం ?" శరత్ బాబు గొంతు విని ఉలిక్కిపడింది సుజాత.

కిటికీ దగ్గరనుంచి కదిలింది.

సోఫా దగ్గరకు వచ్చింది.

"ఏమో ! ఆ సంగతి ఆయనగార్నే అడగండి." అంటూ భర్త కేసి చూసింది.

ఆమె చూపులు తేలిపోతున్నాయి.

"ఇంకా రాలేదు మరి !" సాలోచనగా అన్నాడు ప్రసాదు.

"పోలీసాఫీసర్ కదా ? ఏదైనా ఎమర్జన్సీ కేసు వచ్చిందేమో ?" అని శరత్ బాబు సుజాతను చూశాడు.

రోగ్ !

స్కౌండ్రల్ !

ఇదంతా తనకు అర్థం కాదనుకుంటున్నాడు.

వాళ్ళ మాటల్ని నమ్మి ఇంకా మోసపోతుందనే భ్రమ పడుతున్నాడు.

"సునీత రావడంలేదు. ఆమె భర్త కూడా

మనసు కథ

రావడంలేదు. నాకు తెలుసు ! ఇదంతా మీరాడిన నాటకం" సుజాతకు అరిచి చెప్పాలనిపించింది. కాని పైకి చెప్పలేకపోయింది.

మూడు నిముషాల్లో తను వీళ్ల ఆట కట్టించగలదు.

ఇప్పుడే సునీతకు ఫోన్ చెయ్యాలి !

అసలు బండారం తెలుసుకోవాలి.

ఆమె కళ్ళల్లో పట్టుదల పొడచూపింది.

"ఫోన్ చేసి చూడండి."

ఎవరూ ఈ మాటలన్నది ?

శరత్ బాబే ?

అతనే ఫోన్ చెయ్యమంటున్నాడేం ?

తన మనసులోని భావాలను ఇట్టే గ్రహిం చేస్తున్నాడు.

ఎలా ? ఎలా ?

నగరంలో ఉగాది

కుండీలలో మావి కొరను వాజాకుగా
చిగురించి కోయిల చెలిమికోరె

కలకంఠి యొకతె యుగాది పచ్చడి చేయ
నన్నింటి "గ్రైండరు" నందు పోసె

కాన్వెంటు పిల్లడుగాది పచ్చడి నోట్ల
డెరిగిన 'మిస్సు' దండించు నమచు

పారబడి నగరమ్ము చేరంబడ్డ పికరాజు
'ఎయిర్ హారన్' మ్రోత కెగిరిపోయె

పండుగకు కొన్క మలయాళ పచ్చిబూతు
బొమ్మ విడుదల యయ్యెను పుణ్యదాయి —
నీరు రాని పంపుల వద్దనే మనోహ
రమ్ముగా నూత్న పంచాంగ శ్రవణమయ్యె

— పాలపర్తి శ్యామలానంద ప్రసాద్

థాట్ రీడింగా ?

ఆలోచిస్తూనే సుజాత ఫోన్ దగ్గరకు నడిచింది.

రిసీవ్ ఎత్తింది. చెవిదగ్గర పెట్టుకుంది.

ఓ ! గాడ్ !

ఇటీజ్ డెడ్ ! ఫోన్ పనిచెయ్యడంలేదు. ఇప్పుడర్థమైంది. తనను మంచినీళ్ల కోసం ఎందుకు దూరంగా పంపించారో ? అప్పుడే ఫోన్ కనెక్షన్ లాగేసి ఉంటాడు. సునీత ఫోన్ చేసిందని తన భర్త చెప్పాడు.

అంతా అబద్ధం !

తను బయటికి వెళ్ళే ప్రయత్నంలో ఉన్నట్టు తెలుసుకొని ఈ నాటకం ఆడారు.

సుజాత వళ్ళు చల్లబడిపోయింది. చేతిలో నుంచి రిసీవర్ జారి కింద పడిపోయింది. ఆమె చేతివేళ్ళు వణికాయి.

"ఏమైంది సుజా ?" శివప్రసాద్ లేచివచ్చి ఆదుర్దాగా అడిగాడు.

కిందపడ్డ రిసీవర్ అందుకొని ఫోన్ మీదఉంచాడు

"ఈ ఫోన్"

"ఆఁ ఈ ఫోన్... ఏమైంది ?"

"చచ్చిపోయింది." ఇంగ్లీషు నుంచి తర్జుమా చేసింది.

ఆమె ముఖంలో రక్తపుచుక్క లేనట్టు ముఖం పాలిపోయింది.

శివప్రసాద్ రిసీవర్ ఎత్తి చెవుదగ్గిర పెట్టుకున్నాడు.

"ఆఁ ఫోన్ పనిచెయ్యడంలేదు. గంట క్రితం బాగానే ఉందే ? డర్టీ డిపార్ట్ మెంట్ !" తనకు తనే చెప్పుకుంటున్నట్టు అన్నాడు శివప్రసాద్.

"హైదరాబాద్ లో ఫోన్లు మరీ అధ్వాన్నంగా ఉన్నాయి. మాకు మరీ ఇంత అన్యాయంగా లేదు." అన్నాడు శరత్ బాబు.

"ఏదో రిపేర్లట ! వాటర్ పైపులు వేస్తున్నారు... మా కేబుల్స్ పాడైపోతున్నాయి అంటారు అడిగితే ! మూడు నెలల నుంచి ఇదే తంతు." విసుగ్గా అన్నాడు శివప్రసాదు.

వాళ్ళ మాటలు ఆమె చెవులకు వినిపిస్తూనే ఉన్నాయి.

మహాబలుడు దారాసింగ్ అంటున్నారు:
"బలంగా ఎదగండి, న్యూట్రముల్ మొనగాడవండి."



ప్రసిద్ధ మల్లయుద్ధ వీరుడు దారాసింగ్ అభిమానాన్ని న్యూట్రమూల్ చూరగొందంటే ఆశ్చర్యం ఏముంది? అమూల్ వారి న్యూట్రమూల్‌లో శరీర ఆరోగ్యానికీ, బలానికీ కావలసిన ఎన్నో పోషక తత్వాలు పుష్కలంగా ఉన్నాయి — అతి శ్రేష్ఠమైన మాల్ట్, రుచికరమైన కోకో, మీగడ కట్టిన అమూల్ పాలు, శక్తితో నిండిన ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజ పదార్థాలు. పైగా, న్యూట్రమూల్ రుచి కూడా అద్వితీయం! ఇవన్నీ కూడా బోర్న్‌విటా, బూస్ట్, మాల్టోవాల కంటే ఎంతో తక్కువ ధరకే!



మార్కెట్ చేయువారు:
గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్
మార్కెటింగ్ ఫెడరేషన్ లి.
ఆనంద్ 388 001 గుజరాత్

daCunha/GCM/43/TL/82

కథలల్లుతున్నారు — కథలు !

ఇద్దరూ కలిసి తనను ఆడిస్తున్నారు.

వీళ్ళు తనను ఏం చేసినా చేస్తారు !

ఎలాగయినా ఈ రాత్రికే ఈ కొంప నుంచి బయటపడాలి. అందుకే తను వాళ్ళప్లాను పసికట్టినట్టు కన్పించకూడదు. తను ఎగ్జయిట్ కాకూడదు. అతి మామూలుగా ఉన్నట్టు కన్పించాలి. తను కూడా నాటకం ఆడాలి, మోసాన్ని మోసంతోనే జయించాలి.

"అవునండీ ! వెధవ ఫోన్ ! అర్ధగంటకోసారి చచ్చిపోతుంది. అంత పని చేసినా అన్నీ రాంగ్‌నంబర్లే వస్తాయి, మనం చేసినా అంతే ! బయటినుంచి వచ్చినా అంతే ! అవునండీ ! మర్చేపోయాను -- ఇప్పుడు గుర్తొచ్చింది — " సుజాత భర్తవైపుకు తిరిగి అతని కళ్ళల్లోకి చూసింది.

"ఏమిటీ ?" ఆశ్చర్యంగా చూశాడు ప్రసాదు.

"ఇందాక మీ కొచ్చింది కూడా రాంగ్ నెంబరే నేమోనండీ ?"

శివప్రసాద్ ముఖం మాడిపోయింది.

శరత్‌బాబు ముళ్ళమీద కూర్చున్నట్టు సోఫాలో కదిలాడు ఇబ్బందిగా.

"రాంగ్ నంబరైతే సునీత ఎలా మాట్లాడుతుంది ?" భర్త భార్య ముఖంలోకి చూస్తూ అన్నాడు.

"ఆవిడ సునీత కాదేమోనండీ !"

"అంటే మీ ఫ్రెండు రాంగ్ నంబరా ?"

శరత్‌బాబుకేసి కళ్ళు తిప్పి చూసింది సుజాత. శవం లేచి కూర్చుని నవ్వుతూన్నట్టుగా అనిపించింది ఆమెకు.

ఇదిగో ! ఈయన ఒక రాంగ్ నంబరు !

నువ్వు డబుల్ రాంగ్ నంబరువు.

మీరిద్దరూ నొటోరియస్ రాంగ్ నంబర్లు.

మనసు కథ

వాళ్ళిద్దర్నీ మార్చి మార్చి చూస్తూ కసిగా అనుకున్నది సుజాత.

"హల్లో సుజీ !"

సుజాత కళ్ళముందు అంతవరకూ ఉన్న కారుమబ్బులు విడిపోయాయి.

ఇది కలా ?

నిజమా ?

తను చూస్తున్నదేమిటి ?

"ఏమిటే అలా చూస్తావు దెయ్యాన్ని చూసినట్టు ?" సుజాత భుజంమీద మెత్తగా చెయ్యివేసింది.

రెండు చేతులతో ఆమె తన భుజంమీద ఉన్న చేతిని మృదువుగా తాకి చూసుకున్నది.

అమాంతం ఎదురుగా ఉన్న సునీతను కౌగలించుకున్నది.

"ఏమిటే అంత సర్‌ప్రైజ్ నీకూ ? నేను ఫోన్ చేశానని మీ ఆయన చెప్పలా ? వస్తానని చెప్పాను గదా !" అని శివప్రసాద్‌కేసి తిరిగి చూసింది సునీత.

అప్పటికే శివప్రసాదు లేచి నిల్చుని సునీత భర్తను ఆహ్వానిస్తున్నాడు.

"డాక్టర్ శరత్‌బాబు ! మిస్టర్ మూర్తి ఐ. ఏ. యస్." శివప్రసాద్ శరత్‌బాబును సునీత భర్తకు పరిచయం చేశాడు.

కరచాలనం చేసి మూర్తి శరత్‌బాబు పక్కన కూర్చున్నాడు.

"మీరు మాట్లాడుతూ ఉండండి. నేనీలోపల కాఫీచేసి పట్టుకొస్తాను" అన్నది భర్తతో సుజాత.

"మర్చిపోయినట్టున్నారు. నాకు టీ !" అన్నాడు శరత్‌బాబు.

"ఓ ! డాక్టర్‌గారు టీటోటలరా ?" అన్నది సునీత.

సునీత చొరవకు ఆశ్చర్యపోతూ ఆమెను పరిశీలనగా చూశాడు శరత్‌బాబు.

"టీటోటలర్‌ను కాను. కాఫీ తాగను. అంతే !" అన్నాడు శరత్‌బాబు.

"సారీ ! పరిచయం చేయలేదు. సునీత, నా ఫ్రెండు" ఏదో తప్పుచేసినట్టు సునీతను శరత్‌బాబుకు పరిచయం చేసింది సుజాత.

"నీ పరిచయం అవసరం లేకుండానే పరిచయం అయిపోయిందిలే సుజీ !" అన్నది సునీత.

"ఎట్లాయినా పోలీసాఫీసరు భార్యవు. క్లబ్ బర్డ్‌వి. నీకు ఒకళ్ళు పరిచయం చేయ్యాల్సిన అవసరం ఎందుకులే" అంటూ సుజాత సునీత చెయ్యి పట్టుకొని అక్కడ్నుంచి తీసుకుపోయింది.

చరచరా ఆమెను పడక గదిలోకి లాక్కుపోయింది.

తలుపులు మూసి పైటచెంగుతో ముఖం తుడుచుకుంది.

"ఏమిటే నీ కంగారూ నువ్వూనూ ?"

"చెప్తాను. అలా కూర్చో!" అంటూ సుజాత ఆమె భుజాలమీద చేతులు నొక్కి బెడ్‌మీద కూర్చో పెట్టింది.

వేగంగా గాలిపీల్చి వదులుతున్నది.

ఎగశ్వాస దిగశ్వాసగా ఉంది సుజాతకు.

ఆమె గుండె చేస్తున్న చప్పుడు సునీతకు విన్పించినట్టు అయింది.

(ఇంకా వుంది)



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

కె ఆర్ ఆర్ – శ్రీకాళహస్తి

నా వయస్సు 17 సం॥లు. నాకు గత మూడు నెలలుగా త్రేనుపులు ఎక్కువగా వస్తున్నాయి. వ్యాయామం చేసినా లేక మందులు వాడినా ఇవి తగ్గుతాయా? గ్యాస్ట్రిక్ ట్రబుల్ వున్నవారికి పొట్ట పెరిగే అవకాశం వున్నదా?

★ వ్యాయామం చేసినందువల్ల త్రేనుపులు తగ్గే అవకాశం ఎక్కువగా లేదు. త్రేనుపులనేవి గాలిని ఎక్కువగా మింగటంవల్ల ఏర్పడతాయి. మందుల మూలంగా కూడా ఇవి తగ్గే అవకాశం పెద్దగా లేదనే చెప్పాలి. ఆందోళన, మానసిక క్షోభ ఉన్నవారికి ఈ త్రేనుపులు ఎక్కువగా వస్తాయి.

గ్యాస్ట్రిక్ ట్రబుల్ – అనబడే పెప్టిక్ అల్సర్. పెప్టిక్ అల్సర్ ఉన్నవారికి పొట్ట పెరిగే అవకాశం లేదు. ఏదో గ్యాస్ట్రిక్ ట్రబుల్ ఉందనుకొని అతిగా ఆహారం తినేవారికి తప్పకుండా పొట్ట పెరిగే అవకాశం ఉన్నది.

యస్ ఎస్ – గుంతలీపాడు

మా అమ్మాయి వయస్సు 10 సం॥లు. సుమారు ఒక సంవత్సరం క్రితం మెడపైన ఎడమ వైపు గడ్డలు వున్నవి. డాక్టర్లు టాన్సిల్స్ అని ఆపరేషన్ చేసారు. కాని గడ్డలు మాత్రము పోలేదు. దీనికి ఏమి చెయ్యాలి?

★ టాన్సిల్సు మెడమీద ఉండవు. గొంతు లోపల ఉంటాయి. టాన్సిల్స్ వాచిన వారికి గొంతు భాగంలో ఉండే లింఫ్ గ్లాండ్స్ వాయటం జరుగవచ్చును. టాన్సిల్స్ తీసివేసిన తర్వాత కూడా ఈ గ్లాండ్స్ వాచి ఉన్నాయంటే ఇతర కారణాలు, పుచ్చిపోయిన పన్ను, తల భాగంలో కురుపులు, ట్యూబర్క్యులోసిస్ మొదలయినవి ఉన్నవీ లేనిదీ పరీక్షింప చేసుకోవలసి ఉంటుంది.

కె పి – గుంటూరు

ఓవ్యులేషన్ టైము అంటే ఏమిటి? స్త్రీలు బహిష్టు అయిన తరువాత ఎన్నిరోజులకు అది వస్తుంది? మా పెళ్లి అయి 3 మాసములు అయినది. నా భార్యకు ప్రతినెల బహిష్టు అయే రోజు కడుపునెప్పి, నడుము నెప్పి వస్తుంది. ఈమధ్యనే రెండు నెలల గర్భము పోయినది. బహిష్టులో నెప్పివుండే వారికి గర్భము నిలవదా? తెలుప ప్రార్థన?

★ స్త్రీల సంతానోత్పత్తి అణువులైన ఓవమ్‌లను ఓవరీస్ (ఆ అణువులను ఉత్పత్తి చేసే గ్రంథులు) విడుదలచేసే సమయమే ఓవ్యులేషన్ టైమ్. బహిష్టు అయిన 13, 14వ రోజులలో ఇలా జరుగుతుంది.

బహిష్టు సమయంలో నెప్పి ఉండటానికీ గర్భం నిలువక పోవటానికీ సంబంధం లేదు.

బుతుస్రావ సమయంలో నెప్పి తగ్గటానికి ఆస్ప్రిన్ మాత్రలు ఒకటి లేక రెండు వంతున వాడవచ్చును.

పి. వి. ఎస్ ఆర్ – వినుకొండ

నా వయస్సు 65 సం॥లు. 7,8 సంవత్సరముల నుండి నడిచినా, భోజనం చేసినా, స్నానం చేసినా ఆయాసం వస్తున్నది. కనీసం 100గజాలు గూడా నడవలేను. దొడ్డికి వెళ్ళి వచ్చిన తర్వాత, స్నానం చేసిన తర్వాత ఆయాసం ఎక్కువగా వుంటుంది. కొంచెము విశ్రాంతి తీసుకుంటే తగ్గిపోతుంది. దీనికి మీ సలహా ఏమిటి?

★ దీనిని ఎక్సర్‌సైజ్ ఇన్‌టాలరెన్స్ అని అంటారు. బ్లడ్‌ప్రెషర్ అప్పుడప్పుడూ పరీక్ష చేయించుకోవటం, మూత్ర పరీక్ష చేయించుకోవటం, ఇ.సి.జి. తీయించుకోవటం అవసరం.

ఆహారంలో ఉప్పు, నూనె పదార్థాలు తగ్గించవలసి ఉంటుంది. అంచెలంచెలుగా శరీరానికి వ్యాయామం అలవాటు చేసుకోవాలి.

రోగ నిర్ధారణ జరిగిన తర్వాత నిర్ణీత మందులు ఆహార నియమాలతోబాటుగా తీసుకోవలసి ఉంటుంది.

ఎ డి. ఆర్ – శివదేవుని చిక్కాల

జుట్టు వూడిపోవటం (ఫంగస్ ఇనఫెక్షన్) నివారించుటకు లోగడ మీరు గ్రైసోవిన్ – ఎఫ్ మాత్రలు వాడమని తెల్పారు. కాని అవి మార్కెట్‌లో లభించుటలేదు. అవి పూర్తిగా ప్రొడక్షన్ నిలిపి వేసినట్లు షాపువాళ్ళు చెబుతున్నారు. వేరే ఏమైనా మాత్రలు వున్నాయా?


★ ప్రస్తుతం కొన్నిచోట్ల గ్రైసోవిన్ మాత్రలు దొరుకుతున్నాయని తెలియవస్తున్నది.


బి. బి – ఖర్గపూర్

నా వయస్సు 20 సంవత్సరములు. నాకు 14 సం॥ల వయస్సులో టాన్సిల్స్ ఆపరేషన్ చేసారు. ఆపరేషన్ అవకముందు నేను పాటలు పాడేవాడిని. ఇప్పుడు పాటలు పాడాలంటే గొంతు సరిగా రావటం లేదు. మాట్లాడేటపుడు గూడా గొంతు కీచుగా ధ్వనిస్తున్నది. దీనికి ఏమైనా మందులు వున్నాయా?

★ టాన్సిల్స్ వాచి ఉండటం వల్ల గొంతు ఒక మాదిరిగాను, అవి తీసి వేసిన తర్వాత వేరే విధంగాను ఉండటానికి అవకాశం లేదు.

గొంతులోనుంచి శబ్దం ఒకల్ కార్డ్స్ అనే వాటి మధ్య నుంచి గాలి బహిర్గతం అవటం వల్ల రావటం జరుగుతుంది.





హాస్యకథ

యర్రంశెట్టిశాయి



"సావిత్రీ! సావిత్రీ! ఓ సావిత్రీ!"

"ఎందుకలా సినిమాల్లో తండ్రి కారెక్టర్లా అరుస్తారు? నేను మీ వెనుకే ఉన్నాను."

"సారీ! ఇక్కడే ఉన్నావా! ఓ మాంచి శుభ వార్త చెప్దామని పిలిచాను. చెప్పెయ్యనా?" ఉత్సాహంగా అన్నాడు శ్రీనివాసరావ్.

సావిత్రి తనకేమీ పట్టనట్లు పెరటివేపు వెళ్ళిపోబోయింది.

"అరె! శుభవార్త వినమంటే ఎక్కడి కెళ్ళిపోతున్నావ్?" ఆమె చేయి పట్టుకుని ఆపుతూ అడిగాడు.

"వంటిల్లు క్లీన్ చేయాలి!"

"అంటే నేను చెప్పబోయే శుభవార్త కన్నా ఆ పనే ఎక్కువన్నమాట నీకు!"

"ఎక్కువకాదు. ఎక్కువ ఉపయోగం ఉంటుంది..."

"అంటే? నా శుభవార్త దేనికీ పనికిరానిదని! అంతేనా?"

"ఇంకెంత స్పష్టంగా చెప్తారేమిటి? ఇంత మడ్‌హెడ్‌ని ఎక్కడా చూళ్ళేదు నేను..." నవ్వాపు కుంటూ అందామె.

శ్రీనివాసరావ్ ఆమె చేతిని మెలితిప్పబోయాడు "నన్ను మడ్‌హెడ్ అంటావా?"

"నేనేం కొత్తగా అనడంలేదు. లోకమంతా అనే మాటే! అమ్మో! చేయి నొప్పి! వదిలేయండి! ప్లీజ్!"

"మరి నేను చెప్పే శుభవార్త వింటావా లేదా?"

"చెప్పండి!"

"నేను హాస్య కథల పోటీకి కథ రాస్తున్నాను."

సావిత్రికి నవ్వొచ్చింది.

"తప్పకుండా రాయండి! అప్పుడుగాని వాళ్ళ తిక్క వదలదు!"

శ్రీనివాసరావ్ అనుమానంగా చూశాడామెవేపు "ఎవరి తిక్క!"

"ఆ పత్రికవాళ్ళది. మీ కథ చదివారంటే జన్మలో మళ్ళీ హాస్య కథల పోటీ పెట్టరు!"

"అలా డామేజింగ్‌గా మాట్లాడావంటే పరువు నష్టం దావా వేస్తాను..."

"వేయండి! నా దగ్గర పావలా ఉండనే ఉంది. కట్టిపారేస్తాను..."

"యూ ... డెవిల్ ..." ఆమె మెడ పట్టుకో బోయాడతను.

"వద్దు నాన్నోయ్! అమ్మను చంపద్దు ..." బాబిగాడు పరుగుతోవచ్చి శ్రీనివాసరావును వెనక్కు తోశాడు.

"ఎందుకనిరా?" ఆశ్చర్యంగా అడిగాడు శ్రీనివాసరావ్.

"తల్లి ప్రేమ ..." గర్వంగా అంది సావిత్రి.

"అది కాదే! నాకాకలేస్తోంది. నాన్న నిన్ను చంపుతే అన్నం ఎవరొండుతారు?"

"దొంగవెధవా! భోజనం ప్రేమేకాని తల్లి ప్రేమ లేదన్నమాట!" వాడి వీపుమీద ఒక్కటి చరుస్తూ అంది సావిత్రి.

చిట్టి పరుగులో శ్రీనివాసరావ్ దగ్గరకొచ్చింది.

"నాన్నా నా టెక్స్టు బుక్స్ కొనకపోతే క్లాసుకి రావద్దంది మా టీచరు ..."

"సరే! రామలే!"

"మీరు కాదు నాన్నా! నన్ను రావద్దంది."

"నిన్ను రావద్దందా? ఆవిడకేమయినా బుద్ధి ఉందా? ఫీజు కట్టలేదు కాబట్టి స్కూలుకి రావద్దని మొన్న చెప్పి ఇవాళ మళ్ళీ టెక్స్టు బుక్స్ అంటూ మాట తప్పుతుందా? ఇలా నిముషానికో మాట మార్చడం నేను లైక్ చేయనని చెప్పు."

"అలా చెప్తే నన్ను కొడుతుంది! మీరే వచ్చి చెప్పండి!"

"తప్పకుండా వస్తాను. ఊహూ! రాలేను! నన్ను చూశాడంటే మీ హెడ్మాస్టరు కిందటేడు నాకంటగట్టిన బెనిఫిట్ షో టికెట్ డబ్బడుగుతాడు."

"ఇప్పుడు అడగడంలేదు నాన్నా! కొత్తవి ఇమ్మన్నాడు."

"ఎంత చల్లని కబురు చెప్పావురా! నీకేం కావాలో కోరుకో!"

"ఉట్టుట్టిగా కాదుగ!"

"ఉట్టుట్టిగా మనకేం ఖర్మరా! నేను పోటీకి మాంచి హాస్యకథ రాస్తున్నాను. బహుమతి రాగానే ఎవరికేం కావాలో అది కొనుక్కోండి—పొండి ..."

"నాన్నా! నాకు రిబ్బన్లు కొనిపెడతారా?"

"నాకు పెన్ను ..."

"ఛ ఛ! ఎదగండేం బాబూ! అంత బహుమతి మొత్తం చేతికొస్తున్నా ఇంకా రిబ్బన్లూ, పెన్నులూ ఏమిట్రా నాయనా! ఖరీదయిన కోరికలు కోరండి."

"వాళ్ళను చదువుకోనీకుండా — వాళ్ళ టైమ్ ఎందుకు వేస్టు చేస్తారు?" కోపంగా అంది సావిత్రి.

"నటన్ సావిత్రీ! నీ హజ్బెండ్ కెపాసిటీ ఏమిటో నీకు తెలీడంలేదు. అతుకుల బట్ట లేసుకుని, పెళ్ళాం బిడ్డలకు కడుపునిండా తిండి పెట్టలేక పోయినంత మాత్రాన వట్టి సన్నాసిగాడనుకోకు! బి. కామ్ సెకండియర్లో ఉండగా .."

"క్షమించండి! ఇంకెప్పుడూ అలా మాట్లాడను! ఇదిగో — లెంపలేసుకుంటున్నాను. ఇంక మీ కాలేజి విషయాలు చెప్పి శిక్షించకండి..." లెంపలేసుకుంటూ అంది సావిత్రి.

"నేను నీకేం చెప్పటంలేదు. నా ప్రియమయిన పిల్లలకు చెప్తున్నాను. ఒరే చిట్టీ, బాబీ, చంటీ - వినండ్రా! నేను కాలేజిలో చదువుతుండగా..."

"మీరు వెళ్ళి ఆడుకోండ్రా! మీ నాన్న మాటలు వింటూ కూర్చుంటే బాగుపడ్డట్లే ఇక." అందరినీ బయటకు తరిమేసింది సావిత్రి.

వాళ్ళు వెళ్ళిపోగానే ఆమె రెండు భుజాలూ గట్టిగా పట్టుకుని తనవేపు తిప్పుకున్నాడతను.

"చెప్పు! పిల్లల దగ్గర ఎందుకలా ఇన్సల్టు చేశావ్ నన్ను?"

"నేనేం చేయలేదు..."

"మరి వాళ్ళనెందుకు నా మాటలు వినకుండా పంపించేశావ్?"

"మీతో ఓ సీక్రెట్ మాట్లాడాలి కనుక!"

"ఏమిటది?"

"ఇంట్లో కొన్ని సరుకులయిపోయాయ్. అర్జంటుగా తేవాలి..."

"అదేమిటి? మన పెళ్ళయిన మొదటి రాత్రి ఒప్పందం ప్రకారం నెలమధ్యలో అదయిపోయింది, ఇదయిపోయింది అని చెప్పగూడదన్నానుగా..."

"ఇప్పుడు ఆ ఒప్పందం రద్దయిపోయింది."

"ఎందుకని?"

"పిల్లలు పెద్దవుతున్నారుగనుకా — మీ జీతం పెద్దవడంలేదు గనుక!"

"సరే! ఆ తెల్లకాగితాలూ — పెన్నూ తీసుకురా!"

"సరుకుల లిస్ట్ రాయడానికా?"

"కాదు. హాస్యకథ పోటీకి కథ రాస్తాను."

"మరి పూట భోజనం?"

"నారుపోసినవాడు నీరు పోయడా? అన్న పెద్దమనిషెవరు?"

"తాగడానికి నీరు దొరక్క చచ్చిపోయాడు."

"గెటవుట్! నీ మొఖం నాకు చూపించకు!"

"పెళ్ళయిన కొత్తలో ఈ మొఖమే చంద్రబింబమని కవిత్వం చెప్పారు."

"మతి స్థిరంలేనప్పుడు చెప్పి ఉంటానలా!"

"మీకు మతి స్థిరం ఎప్పుడుందని అసలు?"

"నీతో మాట్లాడడం నా కిష్టం లేదు. సంచీ తీసుకురా! అప్పు పుట్టించుకుని సరుకులు తెస్తాను."

సావిత్రి నవ్వు ఆపుకుంటూ లోపలికెళ్ళి సంచి తెచ్చిచ్చిందతనికి.

"ఇదిగో - ఏమేం వస్తువులు కావాలో ఈ చీటీలో రాస్తాను. అందులో 'వెరీ ఇంపార్టెంట్' అని ఉన్నవన్నీ ఎలాగయినా తేవాలి. మిగతావి దొరికే అప్పునిబట్టి."

"చిన్నప్పుడు పరీక్షల కోసం 'వెరీ ఇంపార్టెంట్' అని రాసుకొనే టెక్నిక్ ఇక్కడ ఉపయోగపడిందన్న మాట. నీకు చదువు చెప్పిన టీచర్ పేరేమిటి?"

"ఎందుకు? జోహార్లు అర్పిద్దామనా?"

"కాదు. రెండు నిముషాలు మౌనం పాటిద్దామని ..."

"రొట్టెలక్కర కిందటి నెలలోనే కొన్నాను."

"అయితే?"

"ఇంద్రానేసే కార్టూన్లు చూడడం లేదూ? దాంతో భార్యలు ఏం చేస్తారు?"

"అలాంటి కార్టూన్లువేసి భార్యలను ఇన్‌స్టిగేట్ చేస్తున్నందుకు ఆ ఇంద్రాని ఓ సారి మర్డర్ చేయాలనుంది. అతని అడ్రసేమిటి?"

"నారాయణ్‌గూడా వెళ్ళండి. మీలా అతనిని మర్డర్ చేయాలనుకున్న భర్తల 'క్యూ' అక్కడే ప్రారంభమవుతుందట ..."

శ్రీనివాసరావ్ సంచీ తీసుకుని సైకిల్‌కి తగిలించుకుని రోడ్డుమీద కొచ్చాడు.

జేబులోని పది పైసలు తీసి "బొమ్మ పడితే లక్ష్మణరావ్ — బొరుసు పడితే రామకృష్ణ..." అనుకుని గాలిలో కెగరవేసి పట్టుకున్నాడు. బొరుసు పడింది. రామకృష్ణ ఇంటి దగ్గర అరడజనుమంది పిల్లల మధ్య కూర్చుని ట్యూషన్ చెప్తున్నాడు.

"ఏమిట్రోయ్ ఇదెప్పటేమంచి?" నవ్వుతూ అడిగాడు శ్రీనివాసరావ్.

"ఈమధ్య రెండోపూట గడవదని తెలిసినప్పటి నుంచీ... ఏమిటి ఇలా వేళగానివేళ..."

"అప్పుకి వేళేమిటి? అర్జంటుగా అప్పు కావాలి!"

"ఎంత?"

"అది నీ తాహతునిబట్టి ఉంటుంది. ఎంతయినా తీసుకోడానికి నాకేమీ అభ్యంతరం లేదు."

"పది రూపాయిలయితే సంతోషంగా ఇవ్వగలను!"

"ఏడుస్తూ అయితే ఎంతివ్వగలవ్?"

"ఇరవై!"

"ఇంకా ఘోరున ఏడుస్తూ అయితే?"

"వీల్లేదురా బాబూ! ఘోరున ఏడ్చే శక్తి లేదు."

"అయితే సరే! మామూలుగానే ఏడుస్?"

రామకృష్ణ లోపలికెళ్ళాడు.

లోపల వాద ప్రతివాదాలు అస్పష్టంగా వినబడినయ్.

"ఇరవై ఆయన కిచ్చేస్తే మనకెట్లా?"

"తప్పదే బాబూ! వాడికి ప్రామిస్ చేసేశాను. నైన్‌టీన్ సెవెంటీ ఎయిట్‌లో వాడు మనకి నలభయ్ తొమ్మిది రూపాయలు — ఎలాంటి సమయంలో అప్పిచ్చాడో గుర్తులేదూ?"

"నేను కాదనడంలేదండి! మళ్ళీ మనకెలా అంటున్నాను..."

"ఉంగరం తాకట్టు పెడదాములే!"

"ఉంగరం ఎక్కడుంది మనకి?"


"ఇవాళ రాత్రికి ఎక్కడోచోట దొంగతనం చేసుకొస్తాగా..."

ఆమె నవ్వేసింది.

చిరునవ్వుతో బయటికొచ్చి ఇరవై నోటు శ్రీనివాసరావ్ కిచ్చాడు రామకృష్ణ.

"థాంక్యూరా బ్రదర్! మా ఆవిడ విధించిన ఎమర్జెన్సీకి నువ్వు స్టే ఆర్డరిచ్చావ్!" నవ్వుతూ అన్నాడు శ్రీనివాసరావ్.

మార్కెట్ చేరుకుని జేబులోనుంచి సావిత్రి ఇచ్చిన లిస్ట్ ఓసారి తీసి చూసుకున్నాడు. వెరీ ఇంపార్టెంట్ అన్న వస్తువులు రెండే వున్నాయ్.





చైతన్య పుష్పం

విగుళ్ళ గుండెల్లో పలికేది
రేపటి పువ్వుల సంగీతం
కిరణం గుండెల్లో పలికేది
ఉదయరాగ రసగీతం.
నవ్వే పెదవుల కురిసేది
స్నేహభావాల తేనెవాన
మమతల మనమున విరిసేది
నవజీవన సుమభావన –
కొమ్మ కొమ్మ కోయిల గానం
ఎద ఎదలో తీయని అభిమానం
రాగభావ తాళ లయాన్వితం
సామూహిక సామాజిక జీవితం.

— రామసూరి

ఆ రెండూ తీసుకుని ఇంటికి చేరుకున్నాడు. సంచీ చూసుకుని "మోస్ట్ హోప్‌లెస్ ఫెలో అయ్ హేవ్ ఎవర్ సీన్ ..." అంది సావిత్రి.

"ఇక ముందు చూడబోవు కూడానూ !"

ఆమెతోపాటు వంటింట్లోకి నడుస్తూ అన్నాడతను.

పిల్లలు వంట గదిలో కూర్చుని చదువుకుంటున్నారు.

"ఏమిటి వీళ్ళిక్కడ ?" సావిత్రి నడిగాడతను.

"బయట గదిలో బల్బుకీ – మనకీ అభిప్రాయ భేదాలొచ్చాయ్."

"అయితే నేను హాస్యకథ కిచెన్‌లో రాయాల్సిందేనా ?" చిరాగ్గా అడిగాడతను.

"ఎవరికోసం ? మీరేం దిగివచ్చారా ?" స్టౌ వెలిగిస్తూ అందామె.

"మర్యాదగా మాట్లాడు. నేను దిగేవచ్చాను."

"ఏమిటి ?"

"సైకిలు ..."

"ఇంత హీనమయిన జోకు ఇంతవరకూ వినలేదు ... "

"పోనీ నీ వంటయ్యాక ఈ బల్బు తీసుకెళ్ళి ఆ గదిలో పెడతాను."

"అంతపని చేయకండి. మీరు కదిపారంటే అది కూడా వినుక్కుంటుంది."

"జాగ్రత్తగా తీస్తానులే !"

"వద్దంటున్నాగా ! ఇదికూడా పోతే వారం రోజులు చీకట్లో వంట చేయాలి నేను ... "

"బ్లాక్ అవుట్ అంటే ఏమిటో తెలుసుకోవాలనుందన్నావుగా ఓసారి."

శ్రీనివాసరావ్ బయటికొచ్చి చీకట్లో కూర్చున్నాడు.

మరో వారంరోజులుంది హాస్యకథల పోటీకి గడువు.

హాస్య కథ

హాస్యకథ ఎలా రాయాలి ?

కాళ్ళకేదో చల్లగా తగిలింది.

"నాన్నా ఎత్తుకో ..." చంటిది గారాంగా అంది.

"చీకట్లో ఎందుకొచ్చావే నువ్వు ?" దాన్ని ఎత్తుకుని ముద్దుపెట్టుకొంటూ అన్నాడు.

దాని వళ్ళు వెచ్చగా తగిలిందతనికి.

"అన్నం తిన్నావమ్మా ?"

"అమ్మ... పెత్తలేదు..."

"ఆకలేస్తోందా ?"

"ఊ..."

వంటింటివేపు నడిచాడు శ్రీనివాసరావ్.

"సావిత్రీ ! ఈ చంటిదానికి జ్యోతిలక్ష్మి డ్రస్ వేశావేమిటి ?"

"ఏంచేయను ? బాత్‌రూమ్‌లో నీళ్ళలో ఆడి ఉన్న ఒక్క జతా తడిపేసుకుంది..."

"ఏరా చంటీ – అలా తడిపేసుకోచ్చా ?"

తల అడ్డంగా ఊపింది చంటి.

"మరి తెలిసెందుకు చేశావ్ ఆ పని ?"

"దాన్నిటివ్వండి ! అన్నం పెట్టేసి పడుకోబెడతాను..."

"నేలాను..." సావిత్రి చేతుల్లోకి వెళ్ళకుండా గింజుకుంటూ అంది.

"చూశారా ! ఇందాక ఒక దెబ్బ వేశానని ఎంత పౌరుషం వచ్చిందో దీనికి – ఇంతుందోలేదో అప్పుడే రోషాలూ, పౌరుషాలూ..." బలవంతంగా లాక్కుంటూ అంది సావిత్రి.

"దీనికి మళ్ళీ జ్వరం వచ్చినట్టుంది..." పొడిగా అన్నాడు శ్రీనివాసరావ్.

సావిత్రి మొఖం వాడిపోయింది.

"అవును !"

"రేపు డాక్టర్ దగ్గరకు తీసుకెళ్తాను ! రోజు రోజుకీ సన్నగా పుల్లలా అయిపోతోంది..."

ఆ రాత్రి పన్నెండు గంటలయినా శ్రీనివాసరావ్‌కి నిద్రపట్టలేదు. లేచి కూర్చున్నాడు.

"ఏమిటి ? మధ్యాహ్నం ఆఫీసులో బాగా నిద్రపోయారేమిటి నిద్రపట్టటంలేదు ?"

"మా ఆఫీస్‌లో నిద్రా ? నువ్వెప్పుడయినా నరకం చూశావా ?"

"మనం ఉంది అందులోనేగా !"

"ఎగ్జాక్ట్లీ ! దాని బాబులాగుంటుంది మా ఆఫీస్ ! ఇంక నిద్ర కూడానా ?"

"అయితే పడుకోండిక ! ఊరికే సిచ్చి ఆలోచనల్తో మనసు పాడుచేసుకోవద్దు."

"అదిసరేగాని సావిత్రీ! నాకు హెల్ప్‌చేస్తావా?"

"అలాంటివన్నీ మానేశాను."

"ప్లీజ్ ... "

"ఏమిటది ?"

"హాస్యకథలెలా రాయాలో చెప్తావా ?"

"నేనా ?"

"అవును ! ఇంటర్మీడియెట్ చదివేప్పుడు మీ కాలేజి మాగజైన్లో రాశావ్ కదా ! ఆ కథ చదివే నిన్ను లవ్ చేశాను అసలు "

"అయ్యో ! అది నేను రాసింది కాదండీ !" నవ్వాపుకుంటూ అంది సావిత్రి.

"మరి ?"

"మా పనిపిల్ల."

"నిజంగానా ?"

"ఏం ? ఇప్పుడు మా పనిపిల్లని లవ్ చేస్తారా ఏమిటి ?"

"యూ సిల్లీ గాళ్ ... "

"సరే ! కథలా రాయాలో రేపు చెప్తానుగానీ, పడుకోండిక."

"ఓకే ! స్వీట్ డ్రీమ్స్ !"

"అప్పుడే కలవరిస్తున్నారా ?"

శ్రీనివాసరావ్ చిన్నగా నవ్వుకుని తన పక్కమీద పడుకున్నాడు.

మర్నాడు తెల్లారుజామునే నిద్రలేచి వంటింట్లో ఉన్న సావిత్రి దగ్గర కొచ్చాడతను.

"కమాన్ సావిత్రీ ! కాగితాలూ - పెన్నూ రడీగా ఉన్నాయ్. అవి మా ఆఫీస్ కాగితాలని ఆ పత్రిక వాళ్ళకు తెలిసిపోదుకదా !"

"ఏం ఫరవాలేదులెండి ! దేశమంతా ఆఫీస్ వస్తువులు, వాహనాలే ఉపయోగిస్తున్నారు సొంత పనులకు."

"థాంక్స్ ఫర్ యువర్ మోరల్ సపోర్ట్ ! నీవెప్పటికయినా ప్రధానమంత్రి అయితే నీమంచి ఈ దేశాన్ని భగవంతుడే రక్షించాలి..."

"మీరేం కథ రాయాలనుకుంటున్నారో చెప్పండి ముందు..."

"హాస్య కథ !"

"సబ్జెక్ట్ కాదు నేనడిగేది ! థీమ్ !"

"ఏమీలేదు. ఒక బీదవాడు. అడుక్కుతినే వాడన్నమాట ! వాడు హాస్యంగా ఉంటాడు. హాస్యంగా మాట్లాడతాడు ! అంతే ! అదే థీమ్ !"

"అందులో నేమరాలిటీ ఉండదు !"

"ఎందుకని ?"

"అడుక్కుతినేవాడు ఎంతసేపూ ఆకలితోనూ, రోగాలతోనూ, కాళ్ళ నొప్పులతోనూ ఛస్తూంటాడు. ఇంక హాస్యమేమిటి మీ తలకాయ !"

"ఓకే ! నా హీరో అడుక్కుతినేవాడు కాదు. లక్షాధికారి ! బిజినెస్ మాగ్నేట్ ! ఇప్పుడు చెప్పు !"

"లక్షాధికార్ల జీవితంలోనూ హాస్యం ఉండదు."

"మరి ?"

"టెన్షన్ ! భయం."

"అంటే నేనసలు కథే రాయగూడదంటావ్ !"

"హాస్య కథ !"

"సరే ! ఛాలెంజ్ చేస్తున్నాను. రేపటికల్లా బ్రహ్మాండమయిన హాస్య కథ రాస్తాను. పందెం కడతావా ?"

"ఓ ! పందెమేమిటి ?"

"బహుమతి వస్తే అందులో సగం పెట్టి నీకు చీర కొనిస్తాను..."

"అయితే ఈ జన్మలో నాకు చీర కొనరన్న మాట !"

అతను బయటి గదిలోకొచ్చి కథ రాయడానికి కూర్చున్నాడు.

కొద్దిసేపటితర్వాత చిట్టి లెక్కల పుస్తకం తీసుకొచ్చింది.

"నాన్నా ఈ లెక్క చెప్పవూ ?"

"ఏమిటి తల్లీ అది ?"

"ఒక సంస్థ డెబ్బయ్ కోట్ల పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించింది. సంవత్సరం అయేసరికి ఆ సంస్థకు రెండువందల కోట్ల ఆదాయం వచ్చింది. ఆ సంస్థకు లాభం వచ్చినట్లా, నష్టం వచ్చినట్లా? ఎంత శాతం ?"

"అది గవర్నమెంట్ సంస్థ అయితే నష్టం వచ్చినట్లు. ప్రైవేట్‌దయితే లాభం వచ్చినట్లు..."

అతని కోసం కాఫీ తీసుకొచ్చిన సావిత్రి ఆ జవాబు విని నవ్వింది.

"ఇంక ఈ పిల్లలకు చదువొచ్చినట్లే ! వాళ్లో రావే చిట్టీ నేను చెప్తాను." సావిత్రి అడ్డుపడుతూ అంది.

"నేను అబద్ధం చెప్పడం లేదోయ్ ! జరుగుతున్నకథే ఇది. ఎంత లాభం వచ్చినా, జీతాలు పెంచమంటారేమోనని ప్రభుత్వం ఎప్పుడూ 'నష్టం' అనే చెప్తుంది ... "

సావిత్రి చిట్టిని లోపలకు లాక్కుపోయింది.

మరి కాసేపటి తర్వాత చంటిదాన్ని గవర్నమెంట్ హాస్పిటల్‌కు తీసుకెళ్ళాడతను. రెండు గంటలు క్యూలో నిలబడ్డాక కుర్ర లేడీడాక్టర్ చంటిదాని పరీక్షించింది.

కాగితంమీద ఏవో మందులు రాసిచ్చింది.

"తరచుగా ఇలా జ్వరం వస్తూంది డాక్టర్ ! ఎందుకని ?"

"ఆ మందులు వాడు !"

"ఎక్కువగా దగ్గుతుంది కూడా !"

"సరే !"

"మరీ సన్నగా అయిపోతోంది రోజు రోజుకీ!"

"నెక్స్ట్... "

శ్రీనివాసరావ్ బయటికొచ్చేశాడు. మందు కాగితం చూశాడు. మేజరాల్ టాబ్‌లెట్స్ —

హాస్య కథ

కాగితం చింపి అవతలపారేసి ఇల్లు చేరుకున్నాడు.

"ఏమన్నారు డాక్టర్ ?"

"గ్రామర్ దెబ్బతింది. 'డాక్టర్ ఏమంది ?' అనడగాలి !"

"సరే — ఏమంది ?"

"పాపకు జ్వరం వస్తోంది డాక్టర్...

ఆ మందులు వాడు.

—ఇలా తరచుగా జ్వరం వస్తూందండీ

—ఆ మందులు వాడు.

ఎక్కువగా దగ్గుతూందికూడా.

సరే

మరీ సన్నగా అయిపోతోంది రోజురోజుకీ.

నెక్స్ట్..."

ఇదీ డాక్టర్ అన్నది.

అతను ఆఫీసు కెళ్తుంటే చంటిది వెనుకే బయటివరకూ వచ్చింది.

"నాన్నా బిస్కెత్తు..."

"తెస్తానమ్మా ! నీ కోరిక ఖరీదు పదిపైసలకు మించనంతకాలం ఏం ఫరవాలేదు."

ఆఫీస్‌నుంచి అతను ఇంటికొచ్చేసరికి బాగా ఆలస్యం అయిపోయింది.

రాత్రి పన్నెండింటివరకూ వంటింట్లో కూర్చుని కథ రాశాడతను.

కుర్చీలో కూర్చునే నిద్రపోతోంటే సావిత్రి నిద్ర లేపిందతనిని.

"మీరిలా ఆరోగ్యం పాడుచేసుకుంటానంటే కథ రాయనివ్వను..." బాధగా అందామె.

"ఆరోగ్యం అనేది ఒకటుంటేకదా పాడవడానికి !"

"ముందు వెళ్ళి పడుకోండి !"

"మరి ఇంతవరకూ నేను రాసిన కథ చూడవా ?"

"ఎవరు చేసిన పాపం వారనుభవించాల్సిందే ! మధ్యలో నేనెందుకు చదవాలి ?"

"ప్లీజ్ !"

"ఊహూ ఇప్పుడుకాదు. రేపొద్దున్న..."

అతను వెళ్ళి పక్కమీద పడుకున్నాడు.

మర్నాడు తెల్లారుజామున లేచినప్పుడు అతను రాసిన కాగితాలు చూసింది సావిత్రి.

కృష్ణమూర్తి రోడ్డ రోలర్‌లా అరిచాడు. ఆ అరుపుకి కాఫీ తాగుతున్న భాస్కరం నోట్లో ఉన్న కాఫీని వర్షంలా ఎదుటి సీట్లోని హెడ్ క్లర్క్ మొఖం మీదకు ఉమ్మాడు. హెడ్ క్లర్క్ సీట్లోంచి అదిరిపడిలేవబోయి కుర్చీతో సహా వెనుక ఉన్న టైపిస్ట్ పిల్ల కాళ్ళదగ్గర పడిపోయాడు. రజని ఆయనను చూసి కిసుక్కున నవ్వి తన చేతిలోని కార్బన్‌లు గదంతా గాల్లోకి వదిలేసింది. (ఇక్కడ పాఠకులు నవ్వుకోవలసిందిగా ప్రార్థిస్తున్నాను.) ఆ తరువాత ఓ జోకర్ బొమ్మవేసి ఉంది.

"చాతకాపోతే ఊరుకోవాలి కానీ ఇలా హాస్యాన్ని చిత్రహింసలు పెట్టకండి" దానికింద రాసి సంతకం పెట్టింది సావిత్రి.

శ్రీనివాసరావ్ నిద్రలేస్తూనే ఆ కాగితాలు చూశాడు.

"సావిత్రీ" అంటూ కోపంగా అరిచాడు.

"ఏమిటి ?"

"ఇలారా !"

అతని దగ్గరకు నడిచిందామె.

"ఎందుకు రాశావలా ?"

"చిన్నప్పటినుంచీ ప్రతి విషయం గురించీ ఫ్రాంక్‌గా నా అభిప్రాయాలు తెలియజేయడం అలవాటు ... "

"అయితే నాకు హాస్యం రాయడం రాదంటావ్!"

"ఇంకా చాలా రాకపోవచ్చు కానీ ప్రస్తుతం రుజువయిందొక్కటే ... "

"ఇవాళ రాత్రికి కథ పూర్తిచేసి ప్రైజ్ కొట్టకపోతే అప్పుడడుగు !"

ఆ సాయంత్రం అతను వచ్చేసరికి సావిత్రి కంగారుగా కనిపించింది.

"చంటిదానికి వళ్ళు కాలిపోతూంది చూడండి!"

శ్రీనివాసరావ్ చంటిదాని వంటిమీద చేయి ఉంచి చూశాడు. కాలిపోతోంది.

"అరె ! ఉదయం ఫరవాలేదనుకున్నానే !"

"త్వరగా డాక్టర్ దగ్గరకు తీసుకెళ్దాం !"

"సరే ... "

పక్కింటివాళ్ళకు ఇల్లు అప్పచెప్పి ఇద్దరూ ప్రైవేట్ నర్సింగ్‌హోమ్ చేరుకున్నారు.

చంటిదాన్ని పరీక్షించి ఏవో మందులిచ్చాడు డాక్టర్. ఎక్స్‌రే కూడా తీశారు.

"పాపకు టి. బి. అని నాకు అనుమానంగా ఉంది. రేపు కన్‌ఫరమ్ అవుతుంది. ఉదయం రండి. టి. బి. హాస్పిటల్‌కి లెటర్ రాసిస్తాను..."

దిగులుగా ఇల్లు చేరుకున్నారిద్దరూ.

సావిత్రి ఇంక దుఃఖం ఆపుకోలేకపోయింది.

"చంటిది మనకు దక్కుతుందాండీ ?"

"మనం ధనవంతులమయితే తప్పక దక్కేది. ఎందుకంటే ఇది డబ్బున్నవాళ్ళకు రావలసిన జబ్బు ! రాంగ్ నంబర్ "

ఆ రాత్రంతా చంటిదాన్ని కనిపెట్టుకునే ఉన్నారిద్దరూ. ఉదయం టి.బి. హాస్పిటల్ చిల్డ్రన్ వార్డ్‌లో చేర్పించారు.

సావిత్రి చంటిదాని బెడ్ పక్కనే దిగాలుపడి కూర్చుండిపోయింది.

శ్రీనివాసరావ్‌కి ఆమెను చూస్తూంటే కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

"సావిత్రీ ! నేనెంత ఇడియట్‌నో చూశావా ! హాస్య కథ కోసం ఏమిటేమిటో ఆలోచిస్తున్నాన్నాళ్ళూ! నిజానికి ఇక్కడే మన దిక్కులేని కుటుంబాల్లోనే ఉంది హాస్యమంతా ! ఓ పక్క చచ్చేంత ఆకలేస్తూంటే తినడానికి తిండి ఉండదు ! అప్పుడు నిజంగా ఎంత ఫార్స్‌గా ఉంటుంది? పిల్లలు కోరే కోరికలనుంచి వారిని మరిపించడానికి ఎన్ని సరదా కబుర్లు చెప్పాలి ? మనలాంటివాళ్ళకు రావాల్సిన జబ్బులు ఇంకొకరికీ, ధనవంతులకు రావలసిన జబ్బులు మనకూ వస్తూంటే ఎంత నవ్వుగా ఉంటుంది ? క్షణక్షణానికీ ఛస్తున్నామని అనుకుంటూ చావకుండా విశేషంలా బ్రతికేస్తూంటే ఇంతకంటె హాస్యం ఇంకేముంటుంది ? ఇవన్నీ వదిలి వేరే హాస్య కథ లెందుకు ఆలోచించడం ?"

సావిత్రి జీవంలేని నవ్వు నవ్వింది



ప్రకృతి కానుక ప్రతి ఒక్కరికీ.
కోమల,యవ్వన ఛాయ
సర్వాంగాలకీ
శరీరమంతా పరిశుభ్రం
తల్లిలా చేసే సంరక్షణ
Margo
HERBAL TOILET SOAP
HTC-CCC 4000

స్త్రీల సమస్యలకు కారణం ఏమిటి?

విన్నకోట సుశీలాదేవి

ఈనాడు ఏ పత్రిక చూసినా స్త్రీల సమస్యలమీదే వ్యాసాలు, చర్చలు మనకు కన్పిస్తాయి!

అయితే — అసలు సమస్యలనేవి స్త్రీలకే ఎందుకుండాలి?! పురుషులకు సమస్యలు లేవా? అనేది ప్రశ్న!

సృష్టిలోని ప్రతి ప్రాణికీ ఏవో సమస్యలుంటూనే వుంటాయి. అయితే వీటిలో తేడాలున్నాయి. ధనవంతుడి సమస్యలు వేరు! దరిద్రుడివి వేరు! యజమానికి కంటె సేవకునికి సమస్య లెక్కువ! ఇందులో మూడు వంతులు యజమాని చేత కల్పించబడ్డవే! అలాగే మగవాళ్లకంటె ఆడవాళ్లకే ఎక్కువ సమస్యలుంటాయి! ఈ సమస్యలన్నీ కూడా మగవాళ్లచేత సృష్టించబడ్డవే!

ఈ సమస్యలు ఏర్పడ్డానికి కారణం ఒకటే - అదే సృష్టి వైచిత్రి అంటే ఈ లోకంలో ప్రతి ప్రాణీ, మరొక ప్రాణిపై అధికారం చెలాయించాలని చూస్తుంటుంది. మూర్ఖుడిపై తెలివిగలవాడు; దరిద్రుడిపై ధనవంతుడు; బలహీనుడిపై బలవంతుడు... ఇలా వాళ్లు తమ అధికారాన్ని చూపుతూ వాళ్లని హింసకు గురిచేస్తారు.



అలాగే పురుషుడు తనకంటె శారీరకంగా బలహీనురాలైన స్త్రీ మీద తన అధికారం చూపిస్తాడు. ఎలాగుంటే — ఆఫీసులో పై ఆఫీసరు చేత తిట్లుతిన్న గుమస్తా ఇంటికొచ్చి ఆ కోపాన్నంతా భార్యమీద చూపుతాడు గదా!

అయితే ప్రాచీనకాలంలో స్త్రీల స్థితి ఎంతో ఉన్నతంగా వుండేది. ఉపనిషత్తులో మొదటి ఆజ్ఞగా "మాతృదేవోభవ!" అని పేర్కొన్నారు. మన భారతదేశంలో తల్లికి ఒకప్పుడు అంతటి ప్రాధాన్యత లభించింది.

భారతీయ సంస్కృతి వైదిక కాలంలో స్త్రీలకు ఎనలేని గౌరవం ఇచ్చింది. మనస్తత్వవేత్తలు ఈ సమస్త విశ్వాన్ని విశ్వమాతగా వూహించి, దేవిగా భావించి, దుర్గ, భగవతి, కాళి, భవాని, అన్నపూర్ణ మొదలైన పేర్లతో ఉపాసన చేశారు.

ఆనాడు స్త్రీలు పురుషులతోపాటు సర్వవిద్యలూ నేర్చుకున్నారు. అన్ని రంగాల్లోనూ రాణించారు. ఆనాడు వాళ్లకు ఎటువంటి బాధలు కానీ, సమస్యలు గానీ లేవు. కానీ ఈ స్థితి రానురాను తగ్గిపోయింది.

స్త్రీ తక్కువ భావంతో చూడబడింది. "నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అంటూ కఠిన నియమాలు ఏర్పరచబడ్డాయి.

అయితే ఏ సాంఘిక పరిస్థితుల ప్రభావం వలన పురుషుడు స్త్రీని న్యూనతా భావంతో చూడడం మొదలెట్టాడో తెలీదు. ఆనాడు నూతనంగా ఏర్పడిన పరిస్థితుల ప్రభావంచేత స్త్రీ ఆ గౌరవ స్థానాన్నుండి తనంతట తాను జారిపోయిందా? లేక పురుషుడే ఆ పరిస్థితులను ఎదిరించి నిలబడలేక తాను స్వాతంత్ర్యాన్ని కోల్పోయి, స్త్రీ స్వాతంత్ర్యాన్ని కూడా హరించాడా? ఏమో? చరిత్ర కందని ఆ కాలంలోని పరిస్థితులు ఏమిటో మనకు తెలీవు.

కానీ ఒకటి మాత్రం నిజం! 'దేవి'గా పూజింపబడ్డ స్త్రీ బానిసగా మారింది. ఈ కాలంలో స్త్రీ ఎంత దుర్భర జీవితాన్ని గడిపిందో? ఎన్ని బాధలు, సమస్యలు ఎదుర్కొందో మాటల్లో చెప్పలేం. స్త్రీలు చాలా ఏళ్లు ఇటువంటి దుర్భర స్థితిలోనే వుండిపోయారు.

మన స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీ మహాత్ముడు స్వాతంత్ర్యోద్యమంతోపాటు స్త్రీ విమోచనా ఉద్యమాన్ని కూడా సాగించారు.

"దేశంలో సగం జనాభా స్త్రీలు వున్నారు. వాళ్లు చైతన్యవంతమైతేగానీ దేశం అభివృద్ధి చెందదు." అంటూ ఆయన స్త్రీలకు ఉద్బోధించారు.

ఆయన కృషి ఫలితంగా ఆమె ఇంటినుండి బయటికి వచ్చింది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంది. చదువుకుంది! అనేక పదవులు నిర్వహించింది.

చివరకు మనకు స్వాతంత్ర్యం లభించింది. అన్ని రంగాల్లోనూ మనం అభివృద్ధిని సాధించడానికి ప్రయత్నిస్తున్నాం. అయితే స్త్రీల విషయంలో ఈ అభివృద్ధి ఏమాత్రం సంతృప్తికరంగా లేదని చెప్పవచ్చు.

ఆమె ఉన్నత విద్యాభ్యాసం చేస్తోంది. గొప్ప గొప్ప వుద్యోగాలు చేస్తోంది. అయితే ఆమె సమస్యల్లో మాత్రం ఏమీ మార్పులేదు.

ఈ ఆధునిక కాలంలో — ప్రపంచమంతా వైజ్ఞానికంగా ముందుకు పురోగమిస్తున్న ఈ కాలంలో — మనమింకా స్త్రీల సమస్యల్ని గురించి చర్చించుకోడం చాలా వింతగా కన్పిస్తుంది.



ప్రతి వ్యక్తీ తనకొచ్చిన సమస్యకి తగిన పరిష్కారం వెదుక్కుని ఆ సమస్యనుండి బయట పడాలని ప్రయత్నిస్తుంటాడు. మనిషికి భగవంతుడు తెలివితేటలు, శక్తిసామర్థ్యాలు ఇచ్చింది కూడా అందుకే.

అలాగే స్త్రీలు కూడా తమకున్న సమస్యలేవిటో అవగాహన చేసికొని, ఆ సమస్యల్ని తొలగించుకోడానికి ప్రయత్నించాలి! అంతేగానీ, ఎవర్నో నిందిస్తూ, ఎవరో ఏదో చెయ్యలేదనీ, లేక చేస్తారనీ అనుకోవడం చాలా తెలివితక్కువ.

కాబట్టి మొదటగా తెలుసుకోవాలిసిన విషయం ఇది —

"స్త్రీల సమస్యలా? అంటే ఏవి?" ★

కాఫీ రుచిని అధికంచేసే క్రొత్త తయారీ విధానము
కాఫీ తాజాతనాన్ని అధికంగా సంరక్షించే క్రొత్త ప్యాకెట్

క్రొత్త బ్రూక్ బాండ్ గ్రీన్ లేబిల్



ఇప్పుడు బ్రూక్‌బాండ్ వారు ఉపయోగిస్తున్న క్రొత్తతయారీ విధానంవల్ల క్రొత్త గ్రీన్‌లేబిల్ కాఫీ రుచి ఇదివరకు కంటే చాలా అమోఘంగా వుంటుంది.


అంతేకాదు బ్రూక్‌బాండ్ వారిచే ప్రథమంగా ప్రవేశపెట్టబడిన క్రొత్త 'కీప్-ఫ్రెష్' ప్యాకెట్ కాఫీపొడి అప్పుడే చేయించిన కాఫీపొడిలాగ చెమ్మ ఎక్కకుండా వారాలకొద్దీ ఎప్పటికప్పుడే తాజాగా వుంటుంది.

క్రొత్త గ్రీన్ లేబిల్

అమోఘమైన రుచి విశిష్టమైన తాజాతనము
(ఇది బ్రూక్‌బాండ్ వారు మాత్రమే చేయగలరు)

ఎన్నిక చేసిన కొన్ని పట్టణములలో మాత్రం లభించును.


OBM 7148 TG


రండి
డిపీలాండ్
Dipy's
Dipy's


ఒకరోజు ఆలిస్ వాళ్ళక్కతో బాటు తోటలో కూర్చుంది. వాళ్ళక్కేమో బొమ్మల్లేని పుస్తకమేదో చదువుతోంది. అటువంటి పుస్తకాలంటే ఆలిస్‌కు పరమ చిరాకు. ఇక తనకు ఎలా తోస్తుంది అంటూ ఆలోచిస్తోండగా ....
ఒళ్ళే! ఇది కలకాదుగదా?! కుందేలు చక్కటి బట్టలేసుకుని ఓ చేత్తో జేబు గడియారం పట్టుకొని పరుగెడుతోంది!
బాబోయ్! బాగా ఆలస్యమై పోయింది,
త్వరగా వెళ్ళాలి!...
అరే! అలా భూమిలోకి వెళిపోతోందే విటో! తమాషాగా వుంది! నేను కూడా దాన్ని వెంబడించి వెళితే?
ఈ సొరంగం చాలా చీకటిగా వుంది... జాగ్రత్తగా వెళ్ళాలి...
అమ్మో! రక్షించండి!
క్రిందికి పడిపోతున్నాను!
అరే! పడిపోకుండా మెల్లగా దిగుతున్నాను!
అబ్బో! ఈ గది ఎంత విశాలంగా వుంది! ఓహో! ఇక్కడ అద్దంతో చేసిన బల్లవుందే! బంగారప్పు తాళంచెవి కూడా వుంది దీని మీద!
ఇది ఏ తలుపు దయి వుంటుందబ్బా? బహుశా దీనితో కుందేలు ఎటు వెళ్ళిందో తెలుసుకో వచ్చు అనుకుంటా!
1
బాపు

[ఇంకా ఉంది]

ఆంధ్ర సచిత్ర
సినిమా
1981



ఉత్తమ నటుడు : అక్కినేని నాగేశ్వరరావు



ఉత్తమ హాస్యనటుడు : అల్లు రామలింగయ్య

ఉత్తమ సహాయ నటుడు : మురళీమోహన్



ఉత్తమ సంగీత దర్శకుడు : చక్రవర్తి



ఉత్తమ చిత్రం

ప్రేమాభిషేకం

వార పత్రిక
బాలట్ ఫలితాలు



ఉత్తమ నటి : జయసుధ

ఉత్తమ దర్శకుడు : దాసరి నారాయణరావు



ఉత్తమ హాస్య నటి : రమాప్రభ

ఉత్తమ సహాయ నటి : రాజ్యలక్ష్మి



అందరికీ
ఆంధ్ర సచిత్ర వార పత్రిక
*
ఉగాది
*
శుభాభినందనలు




is the registered trademark of Reliance Textile Industries Ltd.


స్త్రీ మనోభావాలకు అందమైన
భాషలు ఎన్నెన్నో.
అందులో విమల్ ఒకటి.
VIMAL
A RELIANCE PRODUCT
100% పాలియెస్టర్ చీరలు



సినిమా విశేషాలు

-జి. వి. జి.



'భక్త ధ్రువ మార్కండేయ'లో సురేష్, వంశీ

జగన్నాథ రథచక్రాలులో కార్మిక శక్తి

ఆ కార్యాలయం ముందు దాదాపు వందమంది కార్మికులు కూర్చొని ఉన్నారు. అరుగుమీద కృష్ణ (కృష్ణ) పక్కన స్టూల్‌మీద కాలువేసి, రంగయ్య ఉన్నాడు. కృష్ణ కార్మికులను ఉద్దేశిస్తూ, "సోదరులారా! ఈ రంగన్నను చూడండి. ఇతడు మనలో ఒకడుగా మనతోపాటు కష్టపడి ఫ్యాక్టరీలో పని చేసేవాడు యజమాని ఆస్తి, అంతస్తులు పెరగడానికి కృషి చేసేవాడు. యాక్సిడెంట్‌లో దెబ్బతిన్న ఇతనికి ఖర్చు అవుతుందని, నష్ట పరిహారం ఎక్కువ ఇచ్చుకోవాలని సరైన వైద్యం జరగనివ్వలేదు యజమాని, ఆయన మనుష్యులు. దానివలన ఈనాడు కాలు మొత్తం తీసెయ్యాల్సి వచ్చింది. ఇంతకాలం మన యూనియన్ — స్వార్థ పరులు, యజమాని తొత్తులు అయిన మనుషుల చేతుల్లో ఉండడం వల్ల ఎవ్వరికీ ఏ ప్రయోజనం కలగలేదు. వాళ్ళను తప్పించి, యూనియన్‌ను మన చేతుల్లోకి తీసుకున్నాం గనుక, అన్యాయం జరిగిన మనిషి తరఫున అవసరమైతే యజమానితో పోరాడలి," అన్నాడు.

"మన నాయకుడు కృష్ణ చెప్పినట్టుగా ఇక నుంచి మనమంతా ఏకమై, జరిగిన అన్యాయాల్ని ప్రతిఘటించాలి," అంటూ వేణు (సాయిచంద్) బలపరిచాడు.

"అవును! వర్కర్స్ యూనియన్ జిందాబాద్!" అని అరుస్తూ కార్మికులందరూ లేచారు.

చరిత చిత్ర సమర్పించే వి.ఎం.డి. ప్రొడక్షన్స్ "జగన్నాథ రథచక్రాలు" చిత్రాన్ని వి. మధుసూదన రావు దర్శకత్వంలో విష్ణుప్రసాద్‌శర్మ నిర్మించారు.

"అమ్మాడు అలిగింది" కాదు; "కలహాల కాపురం" ఉగాది విడుదల

"ఆద్యంతం నవ్వించే చిత్రం. కలహాల కాపురం — అనే టైటిల్ కరెక్ట్‌గా ఉంది. అంచేత, ఈ పేరునే స్థిరపరిచాం," అన్నారు కె. వాసు ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో వడ్డే కిశోర్ నిర్మించే పై చిత్రంలో చంద్రమోహన్, సరిత, ప్రభాకరరెడ్డి, రావు గోపాలరావు, పద్మనాభం, పి. జె. శర్మ, రాళ్ళబండి, చలపతిరావు, నర్రా వెంకటేశ్వరరావు, జానకి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు. విజయమాధవి పిసి ఎంటర్‌ప్రైసెస్‌వారి ఈ చిత్రానికి సత్యానంద్ సంభాషణలకర్త. గోపీ గీతాలకు జె. వి. రాఘవులు స్వరకల్పన చేశారు నవకాంత్ ఛాయాగ్రాహకుడు. ఉగాది విడుదల.



'రాగం—తానం పల్లవి'లో చంద్రమోహన్, పూజా

"పెళ్ళిళ్ళ పేరయ్య" ఏప్రిల్ విడుదల

'తిరుపతి ప్రాంతాలలో ఒకే షెడ్యూల్‌లో మార్చి 6న పూర్తిచేశాం," అన్నారు జి. వి. కె ప్రొడక్షన్స్ అధినేత శివభారత్ బాబూరావు చంద్రమోహన్, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, నారాయణరావు, నూతన్‌ప్రసాద్, గిరిబాబు, సాక్షి రంగారావు, పి ఎల్ నారాయణ, సారథి, మాడా, ప్రభ, అరుణ, కృష్ణవేణి, అన్నపూర్ణ, యూన్ని, జ్యోతిలక్ష్మి పాత్రధారులు పరుచూరి సోదరులు మాటలు రాశారు. ఆత్రేయ, రాజశ్రీ గీతాలకు జె వి రాఘవులు బాణీలు కూర్చారు పి దేవరాజ్ ఛాయాగ్రాహకుడు, కొమ్మినేని దర్శకుడు



"నా షష్ట్యబ్ది రోజున నా రాజకీయ రంగ ప్రవేశం గురించి ప్రకటిస్తాను"

— ఎన్. టి. ఆర్.

"మన సదాశయాలకు భగవంతుని సంకల్పం తోడయితే, జీవితం ధన్యమౌతుంది. ఇంత కాలం నా గురించి శ్రమించాను. శేష జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేయాలని ఉంది. పైగా, ప్రస్తుత పరిస్థితులలో రాజకీయరంగంలో నా అవసరం ఎంతైనా ఉందని ఎందరో ఆత్మీయులూ, అభిమానులూ, హితైషులూ, లేఖల ద్వారా, టెలిగ్రామ్‌ల ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు. వారందరికీ నా హృదయపూర్వక ఉగాది శుభాకాంక్షలు... అంతా దైవేచ్ఛ. పరమాత్ముని ఆశీస్సులతో నా నిర్ణయాన్ని నా షష్ట్యబ్ది రోజున తెలియజేయగలను."

ప్రేమ నక్షత్రంలో ప్రేమ కోసం

పుస్తకం చేతబట్టి కూర్చొన్నాడేగాని ఫణి (కృష్ణ) దృష్టి అంతా ఎదురుగా ఉన్న కాటేజ్ వైపే ఉంది. హఠాత్తుగా శైలజ (శ్రీదేవి) కనిపించింది. రమ్మని పిలిచాడు. శైలజ భయంగా చూస్తూ పక్కకు చూపించింది. రావ్ (రావు గోపాలరావు) మేడమీద పచార్లు చేస్తున్నాడు అతన్ని తిట్టుకుంటున్న ఫణికి అప్రయత్నంగా గూటో తేలు కనిపించింది. చప్పున ఫణి మెదడులో ఓ ఆలోచన మెరిసింది. అమాంతంగా గవుకేకెట్టి, ఇటు అటు పరుగెత్తనారంభించాడు. కంగారుగా శైలజ అతనింటికి పరుగున వచ్చింది. "తేలు! తేలు!" అంటూ తన చూపుడు వేలుని, ఆ వేలుతో తేలుని చూపించాడు.

"అయ్యయ్యో!" అంటూ శైలజ, అతన్ని మంచంమీద కూర్చోబెట్టి, చీర చెంగు చింపి, అతని వేలుకి కట్టింది. "ఎలా ఉందండీ?"

"చాలా బాగుంది, శైలూ! నువ్విలా దగ్గర కూర్చుని సపర్యలు చేస్తూంటె, హాయిగా ఉంది. ప్రేమ — నొప్పిని తరిమేసింది, శైలూ! ఆఫీస్‌లో ఆ చూడామణి గుడ్లగూబ చూపు, ఆ రావ్‌గాడి ఆజమాయిషీ తట్టుకోలేకపోతున్నాను. పులి — మేక బొమ్మ ఇచ్చి, వెధవ సింబాలిజం చూపిస్తాడా రాస్కెల్! ఎప్పుడూ మనమిద్దరం ఇలా దగ్గర దగ్గరగా ఉండిపోవాలనుంది నాకు. తేలు కుట్టినప్పుడల్లా నువ్వు వస్తానంటే, రోజుకి రెండు సార్లు తేలుచేత కాటేయించుకుంటా."

ఇంతలో రావ్ హడావిడిగా వచ్చాడు ఏమైందంటూ. శైలజ చెప్పగానే "అరెరే! ఎంత పని జరిగింది! తోటి మనిషికి ఈ మాత్రం సాయం చెయ్యాలి. నే వెళ్ళి డాక్టర్‌ని పంపిస్తాను. ఈ రోజు మీరు ఆఫీస్‌కు రానక్కర్లేదు. నువ్విక్కడే ఉండి, అతనికేం కావాలో చూసి, వదింటికి ఆఫీస్‌కిరా, శైలజా! అర్జంట్ వర్కుంది," అంటూ రావ్ హడావిడిగానే వెళ్ళిపోయాడు.

"ఈయన మంచివాడో, చెడ్డవాడో, చెడ్డ మంచివాడో, మంచిచెడ్డవాడో తేల్చుకోలేకపోతున్నాను, శైలూ!" అని ఫణి అంటూండగా డాక్టర్ (మాలి) ఆయాసపడుతూ వచ్చి, "ఎలా ఉందయ్యా నొప్పి? తేలు కుడితే నొప్పిగాకాక తిమ్మిరి ఉంటుందా?" అంటూ సిరెంజి తీసి, "కదలకు. నిన్నొకడికి ఇంజెక్షనిస్తూంటే, సూది విరిగింది. మొన్నొకడికి సిరెంజి కూడా జబ్బలోకి దిగిపోయింది," అంటూనే ఓ ఇంజెక్షన్ ఇచ్చేశాడు.

ఫణి బాధగా "ఇన్ని పొడుస్తున్నారేమిటి, సార్? తేలుకుట్టిన బాధకంటే ఈ సూదులబాధ ఎక్కువగా ఉంది," అన్నాడు

"ఎక్కువగా ఉందంటే ఉండదటయ్యా?" అంటూ డాక్టర్ ఇంకో ఇంజెక్షన్ ఇచ్చి, "ఈ బాధలోపడి ఆ బాధ మర్చిపోతావని — ఒకటే నొప్పికి, ఇంకోటి నిద్రకు!" అన్నాడు.

"ఏమిటి, సార్! నిద్రకు ఇంజెక్షన్ ఇచ్చేశారా?" అంటూ ఫణి గుడ్లు తేలేశాడు


"ఇచ్చేశారా — అంటె, ఇవ్వొద్దటయ్యా? లేకపోతే షాక్ ఎలా తగ్గుతుందంటావ్? వస్తా!" అంటూ డాక్టర్ వెళ్ళిపోయాడు.

శైలజ గాభరాతో చూస్తూండిపోయింది

డాక్టర్ కొమ్మూరి వేణుగోపాలరావు కథతో ఎస్. హెచ్. హౌస్పిన్ సమర్పించే హేమా ఇంటర్నేషనల్ వారి "ప్రేమ నక్షత్రం" చిత్రాన్ని పర్వతనేని సాంబశివరావు దర్శకత్వంలో కె. బుజ్జిరెడ్డి, ఎం. జనార్దనరెడ్డి. పి. సురేంద్రరెడ్డి, ఎస్. రాధారెడ్డి నిర్మిస్తున్నారు జంధ్యాల సంభాషణలకర్త, ఎం. ఎస్. విశ్వనాథం సంగీత దర్శకుడు. వి.ఎస్.ఆర్. స్వామి ఛాయాగ్రాహకుడు.

'జగన్నాథ రథ చక్రాలు'లో కృష్ణ, జయప్రద






'పగబట్టిన సింహం'లో
గీత, అల్లు రామలింగయ్య



'మల్లె పందిరి'లో జ్యోతి

టింగు రంగడు

"ఫిబ్రవరి 19 నుంచి 28 వరకు తొలి షెడ్యూల్ పూర్తిచేశాం," అన్నారు టి. ఎల్. వి. ప్రసాద్. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించే అనిల్ ప్రొడక్షన్స్ "టింగు రంగడు"లో చిరంజీవి సరసన రాణీ పద్మిని నాయిక. జగ్గయ్య, జానకి, నూతన్‌ప్రసాద్, నాగభూషణం ఇతర ముఖ్య భూమికలు ధరిస్తున్నారు. భీశెట్టి సంభాషణలు, చక్రవర్తి సంగీతం, కొండపనేని రామలింగేశ్వరరావు శిల్పం, సత్యం కూర్పు, గూనా నాగేంద్రప్రసాద్ సహదర్శకత్వం నిర్వహిస్తున్నారు. "మార్చి 12 నుంచి 22 వరకు రెండవ షెడ్యూల్, ఏప్రిల్ 22 నుంచి మే 5 వరకు మూడవ షెడ్యూల్ జరుగుతాయి," అన్నారు నిర్మాత తాతినేని ప్రకాశరావు.



"ఉగాది పచ్చడి తయారు చేస్తోందట, షూటింగ్‌కి కాస్త ఆలస్యంగా వస్తానంది హీరోయిన్!"

"ప్రేమాభిషేకం — ఉత్తమాభిరుచులు గల ప్రేక్షకుల విజయం !"

దాసరి నారాయణరావు

"ప్రేమాభిషేకం - చిత్రం స్వర్ణోత్సవం జరుపుకుందంటే, ఆ విజయం ఉత్తమాభిరుచులు గల ప్రేక్షకులందరిదీనూ. వారందరికీ ఉగాది శుభాకాంక్షలు."

రఘుపతి రాఘవ రాజారాంలో మంచికి కాలం కాదు

హెడ్ మాస్టర్, స్కూల్ టీచర్ల ఎదురుగా మాణిక్యాలరావు చిందులు తొక్కుతూ, "నిరాహార దీక్ష. నిరాహారదీక్ష ఉద్యోగం రాకపోతే నిరాహారదీక్ష ఉద్యోగం వస్తే జీతాలు రావటం లేదని నిరాహారదీక్ష. జీతాలిస్తే, సరిపోవడం లేదని నిరాహారదీక్ష. పనిలేని వాళ్ళందరికీ ఇదొక పనిముట్టయిపోయింది. అసలెవరండీ ఈ రఘుపతి?" అన్నాడు.

హెడ్ మాస్టర్ వినయంతో "చాలా ఉత్తముడండీ. నేను ఈ స్కూలు హెడ్ మాస్టర్‌గా వచ్చిందగ్గర్నుంచి చూస్తున్నాను—పిల్లలకు పాఠాలు చెప్పడంలో అతనికి గల ఓర్పు, నేర్పు...ఆయనకు ఎవ్వరూ సాటిరారండి. మంచితనం మూర్తీభవించిన వ్యక్తి. మానవులంతా ఒకే జాతి అని నమ్మే మనిషి రఘుపతి," అన్నాడు.

"ఈ ఒక్క పాయింటు చాలు — అతన్ని ఉద్యోగంలోంచి తీసెయ్యటానికి," అంటూ మాణిక్యాలరావు ఆ స్కూలు నిర్వాహకుడు వెంకట్రావు వంక తిరిగాడు.

"రఘుపతిగా గుమ్మడిగారిది విశిష్టమైన పాత్ర," అన్నారు డైరెక్టర్ కె. శివరామప్రసాద్. శ్రీ సూర్యచంద్ర పిక్చర్స్ వారి ఈ చిత్రంలో ప్రసాద్ బాబు, నరసింహరాజు, మాస్టర్ వెంకటేశ్వర్లు, అత్తిలి లక్ష్మి, కాంచన, ఒక కొత్త తరహా పాత్రలో నూతన్‌ప్రసాద్ కనిపిస్తారు. రావూరి సత్యనారాయణ, ఎం. చంద్రమౌళిరాజు సహ నిర్మాతలు. ఎల్. ఎస్. ప్రసాద్ నిర్మాత.

సినిమా

ప్రేమ మూర్తులు

"నిస్వార్థపరులైన ముగ్గురి ఉదాత్తమైన ప్రవృత్తుల రూపకల్పన. అందుకే 'ప్రేమమూర్తులు' అనే టైటిల్‌ను నిర్ణయించాం," అన్నారు ఎ. కోదండరామిరెడ్డి. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించే శ్రీ రాజ్యలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్‌వారి ఈ చిత్రంలో శోభన్‌బాబు, లక్ష్మి, రాధ, రావు గోపాలరావు, నూతన్‌ప్రసాద్, అల్లు రామలింగయ్య ముఖ్య తారాగణం. శ్రీ శెట్టి కథకు సత్యానంద్ సంభాషణలకర్త. వేటూరి, ఆరుద్ర గీతాలు రాశారు. వెంకట్ ఛాయ, సాయికుమార్ శిల్పం, డి. వెంకటరత్నం కూర్పు, చక్రవర్తి సహకార దర్శకత్వంతో కె. ఎల్. ఎన్. శాస్త్రి నిర్వహణా బాధ్యతలు వహిస్తున్నారు. "ఫిబ్రవరి 20 నుంచి 28 వరకు జరిగిన షెడ్యూల్‌తో ఇన్‌డోర్ వర్క్ పూర్తయింది నాలుగు పాటల ఔట్‌డోర్ చిత్రీకరణ మాత్రం మిగిలి ఉంది," అన్నారు ఈ చిత్ర నిర్మాత మిద్దె రామారావు.





వడ్డే శోభనాద్రి సమర్పించు

విజయ మాధవీ సినీ ఎంటర్‌ప్రైసెస్


కలహాల కాపురం

కలర్

దర్శకత్వం. కె.వాసు నిర్వహణ: వడ్డే రమేష్

నిర్మాత. వడ్డే కిషోర్

SAI KRISHNA ADS



మధుర స్మృతులు కలిగించే ఆనందం...
రోజంతా నిలిచివుండే తాజాతనం
పాండ్స్ డ్రీమ్‌ఫ్లవర్ టాల్క్
మీరు ఎప్పుడూ వలచే పరిమళము.
POND'S
Pond's Dreamflower talc
HTM-PIL-2648

సినిమా

భార్గవ వారి రెండు కొత్త చిత్రాలు

"దుష్టుల ఆట పట్టించడం కోసం కమలహాసన్ ఏడు విలక్షణమైన పాత్రలను అపూర్వంగా పోషించారు. పూర్తి వినోదాత్మక చిత్రం," అన్నారు కె. సత్యనారాయణ. ఈయన "చిలిపి మొగుడు" అనంతరం సమర్పించే కొత్త చిత్రం "చిలిపి చిన్నోడు". ఇందులో మాధవి, కవిత, సురేఖ, సుమన్ ఇతర పాత్రధారులు. మాటలు, పాటలు రాజశ్రీ రాశారు. ఇళయరాజా సంగీత దర్శకుడు. నిర్మాత : ఎస్. గోపాలరెడ్డి. ఉగాదికి విడుదల చేయాలని సంకల్పం.

ఈ సంస్థ "కుటుంబం ఒరు కదంబం" అనే తమిళ హిట్ చిత్రం ఆధారంగా ఎం. ఎస్. కోటారెడ్డి దర్శకత్వంలో ఏప్రిల్‌లో ప్రారంభించే చిత్రంలో చంద్రమోహన్, సత్యనారాయణ విభిన్నమైన పాత్రలలో కనిపిస్తారు.

టైటిల్స్ జోక్స్!

"మీరిప్పుడు తీస్తున్న చిత్రం పేరేమిటి?"

"చెప్పనంటే చెప్పను."

"ఏం? ఇతరులు కాపీ కొట్టేస్తారని భయమా?"

"కాదండీ. ఆ చిత్రం పేరే "చెప్పనంటే చెప్పను!"

* * *

"సోమరిపోతా; తన్నులు తింటావ్, ఇడియట్ — అనే మూడు విభిన్నమైన కథలు నా దగ్గర ఉన్నాయండి. మీరు చదివితే, తప్పకుండా ఏదో ఒకదానిని సినిమాగా తీస్తారు."

"అక్కర్లేదులెండి ..నాన్సెన్స్, గెట్టవుట్, స్కాండల్-- అనే మూడు సినిమా స్క్రిప్టులు మా దగ్గర రెడీగా ఉన్నాయి."

* * *

"నేను నల్లులు, దోమలతో ఓ చిత్రాన్ని మలయాళం స్టైల్లో తీయదలిచాను."

"తమాషాగా ఉందే! ఇంతకీ, చిత్రం పేరేమిటో?"

"రక్తం చిందిన రాత్రులు"

జయభేరీ ఆర్ట్ మూవీస్

"ఏలూరులో జూన్ 7 నుంచి 25 వరకు ఫస్ట్ షెడ్యూల్ జరుగుతుంది," అన్నారు డైరెక్టర్ రాజాచంద్ర. "వారాలబ్బాయి" అనంతరం పై సంస్థ నిర్మించే చిత్రంలో మురళీమోహన్, రాధిక నాయికా నాయకులు. చక్రవర్తి సంగీత దర్శకుడు. జూలై 10 నుంచి 21 వరకు జరిగే రెండవ షెడ్యూల్‌తో చిత్రం పూర్తవుతుంది.

"పెద్ద పండుగ"

ఏ. ఎన్. ఆర్.


"ఎందరి జీవితాలనో ధరిస్తూ, ఆ పాత్రల సమస్యలను, కష్టసుఖాలను ఆలోచిస్తూ, ఆ పాత్రల ఆశలను, ఆనందాలను, బాధలను భరించి — షూటింగ్ ముగిసి ఇంటికి చేరుకున్నాక — మనమళ్ళతో, మనమరాళ్ళతో ఎక్కువసేపు కాలక్షేపం చేసి, ఎక్కువగా రిలాక్స్ అవగలిగిన ప్రతిరోజూ నాకు పెద్ద పండుగే!"

మురళీమోహన్

"ఉగాదికి కొద్ది రోజుల ముందుగా నా 100వ చిత్రం "వారాలబ్బాయి" వంద రోజుల వేడుక జరిగిన నాడే "ఆంధ్రపత్రిక" బాలట్‌లో ఉత్తమ సహాయ నటుడుగా నేను ఎన్నిక అయిన సంతోషకరమైన వార్త తెలిసింది. అంచేత, ఉగాది అందరికీ పెద్ద పండుగ అయితే, నాకు ఈ ఉగాది మరింత పెద్ద పండుగ!"

'విప్లవ సింహం'లో శ్రీదేవి





'ప్రేమ నక్షత్రం'లో సులక్షణ, సుధాకర్

విప్లవ సింహం

"అక్రమంగా ప్రజలను దోచుకున్న స్వార్థ పరులను కొల్లగొట్టి, పేదలకు అండగా నిలిచి వీరుడుగా చిరంజీవి, కర్తవ్య నిర్వహణలో తారతమ భేదాలు లేక అవినీతిపరులను శిక్షించే విప్లవ వీరుడిగా రజనీకాంత్ పాల్గొన్నారు," అన్నారు వైజాగ్‌లో అనేక చిత్రాలు పంపిణీ చేసే వేణు మూవీస్ "విప్లవ సింహం" చిత్ర నిర్మాత పి. శ్రీనివాసరావు శ్రీదేవి ఒక సరికొత్త పాత్రలో కనిపిస్తుంది. రాజశ్రీ మాటలు, పాటలు రాశారు ఎం. ఎస్. విశ్వనాథం – కృష్ణప్రసాద్ సంగీత దర్శకులు బాబు ఛాయాగ్రాహకుడు. గుండు సత్యనారాయణ మూర్తి నిర్వహణలో ఎస్. పి. ముత్తురామన్ దర్శకుడు. మార్చి విడుదల.



'చిలిపి చిన్నోడు'లో మాధవి, కమలహాసన్

సినిమా

కర్నూలులో నమస్తే మూవీస్ "నటన"

"ఫిబ్రవరి 26న కర్నూలు మునిసిపల్ ఆడిటోరియంలో స్థానిక డి. ఐ. జి సతీమణి శ్రీమతి ఇందిరా రాజన్ కెమెరా స్విచ్ ఆన్, ఎస్ పి సతీమణి శ్రీమతి అనితాసేన్ తొలి క్లాప్‌తో ప్రారంభోత్సవం జరిగింది. ఆ ఆడిటోరియం గ్రౌండ్స్‌లో విద్యార్థులపై కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను, 'ఓ నవయువకా!' అనే వరకట్న నిషేధాన్ని బలపరిచే గేయ నాటికను చిత్రీకరించాం. ఒకే షెడ్యూల్‌లో మార్చి 25 వరకు కర్నూలు, శ్రీశైలం ప్రాంతాలలో షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు నిర్మాత ఎం. బషీర్ అహ్మద్ ఖాన్. నాగేంద్ర, భువన, శ్రీవల్లి, శిరీష, పి.ఎల్. ప్రసాద్, విశ్వనాథ్, ఆచంట వెంకటరత్నంనాయుడు, సిద్దేష్ పాత్రధారులు కథ, పాటలు ఎం. బషీర్, మాటలు ఆర్కశ్రీ రాశారు. జె. పురుషోత్తం సంగీతం, ఆర్. రామారావు ఛాయ, అంకిరెడ్డి కూర్పుతో ఎం. డి. ఇస్మాయిల్, హుస్సేన్‌ఖాన్ ప్రొడక్షన్ కంట్రోలర్స్. కె. గురుదేవ్ స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు. నటుడు స్వర్గీయ అమర్‌నాథ్ కుమారుడు ఎం. ప్రసాద్ ఒక కీలక పాత్రద్వారా పరిచయంగావింపబడుతున్నాడు

నాకు నచ్చిన జోక్

అల్లు రామలింగయ్య

"నిన్న అర్ధరాత్రి సినిమా సెకెండ్ షో చూసి వస్తూంటే, ఒక దొంగవెధవ నన్ను పట్టుకుని 14 దెబ్బలు కొట్టాడు."

"వాడలా ఒక్కొక్క దెబ్బ కొడుతూంటే, మవ్వేం చేస్తున్నావ్ ?"

"దెబ్బలు లెక్కపెట్టుకుంటున్నా."

"నోరు తెరిచి అరవకపోయావా ?"

"నోరు తెరిస్తే ఇంకేమైనా ఉందా ? నా బంగారపు పన్ను వాడికి కనిపిస్తే, వదిలి పెడతాడేమిటి ?"

రమాప్రభ

"మా కొట్టులో ఈ ఫాన్ కొంటే, బహుమతిగా ఒక స్కేల్‌ను ఇస్తాం."

"స్కేల్ ఎందుకూ ?"

"ఫాన్ తిరక్కపోతే తొయ్యడానికి."

చక్రవర్తి

"మీ అమ్మాయిని నాకిచ్చి పెళ్ళి చేయమని అడగడానికి వచ్చానండి."

"ఆ! ఎంత ధైర్యం నీకు ?"

"ఏమిటంటున్నారు ? మీ అమ్మాయిని చేసుకోడానికి ధైర్యం ఉండాలా ?"


రాజ్యలక్ష్మి

"ఆకాశవాణిలో ప్రతిరోజూ ఉదయం భక్తిగీతాలు ఎందుకు ప్రసారం చేస్తారు ?"

"తర్వాతి కార్యక్రమాలకు అంతరాయం కలగకుండా ఉండేందుకేమో !"

"మామ్మగారి మనవలు"

"చంద్రమోహన్, సుమలత, సుధాకర్, అరుణ, నిర్మల, నాగభూషణం ముఖ్యపాత్రలు ధరిస్తారు," అన్నారు జనార్ధన్. ఈ యువకుడు డైరెక్టర్ కె. రాఘవేంద్రరావు వద్ద దర్శకత్వశాఖలో అనుభవం గడించాక అర్జున్ ఆర్ట్స్ అనే నూతన సంస్థ నిర్మించే పై చిత్రానికి తొలిసారిగా స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు హెచ్. ముఖ్య ప్రకాశ్ కథకుడు. మాటలు, పాటలు గోపీ రాస్తున్నారు. కృష్ణ – చక్రి స్వరకల్పనలో మార్చి 26 నుంచి పాటలు రికార్డ్ చేయబడతాయని నిర్వహణ బాధ్యతలు వహించే యడవల్లి దుర్గా ప్రసాద్ తెలియజేశారు. నవకాంత్ ఛాయాగ్రాహకుడు. కె. శివశంకర్ సహ నిర్మాత. మే, జూన్, జూలై మాసాలలో షూటింగ్ జరిగే ఈ చిత్రానికి వల్లభనేని చంద్రవతీదేవి, కావూరి సీతాదేవి నిర్మాతలు. ★



సునీతా పిక్చర్స్ హైదరాబాద్ ఫోన్: 30232.

తార శ్రీమతి–కామ్రేడ్

సీరియల్

(గత సంచిక తరువాయి)

ఆ తర్వాత వెంకట్ వ్రాసిన ఆ జాబును ఎన్నోసార్లు చదువుకుంది తార. ఎన్నిసార్లు చదివితే అన్ని క్రొత్త అర్థాలు కన్పించేవి తారకు! అంతేకాకుండా తారలోకూడా ఏదో ఆవేశంలాంటిది కలిగేది! పూర్తిగా ఇంటి పనుల్లో పాతిపెట్టిన విప్లవ భావాలను మరలా రేకెత్తించేది! నిద్రాణమైన తార భావాలను తట్టి తట్టి మేల్కొలిపేది!

ఈసారి తార పిచ్చిదానిలాగా డబ్బంతా తీసుకెళ్ళి తల్లి చేతికివ్వలేదు! వంద రూపాయలు మాత్రం తల్లికిచ్చింది.

నాలుగేళ్ళా నిండాయి కదా అని స్వప్నను స్కూల్లో చేర్పించింది. ఎపుడో కొన్న గౌన్లే తప్ప మళ్ళీ ఈమధ్య అసలేమీ కొనలేదు. అవన్నీ పాతబడిపోయి, అక్కడక్కడా బెజ్జాలు కూడా పడ్డాయి! అందుకని స్వప్నకు రెండు గౌన్లు కుట్టించింది! రాఘవయ్యగారికి రెండే పంచెలు ఉన్నట్లున్నాయి! ఒకటి ఒంటిమీద ఉంటే, రెండోది పాకలి దగ్గర ఉంటున్నాది. ఈమధ్య వర్షాలలో చాలా ఇబ్బంది పడ్డారు. వాటిల్లోకూడా ఒకటి బాగా అరిగి, కాస్త చిరుగుపట్టినట్లుంది. అందుకని ఆయనకు ఒక పంచె కొన్నది! తర్వాత తల్లి ఏమయినా అనుకుంటుందేమో అని ఇన్నాళ్ళూ భయపడిన తార 'ఏమనుకుంటే అదే అనుకుంటుందిలే' అనే మొండి ధైర్యంతో ప్రక్కింటి కామాక్షమ్మ దగ్గర పాల వాడుక పెట్టుకుంది! ప్రతిరోజూ ఉదయం సాయంత్రం కూడా పోయించుకునేట్లుగా మాటాడింది. అందుకు డబ్బుకూడా ముందరే కట్టేసింది. ''తర్వాత ఇద్దువుగానిలే అమ్మా'' అని ఆవిడ అంటున్నాకూడా ''ఫర్వాలేదులే పిన్ని, ఉంచు! నువ్వు నాకు ఇంత సహాయం చేస్తున్నావు! అదే పదివేలు! నీ కివ్వాల్సొచ్చేసరికి ఒకవేళ నా దగ్గిర డబ్బు లేకపోతే నేనేం చేయగలను'' అంటూ మృదువుగానే నచ్చజెప్పింది.

తండ్రితో చెబితే రెండు నిమిషాలు ఏమీ మాట్లాడలేదు. తర్వాత ''మంచిపని చేసావు తల్లీ!'' అని కళ్ళు మూసుకున్నారు. కంటి చివర్లనుండీ చెవుల దగ్గరకు జారుతూన్న వెచ్చటి కన్నీటిని చూసి నిట్టూర్చింది తార. అయితే ఆనాడు ఆ కన్నీటికి అర్థం మరోలా భావించింది. 'దొడ్లో రెండు పాడి గేదెలుండగా పసిపిల్లకు పాలు పట్టాలంటే ప్రక్కింట్లో కొనుక్కోవలసి వచ్చిందన్న ఆవేదనకు ప్రతిరూపం ఆ కన్నీరు' అనుకుంది.

కాని, ఇవ్వాళ ఉదయంగానీ ఆ కన్నీటికి అసలైన అర్థం తెలిసిరాలేదు. రోజూలాగానే ఆ రోజుకూడా ఉదయంపూట ముఖప్రక్షాళన చేయించే ఉద్దేశంతో తండ్రిని మెల్లగా పిల్చింది.

''నాన్నా''

కళ్ళు తెరచి, చిన్నగా నవ్వారు. ''ఇవ్వాళ ఇంకొంచెం సేపు పడుకోవాలనిపిస్తోందమ్మా, అందుకని నీ పనులు చూసుకో, తర్వాత లేస్తాను.''

ఆయన ఎన్నడూ సూర్యోదయం తర్వాత పడుకోగా తారకు చూసిన గుర్తులేదు. ఎవరైనా పడుకున్నా ఆయనకు నచ్చేదికాదు. అలాంటిది ఇవ్వాళ అలా చెప్పేసరికి కించిత్ ఆశ్చర్యపోయింది. అయినా ఏమీ అనకుండా నవ్వి, గది బయటకు వెళ్ళిపోయింది. ఇంక ఎనిమిది గంటలయ్యాక డాక్టరుగారు వచ్చేవరకూ తారకు ఇవతలకు రావటానికి వీలుకాలేదు.

తార గుడివాడ వచ్చేక నాగరత్నమ్మకు ఒక క్రొత్త అలవాటు వచ్చింది. ఉదయం పాలు పిండాక పాల అమ్మకం పని జోరుగా సాగేది! ఒక అరగంటలో ఆ పని అవ్వగానే మిగిల్చి ఉంచిన అరగ్లాసుడు పాలల్లో గ్లాసుడు నీళ్ళు పోసి కాఫీ కాచేది. చూరునీళ్ళలాటి ఆ కాఫీని గ్లాసులో పోసుకుని, మూడు స్పూనులు పంచదార వేసుకుని పానకంలా గడగడా తాగేసేది. మరో గ్లాసుడు కాఫీని సాయంత్రానికి తీసి దాచుకునేది. మిగిలిందాన్ని గిన్నెలోనే ఉంచి మూత పెట్టేది. అక్కడితో ఆవిడ పని అయిపోయిందన్న మాట! ఇహ గేదెల్ని తీసుకుని చెల్లెలి ఇంటికి వెళ్ళిపోయేది. అక్కడ చెల్లెలి ఇంటికి వెనకవైపున ఖాళీ స్థలం ఉంది! అది అంతా పచ్చగడ్డితోనూ, పిచ్చిమొక్కలతోనూ నిండి ఉంటుంది. అందుకని గేదెల్ని అక్కడకు తోలేసేది. అవి తిన్నంతసేపు అక్కడే తిని, ఆ తర్వాత నెమరువేస్తూ అక్కడే నీడన పడుకునేవి.

ఇంక ఆవిడేమో చెల్లెలి ఇంట్లో చాకిరీ చేస్తుండేది! ఆ చెల్లెలికి ఇంటినిండా సంతానం! ఒక చిన్నసైజు వానరసైన్యం! వాళ్ళతో వేగటానికే ఆమెకు సమయం చాలేదికాదు! పైగా తింటూన్న తిండి అంతా పిల్లలతో వేగేందుకే సరిపోతోంది! అందువల్ల పాపం ఇంటిపని చేసుకోలేకపోతోంది అని జాలిపడి ఆవిడకు సహాయం చేయటానికి వెళ్ళిపోతున్నాది నాగరత్నం. ఆ వెళ్ళటం, వెళ్ళటం ఇహ మధ్యాహ్నానికి వచ్చేది. నాగరత్నమ్మకు చెల్లెలు అవస్థపడుతున్నాది అని తెలుస్తున్నాదే కానీ, ఇంటెడు చాకిరీ వదిలేసి తాను వెళ్తుంటే పసిపిల్లలతో, మంచాన ఉన్న తండ్రితో కూతురు ఎంత హైరాన పడుతోందో తెలియటంలేదు. నిజంగా తెలియటంలేదో, మరి తెలిసికూడా కావాలని పని అంతా కూతురి నెత్తిన వేసి వెళ్తోందో అర్థంకాదు.

అందువల్లనే తారకు డాక్టరు వచ్చే వరకూ మళ్ళీ తండ్రి దగ్గరకు రావటానికి వీలుకుదరలేదు. తడిచేతులు కొంగుకు తుడుచుకుంటూ గదిలో అడుగు పెట్టిన తార క్షణంసేపు అట్లాగే నిలబడిపోయింది.

డాక్టరుగారు రాఘవయ్యగారి కుడికాలు, కుడి చేయి ఎత్తి ఎత్తి చూస్తున్నారు. రాఘవయ్యగారి కళ్ళనుండి ధారగా ప్రవహిస్తున్నాది కన్నీరు!

చూచాయగా విషయాన్ని అర్థం చేసుకొన్న తార ఇంక నిలబడలేక పోయింది. అంతేకాదు, కొన్ని రోజులుగా ఎంతో ఓపికతో నిగ్రహించుకుంటూ అదిమి పట్టి ఉంచిన దుఃఖం అంతా కట్టలు తెంచుకున్న నదిలా ఒక్కసారిగా ముంచుకొచ్చింది.

తన ఎడమ చేతి ఒంపులో తల దూర్చి వెక్కి వెక్కి ఏడుస్తూన్న కూతుర్ని ఎలా ఓదార్చాలో కూడా అర్థంకాలేదు రాఘవయ్యగారికి.

వాళ్ళను చూస్తుంటే డాక్టరుగారి మనసు కూడా ద్రవించింది. దూరంగా నిలబడి బిక్కముఖంతో ఇటే చూస్తున్న స్వప్నను తీసుకుని బయటకు వెళ్ళారు.

మళ్ళీ డాక్టరుగారు గదిలోకి వచ్చేసరికి తార కొంచెం తేరుకుంది.

''తారా! మరీ ఇంత బేలవయితే ఎలాగు! నాన్నకు ధైర్యం చెప్పాల్సింది పోయి,నువ్వే అధైర్య పడిపోతున్నావు. మొదట నీకు వైద్యం చేయాల్సి వచ్చేట్టుంది! చూడూ– మీ అదృష్టం బాగుండి

జరిగిన కథ–16 కమ్యూనిస్టు పార్టీ ప్రముఖులలో ఒకడుగా పేరు తెచ్చుకుంటాడు వెంకటరత్నం. ఎవరెన్ని విధాల నచ్చజెప్పినా వినక వెంకటరత్నాన్నే పెళ్ళి చేసుకొంటుంది తార. ప్రకాశం మంత్రివర్గం ఏర్పాటయిన తరువాత కమ్యూనిస్టుపార్టీని నిషేధించింది. తత్ఫలితంగా వెంకట్‌ను పట్టుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తుంటుంది పోలీసుశాఖ. అతనిప్పుడు పూర్తిగా వేషం మార్చేసి తప్పించుకు తిరుగుతుంటాడు. తమకి దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నాడనే కోపంతో వెంకట్ ఇంటిపై మెరుపు దాడులు చేస్తూ అతని కుటుంబ సభ్యులతో చాల అసభ్యంగా, అమానుషంగా ప్రవర్తిస్తుంటారు పోలీసులు. వెంకట్ ఆజ్ఞపై తార పిల్లలతో పుట్టింటికి వెళ్తుంది. భాగస్వామిని నమ్మి మోసపోవడంతో, రాఘవయ్యగారు చాలా కృంగిపోయారు. పిల్లలను ప్రసాద్ తనవెంట తీసుకు వెళ్తాడు. ఇక నాగరత్నమ్మ నోటికి, చేసే పనులకు అదుపు అనేది లేకుండాపోయింది.

ఆయనకు మాట పడిపోయింది ! ప్రమాదమేమీ లేదు ! నువ్వు ధైర్యంగా ఉండు."

డాక్టరుగారు అనునయించుతూన్న కొద్దీ తార దుఃఖం ఇంకా ఇంకా ఎక్కువవుతోంది !

"మీకు తెలీదు డాక్టర్ ! నాకు ఊహ తెలిసాక నాన్నకు జ్వరం కూడా రాలేదు ! ఆయన ఒక్క రోజు కూడా అనారోగ్యంతో మంచంపై పడుకున్నట్లు నాకు గుర్తులేదు ! అలాటి నాన్న ఎలా అయిపోయారు ! ఇంకా ఇవ్వాళలేస్తారు, రేపులేస్తారు అని ఎంతో ఆశతో ఎదురు చూస్తుంటే......"

తారకు ఆ పైన మాట్లాడే శక్తి లేకపోయింది. పయటచెంగు నోటికి అడ్డు పెట్టుకుని బావురుమంది.

"అయ్యయ్యో ! పిచ్చిపిల్లా ! ఏమిటి తారా ! మరీ ఇంత పిరికి దానివని అనుకోలేదు. ఛా ! ఛా ! ఏడవబోకు. ధైర్యంగా ఉండాలిగాని......"

"లేదు డాక్టర్ ! కొండంత అండగా నాన్న ప్రక్కనుంటే ఎన్ని ఎదురు దెబ్బలయినా ధైర్యంగా ఎదుర్కోగలను. కానీ, నాన్న... నాన్నే ఇలా అయిపోతే ఇంక నాకు దిక్కెవరు డాక్టర్ ! ఏం చూసుకుని ధైర్యంగా ఉండమంటారు ! చెప్పండి డాక్టర్ చెప్పండి ! రేపు తమ్ముళ్ళొస్తే వాళ్ళకేమని చెప్పను !" ఈసారి తారకు జవాబు చెప్పటం డాక్టర్‌కూ చేతకాలేదు.

మధ్యాహ్నం వచ్చిన నాగరత్నమ్మకు విషయం చెప్పింది తార. ఉదయం నుండీ కళ్ళు తుడుచుకుంటూనే ఉన్నది

భర్తకు 'పక్షవాతం' అని విన్నవెంటనే నాగరత్నమ్మ అవాక్కయింది. ఆ తర్వాత పెద్దకూతుర్ని నానా తిట్లూతిట్టింది. 'ఈ శని ఇంట్లో కాలు పెట్టబట్టే చక్రంలాగా తిరిగే మనిషి మంచాన పడ్డారు !' అన్నది. తర్వాత కొంచెంసేపు రాగాలు పెట్టింది, దీర్ఘాలు తీసింది !

* * *

చంద్రం, రామ్మోహన్ వచ్చారు. తండ్రిని చూసి చిత్తరువులే అయ్యారు ! అక్కా తమ్ముళ్ళు ఒకళ్ళనొకళ్ళు ఓదార్చుకున్నారు.

మగపిల్లలకు ఇంటి పరిస్థితులు చూస్తుంటే మతి పోతున్నాది !

రాఘవయ్యగారికి పక్షవాతం అని తెలిసిన మరురోజు నాగరత్నమ్మ చెల్లెలి ఇంటికి వెళ్ళలేదు. ఆ సాయంత్రం చెల్లెలూ, ఆమె భర్త రాఘవయ్యగారిని చూడవచ్చారు. వాళ్ళను చూడగానే భోరు భోరుమని ఏడ్చేసింది నాగరత్నమ్మ. అక్కను సముదాయించింది ఆమె చెల్లెలు ! కొంచెం సేపుండి వెళ్ళిపోయారు. ఆ మరువటి రోజునుంచీ మళ్ళీ మామూలుగా వెళ్తూనే ఉన్నది ఆమె ఇంటికి !

ఇదివరకులేని ఈ అలవాటుని చూసి చంద్రం, మోహన్‌లు ఇద్దరూ కూడా చాలా బాధపడ్డారు. ఆ రోజు తల్లి రాంగానే మందలించాలని అనుకున్నారు. సాధారణంగా ఆమె వచ్చే వేళకు రాఘవయ్యగారికి అన్నం పెడుతూంటుంది తార. ఇవ్వాళ కూడా తార అన్నం తినిపించుతూంటే చంద్రం తండ్రి ప్రక్కనే ఉన్నాడు, రామ్మోహన్ రేణుకతో ఆటలాడుతున్నాడు. అపుడే వచ్చింది నాగరత్నమ్మ. ఆమె లోపలకు వెళ్ళాక కొంచెమాగి అన్నదమ్ములిద్దరూ లోపలకు వెళ్ళారు. అచటి దృశ్యం చూసి నిజంగా చకితులయ్యారు.

నాగరత్నమ్మ జాకెట్‌లోంచీ, బొడ్లోనుంచీ ఏవేవో పొట్లాలు తీస్తూంది.

'అవేమిటి ?'


'అవేమిటో చూడాలి' అనే కుతూహలంతో శబ్దం చేయకుండా ప్రక్కకు నిలబడ్డారు. పొట్లాలు తీయటం అవ్వంగానే ఒక్కొక్క పొట్లం విప్పదీస్తూ సర్దుకుంటోంది. ఒక పొట్లం కందిపప్పు, మరొకటి చింతపండు, ఇంకోటి కాఫీపొడి, గోధుమ పిండి – అవి చూడంగానే వాళ్ళకు అర్థంకాలేదు. కాని, ఆవిడ అటూ ఇటూ బిత్తరచూపులు చూస్తూ గబగబా సర్దటం చూస్తే అనిపించింది– 'అవి దొంగిలించి తెచ్చిందేమో' అని.


'ఓహ్ !' ఆ ఆలోచన రాగానే వాళ్ళకు తల గిర్రున తిరిగిపోతున్నాది.

తల్లి ! కన్నతల్లి ! పూజించాల్సిన వ్యక్తి ! ప్రపంచంలోకెల్లా ప్రథమ గౌరవాన్ని అందివ్వాల్సిన వ్యక్తి !

ప్రేమకు మారురూపు ! త్యాగానికి మరో పేరు అనబడే స్త్రీమూర్తి – చేయాల్సిన పనేనా ఇది !

'ఎంత నీచానికి దిగజారిపోయావమ్మా ! నీకేం





తక్కువయిపోయిందని ఈ నికృష్టపు పనికి తలపడ్డావు!'

వాళ్ళ ఇంటికి వెళ్ళవద్దని మందలిద్దామని వచ్చినవాళ్ళు అసలా పనే మర్చిపోయారు!

విషయం విన్న తార సిగ్గుతో చచ్చిపోయింది. ఎంతో బాధపడింది!

"చంద్రం! మీ బావగారు నెలకు రెండు వందలు పంపిస్తున్నారు. అందులో వంద రూపాయలు అమ్మకిస్తున్నాను. ఇంటి అద్దె వస్తుంది. పాలన్నీ అమ్మేస్తుంది! మరి ఈ డబ్బంతా ఏం చేస్తుందో, ఏమిటో — ఎవరికీ అర్థం కాదు."

"అవునా! ప్రొద్దున నువ్వు ప్రక్కింట్లో పాలు తీసుకుంటున్నావేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు రామ్మోహన్.

"అదా — అదీ" నసిగింది తార.

"ఫర్వాలేదు చెప్పక్కా."

"ఏమీలేదు లేరా! ఇల్లు అన్నాక ఏవో చిన్న చిన్న గొడవలు లేకుండా ఎట్లా ఉంటాయి!"

"కాదు! నువ్వేదో దాస్తున్నావు!" తీక్షణంగా అన్నాడు చంద్రం.

"మా దగ్గర దాచటమెందుకక్కా?" ఆవేదనగా అన్నాడు రామ్మోహన్.

తార

పాల సంగతి అంతా చెప్పలేక చెప్పింది. ఆ విషయాలన్నీ చెబుతోంటే తారకే చాలా అసహ్యమనిపించింది. చిల్లరవాళ్ళూ, వెనుకబడిన జాతుల వారూ అలా చేస్తారు అంటే 'ఏదో తెలియక' అనుకోవచ్చు! మనలాటి ఇళ్ళల్లో కూడా అలాటివి జరుగుతున్నాయంటే నిజంగా సిగ్గుపడాల్సిన విషయం!

"ఈ డబ్బంతా ఏం చేస్తుంది?" ఆశ్చర్యం అన్పించింది.

"అదేరా, మరి! ఏం చేస్తుందో, ఏమిటో! అన్నింటికంటే ముందు ఈ దొంగతనమేమిట్రా! ఎంత అసహ్యం! ఈ విషయం ఎవరికైనా తెలిస్తే ఎంత అప్రదిష్ట! ఛీ! ఛీ! మన ఇంటా ఒంటా లేవు ఇటువంటి దగుల్బాజీ పనులు! ఈమెకీ బుద్ధి ఎందుకొచ్చిందో తెలియటంలేదు! అసలు నాకెంతో సిగ్గుగా ఉందిరా! ఇంట్లో నేనొక్కదాన్నేకదరా ఇవుడుంటా! ఇవన్నీ పాట్లాలు కడుతూంటే పిన్ని చూడకుండానే ఉంటుందా! అడగలేకపోయిందో, ఏమోగానీ — చూసే ఉంటుంది! 'తార ఉంది కదా! కష్టంగా ఉంటున్నాది కాబోలు! అందుకే తీసుకెళ్తున్నాదేమోలే' అని అనుకోదూ! పైగా ఆమె చూపిందని మనం అనుకుంటూన్నట్లే మనకూ తెలిసే ఉంటుందని ఆవిడ అనుకోదూ! మనకు తెలిసి ఈ పని చేయిస్తున్నాము అని ఆవిడ అనుకుంటే ఎంత సిగ్గుచేటురా! ఛీ! ఛీ! ఎంత పనికిమాలిన పనిచేసి మన తలలు తీసేస్తున్నాదిరా! తను తెలుసుకోదు! మనం చెబితే వినదు!" ఆవేదనతో విలవిలలాడింది తార.

చంద్రానికి ఆవేశం అవధులు దాటుతూంది. "ఇలా ఊరుకుంటే లాభం లేదక్కా! తప్పు చేసినప్పుడు పిల్లలను మందలించినట్లే పెద్దవాళ్ళనూ అదుపులో పెట్టాలి!"

* * *

రామ్మోహన్, చంద్రం గుడివాడ నుండి రాగానే కబుర్లు అడిగింది జయమ్మ.

రాఘవయ్యగారి ఆరోగ్య వివరాలు తెలుసుకుని చాలా బాధపడ్డారు ప్రసాదు, జయమ్మాను. అంతకంటె విచారకరమయిన వార్త ఏమిటంటే – రాఘవయ్యగారి విషయాన్నీ వ్రాస్తూ 'వీలయితే ఒకసారి వచ్చి చూసి వెళ్ళు' అని రామారావుకు ఉత్తరం వ్రాసింది తార.

రామారావు రాలేదు!

"సెలవలు ఇచ్చాక వీలు చూసుకుని వస్తాను. నువ్వు ఎలాగూ ఉన్నావు కనుక నాన్నను జాగ్రత్తగా చూసుకో." అంటూ జవాబు వ్రాసి పడేసాడు.

తార చూపిన ఆ ఉత్తరాన్ని చదివి "పోన్లే! ఇది వ్రాయటానికయినా ఆ మహానుభావుడికి తీరిక చిక్కింది." అని కోపంగా ఆ ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చింపేసాడు.


ఆ విషయాలు చెబుతూంటే "నేను వెళ్ళి ఆ రాస్కెల్‌ని వాయిగుత్తిని లాక్కొస్తాను," అన్నాడు ప్రసాదు.


జయమ్మ వారించింది.


"బాధ్యతలు అనేవి ఎవరికి వాళ్ళు తెలుసుకుని తీసుకోవాలిగానీ, మరొకళ్ళు నెత్తిన పెడితే అవి బరువుగానే ఉంటాయి!" అంది.

"ఏదో ఒకనాటికి అతనే మారతాడు. అవాడు అతనే తెలుసుకుంటాడు! అయినా, మీరు ముగ్గురుండి ఏంచేయగలుగుతున్నారు! ఇహ అతనొచ్చి ఏం చేస్తాడు" అని కూడా అన్నది.

అది వింటూనే ఫ్యూరుమన్నాడు చంద్రం.








యూనికూల్ - మీ డైనింగ్ రూమ్‌కి
హాయి కొల్పే అనుభూతి

జంటగా అయినా—లేక పెద్ద సమావేశాలకైనా—మీ డైనింగ్‌రూము యూనికూల్‌తో అహ్లాదకరమైన అనుభూతినిస్తుంది.

యూనికూల్—మిగతా ఏయిర్ కూలర్లవంటిది కాదు. ఇది ఉత్తమమైనది. దృఢమైనది. చూడ ముచ్చటైనది. ఆకర్షణీయమైన రంగులలో లభిస్తుంది. లీకవదు. తుప్పు పట్టదు. అందుచేత తుప్పు పట్టకుండా మీరు మరే ఏర్పాటు చేయనవసరం లేదు. భారతదేశంలో ఫైబర్ గ్లాస్‌తో తయారు చేసే ఏకైక ఎయిర్ కూలర్ కాబట్టే యిది ఎంతమాత్రం షాక్ యివ్వదు.

అంతే కాదు గది ఉష్ణోగ్రతను 10 డిగ్రీల సెంటిగ్రేడుకు అవలీలగా తగ్గిస్తుంది. ఎందుచేతంటే, వెంట్‌వాన్స్‌లో శాస్త్రీయంగా రూపొందించిన గ్రిల్స్ ఏర్పాటు వల్లనే. ఎయిర్ కండిషనింగ్‌కు యిది ఉత్తమమైన ప్రత్యామ్నాయం. ఖర్చులో అధికం ఏమీ లేదు. ధూళి లేకుండా గాలి వచ్చేందుకు దీనిలో స్పాంజి ఫిల్టర్ అమరిక వుంది. చక్కగా పనిచేసే ఎ. యు. ఇ. మోటారు. ఒక మామూలు ఫాన్ మాదిరిగా వాడుకోవచ్చును. ప్రత్యేక నిర్వహణ చాతుర్యం అవసరం లేదు.

మీరు సమీపంలోగల డీలరును కలుసుకొనండి. ఎయిర్ కూలర్స్‌లో యూనికూల్ ఎటువంటి ప్రమాణాలను, సామర్ధ్యాన్ని సాధించిందో మీకే తెలుస్తుంది. విశ్వాసంతో మీరు కోరుకొనేది వుత్తమమైనదేకదా!



లీక్ కానిది - తుప్పు పట్టనిది

యూని-కూల్

ఎయిర్ కండిషనింగ్
ప్రత్యామ్నాయంగా నిలిచేది.
సర్వీసులో తిరుగులేనిది.

associated/UA/24

''బాగానే ఉంది, నీవాదం !'' అంటూ జయ మాటల్ని తీసి పారేసాడు.

జయమ్మ ఊరుకోలేదు.

''ఏదీ ! ఇన్ని కబుర్లు చెబుతున్నావు ! నువ్వే మాత్రం ఆయన్ని ఆదుకుంటావో నేను చూడక పోతానా,' అని నవ్వుతూనే అతన్ని రెచ్చగొట్టింది.

అది మొదలు చంద్రానికి తలలో ఒక మూల పురుగు చేరినట్లుగా ఆ విషయమే గింగిర్లు తిరుగు తున్నాది.

'ఎంత చదువుకున్నా ఏదో ఒక ఉద్యోగం చేయాల్సిందే ! అది ఇపుడే ఎందుకు చేయకూడదు !' ఆలోచించి ఆలోచించి ఒక ఆదివారంనాటి మధ్యాహ్నం ప్రసాద్‌తో అనేసాడు.

''మామయ్యా ! నాకు చదువుకోవాలనిలేదు ! ఏదైనా ఉద్యోగం చూడు !''

జయమ్మ నవ్వింది.

''ఏ పంతం పడితే ఇహ అదేనా లోకం ! ఈ సంవత్సరం పూర్తి చేసెయ్యి, తర్వాత చూసు కోవచ్చు.''

''నీకేం తెలియదుగానీ, నువ్వు కామ్‌గా 'ఉండు.'' అన్నాడు.

చంద్రానికి జయమ్మ దగ్గిర బాగా చనువు. చంద్రం చూపించేంత చనువు రామ్మోహన్ తీసుకోడు. జయమ్మ వంట చేస్తుంటే చంద్రం కూరలు కోసి ఇస్తాడు. టిఫిన్ తయారు చేస్తే ప్లేట్లలోనికి సర్దుతాడు ! భోజనాలు పెట్టేటపుడు కూడా సహాయం చేస్తాడు ! అంతేకాకుండా ఇద్దరూ బాగా వాదించుకుంటారు.

వాళ్ళు అలా వాదించుతూంటే రామ్మోహన్ నవ్వుతూ వింటాడే తప్ప అతనెప్పుడూ జోక్యం చేసు కోడు. కుటుంబ విషయాలనే కాకుండా అసలు ఏద యినా అవసరమయినపుడు కూడా ముక్తసరిగా ఏదో ఒకటీ అరా మాట్లాడటమే తప్ప అతను అంత చనువుగా ఉండడు !

''మామయ్యా ! నువ్వు జయక్క మాటలు వినబోకు. నాకేదయినా ఉద్యోగం తప్పకుండాకావాలి!''

పట్టుదలగా అంటూన్న చంద్రాన్ని చూసి పెద వులు బిగపట్టి నవ్వింది. అతన్ని ఉడికించుతూ అన్నది- ''బాగుంది ! ఉద్యోగాలన్నీ మీ మామయ్య జేబులోనే ఉన్నట్లున్నాయి ! ఏది కావాలో నువ్వే ఏరి తీసుకో ! మళ్ళీ మీ మామయ్య విమ్మంటే మంచిది ఇస్తారో, ఇవ్వరో !''

అందరూ నవ్వుతూంటే జయమ్మ వంక గుర్రుగా చూస్తూన్న చంద్రం కూడా నవ్వేసాడు.

కానీ, ఆ రాత్రి ప్రసాదు 'వాకింగు' చేస్తుండగా చంద్రం అతని ప్రక్కన చేరి మరోమారు అదే విష యాన్ని గుర్తుచేసాడు.

''మామయ్యా ! నువ్వుకూడా ఆలోచించు ! ఒక్కసారి ఆ పాతరోజులు గుర్తుతెచ్చుకో ! మన యిల్లూ, నాన్నగారి పలుకుబడీ, ఆయన ఔన్నత్యమూ, తారక్క మంచితనమూ– ఆరోజుల్లో ఎంతమందికో ఉపయోగపడేవి ! నాకు బాగా గుర్తు ! వర్షాలువచ్చి, ఇళ్ళు తడిసిపోయి, పొయ్యిలు మండటంలేదని వచ్చే మన జీతగాళ్ళకు స్వయంగా వండివడ్డించేది తారక్క !

సంక్రాంతినాడు మన జీతగాళ్ళందరకూ క్రొత్తబట్టలిచ్చి, నాన్న దగ్గరుండి మరీ భోజనాలు పెట్టించేవారు !

అలాటి నాన్న ఇవ్వాళ ఎంతో అసహాయతతో మంచంమీద ఉన్నారు ! ఆ తారక్క దిక్కులేనిదానిలా పుట్టింట్లో... ! ఛా ! ఛా ! అమ్మ పనికిమాలిన తనానికీ, నోటిదురుసుకూ తారక్క మనసు ఎంతగా చితికిపోతున్నాదో తెలుసా ! దానికి కారణం – కేవలం సంపాదన లేకపోవటమే మామయ్యా, అమ్మను ఏమన్నానరే 'నాలుగు రాళ్ళు సంపాదించి అమ్మకూ అయ్యకూ పెట్టటం చేతకాదు కానీ – బోడి కబుర్లు చెప్పటానికి వచ్చాడు ! పోరా ! పోయి నీ పని చూసుకో !'' అంటూ తీసిపారేసింది ! నీకు తెలియదు మామయ్యా ! తనుకాబట్టి అక్కను ఇంట్లో ఉంచుకున్నట్లూ, నాన్నను చూస్తున్నట్లూ మాట్లాడుతుంది.''

''అన్నీ నిజమేరా ! నాకూ ఎంతో బాధగానే ఉంది ! కానీ – ఉన్నట్లుండి ఏం చేయగలం చెప్పు ! అయినా, ఉద్యోగం కావాలనగానే దొరకాలిగా ! తప్పకుండా చూద్దాం ! కొంచెం ఓపికపట్టు ! అన్నీ అవే సర్దుకుంటాయి ! రోజులన్నీ ఒకేలా ఉండవురా ! అనవసరంగా ఆవేశపడబోకు ! నువ్వు చదువుని అశ్రద్ధ చేయబోకు !''

''అలాగే మామయ్యా.''

*   *   *

తారతో ఇపుడు నాగరత్నమ్మ సరిగ్గా మాట్లా డటం లేదు. డబ్బు అంతా ఇవ్వటంలేదని కోపం !


ఆ కోపాన్ని లెక్కచేయలేదు తార. దానివల్ల తండ్రికిగానీ, పిల్లలకుగానీ ఎలాంటి ఇబ్బందీ లేదు. ఎటొచ్చీ ఆ కోపం మరీ ఎక్కువయిననాడు తారకు అన్నం మిగిల్చేదికాదు. దానివల్ల తారకు పెద్ద బాధగా ఏం ఉండేదికాదు ! రెండు రోజులు అన్నం తినకపోయినంత మాత్రాన తన ప్రాణం పోదు ! కాని, ఒక్క పూట పాలు లేక రేణు ఏడిస్తే తన మనస్సు ఊరుకోకల్గుతుందా ! అందుకే – ఆవిడ కోపానికి తార చలించలేదు.


ఆనాటికి వెంకటరత్నం దగ్గరనుండి పిల్లలను తీసుకుని గుడివాడకు వచ్చి నాలుగు నెలలయింది. చేతినిండా పని ఉన్నంతసేపూ ఏ ఆలోచనా రాదు ! పని అయిపోయాక పడుకుంటే కళ్ళమీదికి నిద్ర రాదు. 'వెంకట్ ఎలా ఉన్నారో, అసలెక్కడ ఉన్నారో, ఏం చేస్తున్నారో—' అంటూ అతని ఆలోచనలే వస్తాయి.


డబ్బు పంపేటపుడు ఉత్తరం కూడా వ్రాస్తాడు వెంకట్. ఆ ఉత్తరం నిండా పిల్లల గూర్చి అనేక ప్రశ్నలు వేస్తాడు ! పేరు పేరునా ఇంటిల్లిపాదీ యోగక్షేమాలను అడుగుతాడు ! తారకు ధైర్యం చెబుతాడు ! మామగారికి కృతజ్ఞతలు తెలుపుతుం టాడు ! అంతేగానీ, తనెక్కడున్నదీ మాత్రం వ్రాయడు. ఎన్ని విధాలుగా అడిగినా 'కొరియర్' కూడా చెప్పడు. ఇహ ఇపుడు అసలు అడగటం మానేసింది. అడగటం మానినంత మాత్రాన ఆలోచనలు రాకపోవు కదా !

ఆ రోజుకూడా అతన్ని గురించే ఆలోచిస్తూ చెంపకు చేయి ఆనించి, దిగులుగా కూర్చుంది తార !

ఈ సంవత్సరం మానవ స్వభావం మాదిరిగా ప్రకృతిలోనూ, ఋతుక్రమంలోనూ కూడా మార్పు వస్తున్నాదో. ఏమో - మార్చి నెల మొదలవటం తోటే ఎండలు కూడా మొదలయ్యాయి !







తా ర

కొబ్బరిచెట్ల క్రింద చల్లగా ఉంటుందని బయట మంచాలు వేసి పిల్లలను పడుకోబెట్టింది. తండ్రి మంచం కూడా వరండాలోకి మార్పించి, ఒట్టివేళ్ళ తడికెలు వ్రేలాడదీయించింది. వాటిమీద మూడు పూటలా నీళ్ళు చల్లుతూంటే చల్లగా ఉంటుంది! మంచి వాసన కూడా వస్తుంది! ఏడు గంటలయ్యాక ఇంక దానిని పైకెత్తి కట్టేసేది! మంచంలో పడుకున్నాకూడా కాస్త బయటకు చూస్తుంటే ఆయనకు మార్పుగానూ, కొంచెం ఊరటగానూ ఉంటుందని అలా చేసింది!

నాగరత్నమ్మ కూడా నిద్రపోయింది. తార తండ్రి మంచం ప్రక్కగా క్రింద గచ్చుమీద వరండా స్తంభానికి ఆనుకుని కూర్చుంది. రాఘవయ్యగారు ఏవో కబుర్లు చెబుతూంటే వింటూన్నాది. చెబుతూ చెబుతూనే ఆయన నిద్రలోకి జారిపోయారు. తార అక్కడే అలాగే కూర్చుండి పోయింది.

ఆ సమయంలో 'కొరియర్' వచ్చాడు. అతన్ని చూసి ఖంగారు పడింది తార! నాలుగు రోజుల క్రితమే వచ్చి డబ్బిచ్చి వెళ్ళాడు. "ఈసారి కొంచెం పెద్ద ఉత్తరం వ్రాయి తారా! నీ ఉత్తరం చదువుతూంటే నీవు నా ఒళ్ళో కూర్చుని కబుర్లు చెబుతూన్నట్లే ఉంటుంది! ఆ అనుభవాన్ని మరీమూడు ముక్కల్లోనే చంపేస్తావు!" అంటూ అతడు వ్రాసిన దానికి నవ్వుకుని చాలా పెద్ద ఉత్తరం కూడా వ్రాసి ఇచ్చింది. అలాంటిది మళ్ళీ ఇపుడొచ్చే సరికి– 'ఎందుకు వచ్చాడో' అని భయపడింది తార.

కాని, అతడు నవ్వుతూ 'వెంకటరత్నం తాను తీసుకు రమ్మన్నాడని' చెప్పాడు.

"ఎక్కడికి ?" ఆశ్చర్యంగా అడిగింది.

అతను కాస్త తికమక అయినట్లూ, ఎలా చెప్పాలో తెలియనట్లూ తలగోక్కున్నాడు.

"బాబుగారు ఉన్నచోటుకమ్మా."అన్నాడు.

"ఇంత రాత్రిపూటా ?"

"ఆఁ – అవునమ్మా."

నిద్రలోనే ఎవరో మాట్లాడినట్లుగా అనిపించటంతో రాఘవయ్యగారికి మెలకువ వచ్చింది. ఎపుడూ మంచంలోనే ఉండటం మూలంగా ఆయనకు మంచి నిద్రపట్టనే పట్టదు. శీతాకాలపు వర్షంలాగా ఎపుడో కాస్త కళ్ళు మూతలు పడేవి మళ్ళీ అంతలోనే మెలకువ వచ్చేసేది!

"తారా! ఎవరమ్మా ? ఏమిటి ? ఏమయింది ?" అంతటి రాఘవయ్యగారు కూడా ఆ సమయంలో మనిషి వచ్చాడంటే ఖంగారు పడిపోయారు.

విషయం విన్నాక ఆయన అనమ్మతిగా తలను అటూ ఇటూ ఆడించారు.

"వద్దు తల్లీ ! ఇంత రాత్రి పూట అతనితో వెళ్ళటం అంత మంచిదికాదు."

తారకు మనసంతా మొద్దుబారిపోయినట్లుగా ఉన్నది. దానికసలు ఆలోచించమంటే ఏమిటో కూడ తెలియదన్నట్టుగా ఉన్నది! ఏం చేయాలో తోచటం లేదు! ఏమని జవాబు చెప్పాలో అంతకన్నా అర్థం కావటం లేదు!


సందిగ్ధంగా నిలబడిన కుమార్తెను చూసి "అమ్మా, తారా! వెంకట్‌కు ఒక ఉత్తరం వ్రాసి పంపించు తల్లీ." అన్నారు.


"అవును! నిజమే!" అనుకుంటూ గబగబా తాళం తీసి లోపలకు వెళ్ళింది. లైటు వెలిగించుకుని కాగితం మీద నాలుగు ముక్కలు వ్రాసి అతనికిచ్చింది. అతను వెళ్ళిపోయాక తారకు మనసంతా దిగులుగా అనిపించింది. ఎందుకో తెలియకుండా కళ్ళ వెంబడి బొటబొటా నీటి బొట్లు జారిపడ్డాయి! పైన ఏదో పెద్ద బండరాయి పెట్టినట్లుగా గుండె బరువుగా అయిపోయింది.

ఇన్నాళ్ళూ అతని పిలుపుకోసం చకోరపక్షిలా ఎదురుచూస్తూ కాలం గడిపింది! ఎపుడెపుడు అతని దగ్గరకు వెళ్ళిపోదామా, అతని గుండెలపై తల ఆనించి పడిన ఆవేదన అంతా మరచిపోదామా అని ఎంతో తపనగా ఎదురుచూస్తున్న అవకాశం ఎదురుగా వచ్చి కూర్చుంటే 'ఇపుడు కాదు' అని తిరస్కరించింది!

"వెంకట్! మీరు రమ్మని పిలుస్తున్నా, మిమ్మల్ని చేరుకోలేని అశక్తురాలిగా మిగిలిపోయాను మళ్ళీ ఇలాటి అవకాశం ఇంకెప్పుడు వస్తుందో! ఏనాడు మిమ్మల్ని చూడగలనో!' అని ఆక్రోశించింది ఆమె హృదయం!


(ఇంకా వుంది)






OBM-7967 TL

చెమటతో వళ్ళు పేలినప్పుడు...



జాన్సన్స్ ప్రిక్లీ హీట్ పౌడర్ మీకు ఎండనుంచి తక్షణమే ఉపశమనాన్ని యిస్తుంది, ఎందుకంటే దానిలో 3 రకాలుగా ప్రభావితంగా పనిచేసే, ఋజువైన ఔషధీయుక్తమైన ఫార్ములా ఉంది.

- అది క్రిముల పెరుగుదలను నిరోధిస్తుంది.
- చెదుటను పీల్చుకుంటుంది.
- దురదనుంచీ, మంటనుంచీ ఉపశమనం యిస్తుంది—తక్షణమే.



జాన్సన్స్*
ప్రిక్లీ హీట్ పౌడర్‌తో
ఉపశమనాన్ని పొందండి.

చందనపు సువాసనలో గూడా దొరుకుతుంది.

ఎండలో తక్షణమే ఉపశమనం!

Johnson & Johnson*

(గత సంచిక తరువాయి)




[ఇంకా ఉంది]

ఎట్టకేలకు, ఎన్నో ఏళ్లకు నాకు ప్రమోషనొచ్చింది

రిజిష్టర్డ్ పోస్ట్

ఆర్.కె. వటారి



'జన్మకో శివరాత్రి' అనే లోకోక్తి మా డిపార్ట్‌మెంట్‌కి బాగా వర్తిస్తుంది. మాకు 'సర్వీసుకో ప్రమోషన్' మాత్రమే.

నా సన్నిహిత మిత్రులు శ్రీధర్, ఆంజనేయులు, సుబ్బయ్య పార్టీ కావాలని పట్టుబట్టారు. పోనీలే, సర్వీసులో మరో ప్రమోషన్ వచ్చేనో-చచ్చేనో అని ఒప్పుకున్నాను.

పార్టీ అంటే – తారతమ్యం లేకుండా ప్రస్తుతం చెలామణిలో వున్న గౌరవాల ఫ్యాషన్ ప్రకారం – మందు కొట్టించమని మిత్రులెంత గింజుకున్నా, ఆ వాసనే నాకు గిట్టదు గనుక మా యింట్లోనే చక్కటి విందు ఏర్పాటు చేశాను.

మిత్రులు తృప్తిగా భోంచేశారు.

వెన్నెలరాత్రి, ఆహ్లాదకరంగా వుంది. కొంతసేపు ఆ చల్లదనాన్ని అనుభవిద్దామని ఇంటి ముందు ఖాళీస్థలంలో కుర్చీలు వేసుక్కూర్చొని కబుర్లలో పడ్డాం.

శాఖా చంక్రమణం చేసి చర్చ 'మానవాతీత శక్తి' మీదకి మళ్లింది.

ఆస్తికుడైన ఆంజనేయులు స్వానుభవం లోంచి ఏదో ఉదంతాన్ని ఉటంకిస్తూ, మన జీవిత గమనాలలో మన ప్రమేయం ఏమీలేదని, ఏదో మానవాతీత శక్తి ప్రభావం వల్లనే ఎప్పుడేం జరగాలో అలా జరుగుతుందని, ఆ శక్తి చేతిలో మనం తోలుబొమ్మలమని తన అభిప్రాయం చెప్పాడు.

నాస్తికుడైన శ్రీధర్ అతనితో ఏకీభవించలేదు. అలా అనుకోటం మూర్ఖత్వమని, మన శక్తి సామర్థ్యాలే మన జీవితాల్ని తీర్చి దిద్దుతాయని వాదించాడు.

సుబ్బయ్య, నేను వాళ్లిద్దరిలో ఏ కోవకీ చెందం. మేము జిజ్ఞాసువులం. వాళ్లిద్దరివలె యీ సరికే నిశ్చితాభిప్రాయాలు ఏర్పరుచుకొని జీవితాంతం ఆ నమ్మకాల ప్రవాహంలో కొట్టుకుపోటం మా కిష్టంలేదు. ఎందుచేతనంటే యీ జీవిత గ్రంథంలో అనుభవ పాఠాలు ఎన్నెన్నో! వాటిని చదివి అర్థం చేసుకోటానికి యీ జీవితమే చాలకపోవచ్చు! సత్యావిష్కరణ అంత సులభం కాదు! అనాది నుంచీ ఎందరో మహానుభావులకే సాధ్యం కాని విషయమిది! మా బోంట్లకు సాధ్యమయ్యేనా!

నాస్తికత్వానికి పునాది హేతువాదం. హేతువాద దృష్టి లేకపోతే జీవితంలో పురోగతి వుండదు. మూఢనమ్మకాలకు ఆలవాలమై పోతుంది జీవితం. కాని ప్రపంచంలో ఎందరో మహా మేధావులు, తాత్వికులు దైవచింతన కలిగినవారే! మరి యీ హేతువాద దృష్టి వారికి లేదా? ఉంటే దైవాన్ని ఎలా విశ్వసించారు? ఏది సత్యం—ఏదసత్యం?

"ఆంజనేయులు చెప్పింది కొంతవరకు నిజమేనేమో! మతపరమైన విశ్వాసాలకి సాక్ష్యాలు చూపించటం కష్టం కావచ్చుగాని శాస్త్రాన్ని కాదనలేము గదా! ఖగోళశాస్త్రం ప్రకారం యీ భూమండలం లోని సమస్త ప్రాణికోటిపైన చంద్రుని ప్రభావం వుటుందట! అలాగే సూర్యగోళంలో ప్రతి పదకొండు సంవత్సరాల కొకసారి ఏర్పడే మచ్చలకి, ప్రపంచ రాజకీయ పరిస్థితులకీ అవినాభావ సంబంధ మున్నదంటారు. రెండు ప్రపంచ యుద్ధాలు జరిగిందీ సూర్యుడిలో యీ మచ్చలు గరిష్ఠ స్థాయిలో వున్నపుడేనట! ... రాజకీయ పరిస్థితులలో మార్పులు గాని యుద్ధాలు జరిగేది కాని దేశాధినేతలు తీసుకొనే 'నిర్ణయాల' వల్లనే! మరటువంటప్పుడు ఆ నిర్ణయాలు వాళ్ల ప్రమేయం లేకుండా జరిగినట్టే గదా?"

సుబ్బయ్య సైన్సు స్టూడెంటు. తన శాస్త్రీయ దృక్పథంలో తార్కికంగా సమర్థించాడు.

శ్రీధర్ ఆ తర్కాన్ని ఖండించాడు.

"మూఢనమ్మకాలకి, ప్రకృతి సిద్ధమైన మార్పులకి ముడి పెడితే లాభంలేదు. ఈ మహావిశ్వంలో పరస్పర గురుత్వాకర్షణ శక్తి వల్లనే గ్రహాలు తిరుగుతున్నయ్-కాబట్టి ఒక గ్రహంలో చెలరేగే మార్పుల ప్రభావం మరో గ్రహంపై వుండవచ్చు. అయితే అది భౌతికంగానే! మానవ జీవితాలపై, వారి

రిజిష్టర్డ్ పోస్టు

మనసులపై ఆ ప్రభావం వుంటుందనటం కేవలం అవకాశ వాదం!''

''ఏది మతిలేని వాదం! కాకపోతే సైన్స్ అవకాశవాదమెలా అవుతుంది? సైన్సునే ఒప్పుకోని వాడివి నువ్వేం నాస్తికుడివి?''

''స్టాప్-స్టాప్ స్టాప్!'' చర్చ వేడెక్కుతుందని బిగ్గరగా అన్నాను.

''అబ్బాయిలూ, ఆగండి! మీ ఖగోళ చర్చతో ప్రశాంతంగా వున్న మా బుర్రలెందుకు పాడుచేస్తారు గాని, అంజనేయులు అభిప్రాయాల్ని బలపరిచే సంఘటనలు కొన్ని నా జీవితంలోనూ జరిగాయి. వాటిని చెప్తాను వినండి తర్వాత శ్రీధర్ ఏం చెప్పగలడో చూద్దాం!''

ముగ్గురూ నా కథనం వినడానికి సంసిద్ధులయ్యారు.

*　　　*　　　*

''నేను ఉద్యోగంలో చేరిన రోజుల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు ప్రతిఏడూ జరుగుతుండేవి. నాకు ఇంటర్మీడియట్‌లో పార్టు పోయింది ఆపార్టు పూర్తిచేసుకుంటూ ఎవరి సలహా మీదనో ప. స. క. పరీక్షలకి కూడ కూర్చున్నాను...''

''అవేం పరీక్షలోయ్? నేనెక్కడా వినేదే!'' సుబ్బయ్య అడుపడ్డాడు సిగరెట్ అందుకుంటూ

''ఒరే మందమతీ, ఇప్పుడేగదరా చెప్పాను పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలని! అంత శ్రద్ధగా వింటున్నావన్నమాట?''

''శ్రద్ధగానే వింటున్నాన్లే కానియ్'' సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు.

''తర్వాత నేను పార్టులో పాసయ్యాను! మా కాలేజి స్థాపించి అప్పటికి రెండేళ్ళు అయింది. డిగ్రీ తరగతులు యింకా ప్రవేశ పెట్టలేదు. కావలి కాలేజి 'జవహర్ భారతి'లో చేరటానికి సన్నద్ధమవుతున్నాను. మా నాన్న అందుకు కావలసిన డబ్బు సేకరణలో తంటాలు పడుతున్నాడు.

అప్పుడే వచ్చింది సర్వీస్ కమిషన్ వాళ్ళ సెలెక్షన్ ఆర్డరు! అందులో మరోపది రోజుల్లో 'ఫిజికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్' పంపకపోతే సెలెక్షన్ రద్దవుతుందని వుంది!

అప్పుడు నేను పడ్డ ఆవేదన మీకు మాటల్లో చెప్పలేనిది. ఉరకలు వేస్తూ నా గమ్యహర్మ్యం మెట్లెక్కుతుంటే ఎవరో వెనక నుంచి నా మీదికి ఉచ్చు విసిరి బలవంతంగా కిందికి లాగుతున్నట్లు వ్యధ!

ఈ ఆర్డరు యిప్పుడే రావాలా! ఏదో సరదాకి కూర్చున్నానేగాని ఈ పరీక్షలు ఇలా నా భవిష్యత్తుకే పరీక్ష పెడతాయనుకోలేదు. కాలేజిలో చేరిన తర్వాత వస్తే ఖాతరు చేసి వుండేవాణ్ణి కాదు కాని యిప్పుడు పెద్దం పత్తి ఎక్కువైంది.

'మహా అయితే బి. ఏ. చదువుతావు. బి. ఏ. చదివినా గుమాస్తా ఉద్యోగమేగా వచ్చేది! నువ్వు ఎంతో అదృష్టవంతుడివి కాబట్టి యింత చిన్న వయసులోనే గవర్నమెంటు ఉద్యోగం వచ్చింది. ఎంతో పైకి పోవచ్చు. కడుపులో చల్ల కదలకుండా బతగొచ్చు. కాళ్ళదగ్గర కొచ్చిన అదృష్టాన్ని కాలదన్నుకుంటారా ఎవరైనా!' అంటూ హితబోధ చేశారు.

'కూపస్థమండూకం' ఆలోచనలని కసిగా తిట్టుకున్నాను. నా బంగారు భవిష్యత్తు మట్టిపాలైందని, ఎవరో నా కన్యాయం చేస్తున్నారని, ఎవరికీ చెప్పుకోలేక, ఏమీ చెయ్యలేక, దుఃఖాన్ని ఆపుకోలేక, ఆ రాత్రి మా వీధి అరుగుమీద చీకట్లో ఒక్కణ్ణే కూర్చొని, మోకాళ మధ్య తల పెట్టుకొని మౌనంగా రోదిస్తున్నాను.

కాస్సేపటికి నా తలని ఎవరిదో హస్తం ప్రేమతో నిమిరింది. స్పర్శలోనే అంత ప్రేమని తెలిపేది యింకెవరిదై వుంటుంది— మా నాన్నదే!

'బాబూ!' అన్నాడు ఆర్ద్రంగా.

కళ్ళు తుడుచుకుంటూ తల పైకెత్తాను.

'చూడయ్యా! నీ బాధ నాకు తెలియదా? ఇంత చిన్నవయసులోనే నీ రెక్కల కష్టాని కాశపడతానా? కాని ... ఇల్లు గడవటమే ఎంతో కష్టంగా వున్న యీ పరిస్థితుల్లో నిన్ను నేను చదివించ గలనా? ఉద్యోగం రాకపోతే ఆ దారి వేరు. కష్టమో నిష్ఠూరమో శక్తి వున్నంతవరకు చదువుకోక చేసేదేంలేదు. కాని, నీకెందుకా బుద్ధి పుట్టిందో ఆ పరీక్షలకి కూర్చున్నావు, కూర్చున్న వాళ్ళందరికీ ఉద్యోగాలొస్తున్నాయా! ఇది మన మంచికే వచ్చిందని ఎందు కనుకోగూడదు? కాలేజిలో చదవకపోతే మాత్రమేం! ఇంకా నీది చిన్న వయసే. నీకంత మనసుంటే ప్రైవేటుగా చదువుకోవచ్చు ఇది చేస్తూనే యింకేదైనా

మంచి ఉద్యోగానికి ప్రయత్నం చేసుకోవచ్చు. మన కుటుంబం యిక ముందు బతికి బట్ట కట్టటానికి యీ ఉద్యోగం దేవుడిచ్చిన వరం బాబూ!'

అంతే! నేను ఉద్యోగంలో చేరిపోయాను.

ఓ సంవత్సరం గడిచిపోయింది. నేను ప్రైవేటుగా స్టడీస్ కొనసాగించే ప్రయత్నమైతే చెయ్యలేదుగాని, రైల్వే సర్వీస్ కమిషన్ వాళ్ళు ప్రకటనపడితే దానికి అప్లై చేశాను. రిటెన్ టెస్ట్‌కి సికింద్రాబాద్ వెళ్ళొచ్చాను.

మా కజిన్ బదరు అప్పటికే సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫీసులో క్లర్కుగా పనిచేస్తున్నాడు. వాళ్ళ ఆఫీసు చూసొచ్చాను. సెలెక్టు అయితే పోస్టింగ్ అక్కడే వస్తుందట. ఆ విషయం నాకెంతో సంతోషం కలిగించింది. అప్పుడు నేను చేరిన సింగిల్ క్లర్కుండే చోటా ఆఫీసులాకాక, అక్కడ వందలమంది స్టాఫు, మంచి సౌకర్యాలు, సిటీలైఫ్ నన్నెంతో ఆకర్షించాయి. అక్కడ ఉద్యోగం రావటం అదృష్టమే ననుకున్నాను.

కొద్ది కాలం గడిచింది.

ఒకరోజు పోస్ట్‌మన్ ఒక రిజిస్టర్డ్ కవరు పట్టుకొచ్చి 'యిదెవరిదో చూడండి' అన్నాడు.

కవరు బరువుగా వుంది. దానిమీద నా పేరే వుంది! సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫీసునుంచొచ్చింది.

ఎగిరి గంతేసినంత సంతోషంతో 'ఇది నాదే!' అన్నాను.

'మీది కాదు, ఇంటిపేరు చూడండి' అన్నాడు పోస్ట్‌మేన్.

అంతవరకు దృష్టంతా పేరుమీదేగాని, యింటిపేరు మీదికి పోలేదు. 'క' కారంలోనే చిన్న పొరపాటు జరిగి వేరే ఇంటిపేరు వచ్చింది.

'ఇంటిపేరు పొరపాటు పడినట్టుంది. ఇది నాదే! యివ్వు' అన్నాను.

ఇంటిపేరు మారింది కాబట్టి యివ్వటానికి వీల్లేదన్నాడు.

'ఈ పేటలో నేను తప్ప యింకెవ్వరూ రైల్వే సర్వీస్ కమిషన్ పరీక్షలకి పోలేదయ్యా బాబూ! ఇది తప్పకుండా నాదే! ఇచ్చెయ్యి' అని బ్రతిమాలాను.

అతను ససేమిరా వీలుకాదని కవరు తీసుకెళ్ళిపోయాడు.

'ఇప్పుడేం చేయాలి?' అని పెద్ద సందిగ్ధంలో పడిపోయాను.

మెరుపులా మా కజిన్ బ్రదర్ మనసులో మెదిలాడు. వెంటనే టెలిగ్రాం యిచ్చాను– 'నేను సెలెక్టు అయానా?' అని.

ఆ మర్నాడే 'స్టార్టు యిమ్మీడియట్లీ ఆన్ లీవ్' అని తిరుగు టెలిగ్రాం వచ్చింది. హడావుడిగా మూడు రోజులు క్యాజువల్ లీవు పెట్టి సికింద్రాబాద్ రైలెక్కాను.

కాని నా ఆశ నిరాశే అయింది.

నేను వెళ్ళేటప్పటికి డివిజన్ ఆఫీసులో ఖాళీలన్నీ భర్తీ చేశారు. ముందొచ్చిన వాళ్ళని అక్కడ వేశారట. లేటుగా వచ్చిన వాళ్ళని దూర ప్రాంతాలకి వేశారు.

నన్ను సికింద్రాబాద్–ద్రోణాచలంల మధ్య 'కౌకుంట్ల' అనే చిన్న స్టేషన్లో లోకో సి. ఎస్. సి. ఆఫీసులో క్లర్కుగా వేశారు. నా ఉత్సాహమంతా నీరుగారి పోయింది!

కాని చేసేదేముంది! స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగం కన్నా రైల్వే ఉద్యోగం మంచిది కదా! ఇటు రిజిగ్నేషన్ లెటరు పంపి అటు కౌకుంట్లకు ప్రయాణమయ్యాను.


తీరా అక్కడికి వెళ్ళాక, మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుగా, ఆ ఉద్యోగం ఎంత విసుగైనదో, నిరుత్సాహపూరితమైందో తెలిసింది!

కౌకుంట్ల వాటరింగ్ స్టేషను. సి. యస్. సి. అనబడే వ్యక్తి సీనియర్ క్లర్కట. అతని కెప్పుడూ డే డ్యూటీ– యస్. ఎమ్. లాగ. నా పోస్టు కెప్పుడూ నైట్ డ్యూటీనట– ఎ. యస్. యమ్ లాగ. నేను రిలీవ్ చేస్తున్న వ్యక్తి మూడేళ్ళ నుంచి అక్కడ నైట్ డ్యూటీ చేస్తున్నాట్ట! బాప్‌రే! అనిపించింది.

పోనీ ఆ నైట్‌డ్యూటీ అయినా ఏ స్టేషన్లోనో కాదు. ప్లాట్‌ఫాంకి చివర గోడలతో కట్టిన వాటర్ రిజర్వాయర్ కింద వుండే గదిలో! అదే సి యస్. సి. ఆఫీసు! రాత్రంతా ఆ గదిలో ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిందే!

స్టేషనుకీ, నేనుండే గదికీ పెద్దగా కేక వేస్తేగాని వినపడనంత దూరం. అక్కడ కరెంటు లేదు. రాత్రులు స్టేషనులో కనుపించే చమురు దీపాలు తప్ప చుట్టూ గాఢాంధకారం! నా ఆఫీసు గది వెనకాలే పెద్ద పంపుల బావి, చుట్టూ ముళ్ళతీగె కంచెతో చెట్లతో నిండిన దాని తాలూకు యార్డు. అక్కడి నుంచి వచ్చే కీచురాళ్ళ ధ్వని రాత్రులు ధైర్యనుడికి తప్ప సామాన్య మానవునికి గుండె పీచుపీచు మనే పరిసరాలు!

ఇక నా డ్యూటీ, డ్రైవర్లకి డ్యూటీలు వేయటం, డ్యూటీ దిగే డ్రైవరు నుంచి ఇంజన్ కండిషన్ గురించి రిపోర్టు తీసుకొని డ్యూటీకి ఎక్కే డ్రైవరుకి యివ్వటం, అక్కడ ఆగే ప్రతి ట్రెయిన్ ఇంజనులో



రిజిష్టర్డ్ పోస్ట్

బొగ్గు నిల్వ తనిఖీచేసి అవసరమైనంత బొగ్గులోడ్ చేయించటం మొదలైనవి.

వీటన్నిటికన్నా యిబ్బందికరమైనవిషయం - రైల్వేక్వార్టర్స్ తప్పించి ఆ స్టేషన్ దగ్గర ఊరేదీ లేకపోవటం! ఆ పేరు గల ఊరు అక్కడికి కొద్దికిలోమీటర్ల దూరంలో వుంది. అదో కుగ్రామం, పోస్ట్‌కార్డు కావాలన్నా పోలోమంటూ అంతదూరం పోయిరావాల్సిందే!

గుడ్సులో మెల్లగా ఆ స్టేషన్లో డ్రైవర్స్‌కి 'రన్నింగ్ రూం' వుంది నా భోజనం అక్కడే.

వెళ్ళినప్పటి నుంచి ఒకటే ఆలోచన, దిగులు.

'ఇదేం ఉద్యోగం! 'పక్షిరాజా' వారి ప్రభుత్వంలో లాగ పగలున్నిద, రాత్రిపని — అదీ సంవత్సరాల తరబడి!'

పోనీ పగలేనైనా కాలక్షేపం వుంటుందా అంటే అందుకు ఆస్కారమే లేదు.

ఆ ఉద్యోగంమీద విరక్తి భావం కలిగింది, జీతం తక్కువైనా పాత ఉద్యోగమే మేలనిపించింది. ఏమీ పాలుపోని స్థితిలో రెండు రాత్రులు గడిపాను, మూడోరాత్రి ఒక నిర్ణయానికొచ్చాను అక్కడి నుంచి వచ్చేయాలని.

తెల్లవారాక పి. యస్. పి. తో చెప్పాను నా నిర్ణయం గురించి. ఆతనూ యీ ప్రాంతం వాడేనట. కొంత ఆ అభిమానంతో నన్ను తొందరపడవద్దని చాలా దూరం నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు. కాని నా మనసు మారలేదు. నా పట్టుదల చూసి ఓ ఉపాయం చెప్పాడు.

ఆ రోజు శుక్రవారం. ఆ రోజు మహబూబ్ నగర్ వెళ్ళి రైల్వే హాస్పిటల్లో సిక్ చేస్తే, మరల హాస్పిటల్‌కి వెళ్ళవలసింది ఆల్టర్నేట్ డేస్‌లో గనుక, ఆల్టర్నేట్‌డే ఆదివారం అయింది గనుక, సోమవారం వెళ్ళొచ్చు. ఈలోగా యిక్కడికొచ్చి నా పోస్ట్‌లో ఎవరినైనా వేస్తే తిరిగి సోమవారం నాటికి మహబూబ్‌నగర్ చేరటం, పోస్ట్ ఖాళీగా వుంటే యిక్కడ చేరిపోవటం.

మహబూబ్ నగర్ కి రైల్వేపాస్ రాసిచ్చాడు. అక్కడికివెళ్ళి సిక్ చేసి, ఏ అర్ధరాత్రికో వచ్చే ట్రెయిను కోసం పడిగాపులు పడి తెల్లవారేసరికి సికింద్రాబాద్ చేరుకున్నాను.

ఉదయాన్నే ఇంటి ముందు పళ్ళుతోముకుంటున్న మా కజిన్ బ్రదర్ నన్ను చూసి విస్మయంగా 'ఏం టా?' అని పలకరించాడు.

ఇంట్లోకి వెళ్ళాక నా నిర్ణయం గురించి చెప్పాను.

ఇక్కడా మొదలయ్యాయి హితబోధలు.

రైల్వేఉద్యోగం రావటం ఎంత కష్టమో - అదృష్టమో, వచ్చినదాన్ని పోగొట్టుకోటం ఎంత అవివేకమో, అప్పటంతా నానావిధాలుగా నచ్చజెప్ప జూశాడు. కొందరు స్నేహితులతో కూడ చెప్పించాడు చివరి ప్రయత్నంగా, నేను చేరిన ఉద్యోగంలోనే చేరి యిప్పుడు నైట్ డూటీల బారినుంచి బయటపడ్డ మరో స్నేహితుడి చేతకూడ నేను చేసేపని మంచిది కాదని, ఓర్పు వహించమని చెప్పించాడు. కొంతకాలం ఓర్చుకుంటే మరో మంచి ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్‌కి ట్రై చేద్దామనిచెప్పి ఎలాగైతేనేం నా ప్రయత్నం నుంచి విరమించటానికి ఒప్పించాడు.

అదే సాయంత్రం నన్ను కొకుంటకి పంపటానికి సికింద్రాబాద్ స్టేషనుకి తీసుకెళ్ళాడు. అక్కడ మా కజిన్ స్నేహితులు మరికొందరు కనిపించారు. ట్రెయిను స్టార్ట్ కావటానికి యింకా టైం వుంది మాటల మధ్య నా విషయం తెలుసుకొని వాళ్ళొక సూచన చేశారు

'ఇతనెలాగూ సిక్‌లో వున్నాడు కదా. హాస్పిటల్లో కనిపించవలసింది ఎల్లుండి సోమవారం. రేపు ఆదివారం గాబట్టి అక్కడికెళ్ళి చేసేదేం వుండదు. ఇక్కడే వుండి సినిమాలని చూపించు కొంత రిఫ్రెష్ అవుతాడు' అన్నారు

వాళ్ళు సూచన బాగానే వుందని తిరిగి నన్ను యింటికి తీసుకువెళ్ళాడు.

అప్పటికే వాతావరణం బాగాలేదు వర్షం వచ్చే విధంగా వుంది.

ఆ రాత్రంతా విడతెరిపి లేకుండా కుంభవృష్టి!

తెల్లవారుతూనే అశనిపాతం లాంటి దుర్వార్త!

క్రితం రోజు సాయంత్రం నేను ఎక్కబోయిన ట్రైనుకి మహబూబ్‌నగర్ ఇవతల వంతెనమీద ఘోరమైన ప్రమాదం! మాట యాభైమందికి పైగా దుర్మరణం!

గుండె ఝల్లుమంది!

నన్నంతా అదృష్టవంతు డన్నారు.

భగవంతుడు మా కజిన్ బదర్ స్నేహితుల రూపంలో వచ్చి నన్ను కాపాడదన్నారు.

బాగానే వుంది. కాని నేను మళ్ళీ ఆరోజు సాయంత్రమే మహబూబ్‌నగర్‌కి వెళితేగాని సోమవారం హాస్పిటల్లో రిపోర్టు చేయలేను. ఈ పరిస్థితులో ప్రయాణం ఎలాగనేది సమస్య!

పగలు కాస్త తెరిపిచ్చినా ఆకాశం మేఘావృతంగానే వుంది. సాయంత్రానికి మరల వర్షపు జల్లులతోపాటు ఈదురుగాలి కూడ వీస్తోంది ప్రయాణం తప్పనిసరై ఆ సాయంత్రం సికింద్రాబాద్ స్టేషనుకెళ్ళాము.

అక్కడ ఎంక్వయిరీ చేస్తే ఆ రోజు ట్రెయిను ప్రమాద స్థలానికి యివతలి స్టేషను వరకు వెళుతుందట. అలాగే అటు వైపు నుంచి వచ్చే ట్రెయిను అవతలి స్టేషను వరకు వస్తుందట కాబట్టి ఇవతలి వైపు స్టేషన్లో దిగి ఎలాగో అవతలి వైపు స్టేషనుకి చేరుకోవాలి.

ఇదంతా విని మా కజిన్ బ్రదర్ ఏదో దీర్ఘాలోచనలో పడ్డాడు.

'రెండు స్టేషన మధ్య భారీ వర్షాలవల్ల పరవళ్ళు తొక్కే నదివల్ల రోడ్డు పరిస్థితి ఎలా వుందో! వాతావరణమూ బీభత్సంగా వుంది! వెళ్ళటానికి రాత్రివేళ ఏవైనా వాహనాలు దొరుకుతాయో లేదో. కొత్త ప్రదేశం. అక్కడ వాహనం దొరక్కపోతే ఎక్కడ తల దాచుకుంటాడు? మా చిన్నాన్న నామీద భరోసాతో వీణ్ణి యింత దూరం పంపిస్తే, అసలే ఇంటి మీద ధ్యాస మళ్ళిన వీణ్ణి యీ పరిస్థితుల్లో ముందుకుతోయటం భావ్యమా ?' అని ఆలోచించాడులా వుంది— ఓ నిర్ణయానికి వచ్చిన వాడిలా గాఢంగా నిట్టూర్చి నాతో అన్నాడు—

'అరేయ్! నీ యిష్టప్రకారమే మనవూరి కెళ్ళు, అక్కడ నీ పోస్టు ఫిలప్ కాకపోతే చేరిపో, ఫిలప్ అయితే వెంటనే వచ్చెయ్యి' అని చెప్పి అదే స్టేషన్‌లో మద్రాసుకు వచ్చే ట్రెయినులో ఎక్కించాడు.

ఒంగోలు కొచ్చేశాను.

! మా ఆఫీసుకెళ్ళి కనుక్కుంటే పోస్టు యింకా ఖాళీగానే వుంది. వెంటనే గుంటూరులో వున్న డిస్ట్రిక్ట్ ఆఫీసుకెళ్ళి, అక్కడ వాళ్ళచేత వాక్షగక్షింతలు వేయించుకొని, రిపోర్టింగ్ ఆర్డర్సు తీసుకొని మన డిపార్ట్‌మెంట్లో పాతుకుపోయాను!

ఇదీ జరిగింది.

చూశారా ? ఒక రిజిష్టర్ పోస్టు నా జీవిత గమనాన్ని ఎలా మార్చివేసిందో! లేకుంటే రైల్వే డిపార్టుమెంట్లో యీ పాటికి మంచి పొజిషన్లో వుండేవాణ్ణి!''

''ఆఁ, యిప్పుడు మాత్రం పోయిందేముందిలే! రాబడి తక్కువైనా ఆ వార కళాకారుడిగా మంచి పేరు తెచ్చుకున్నావ్! రైల్వేలో వుంటే అటువంటి ప్రదేశాల్లో నీ టాలెంట్ ప్రదర్శించుకొనే అవకాశం చిక్కేదో లేదో! అదంతా యిందుకే జరిగిందేమో!''

వృద్ధులకు శిక్షణ

వృద్ధాప్యాన్నిచురుకుగా గడిపేందుకు పశ్చిమ జర్మనీలోని డార్డ్‌మండ్ విశ్వవిద్యాలయం వారు వృద్ధులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ కోర్సు రెండు సంవత్సరాలుంటుంది. ఈ కాలంలో వీరికి సోషియాలజీ, సోషల్ స్టడీస్, సైకాలజీ, డొమెస్టిక్ సైన్సులను బోధిస్తారు, గత సంవత్సరం యీ కోర్సులో ప్రవేశించిన 42 మందిలో సగానికి పైగా స్త్రీలేవున్నారు ఈ సంవత్సరం మరో 40 మందిని యీ కోర్సులో చేర్చుకున్నారు. ఈ కోర్సులను ప్రయోగాత్మకంగా 1984 మార్చి వరకు నిర్వహిస్తారు. ఈ శిక్షణ పూర్తయిన తర్వాత వీరు యువకుల కోసం నిర్వహింపబడుచున్న సంస్థలలో సలహాదారులుగా ఉంటారు.

ఆంజనేయులు కళాకారుల మీదున్న అభిమానం కొద్దీ అన్నాడు.

''కాని యీ రోజులలో డబ్బు-జీవితాల్ని ఎలా శాసిస్తోందో అందరికీ తెలిసిందే! కళారంగంలో దాని పాత్ర మరీనూ! ... నా జీవితంలో జరిగిన సంఘటనలకి 'నేను యిలా కావలసి వుంది' అనే కర్మసిద్ధాంతం చెబితే శ్రీధర్ కొట్టిపారవేయవచ్చు. కాని, నేనీమధ్య 'ప్రకృతి సహాయ నిరాకరణ' అనే 'సాడ్ సూత్రాన్ని' గురించి చదివాను. 'ఆర్క్‌రైట్ సాడ్' అనే ప్రముఖ ఇంజనీర్ యీ సూత్రాన్ని ప్రతిపాదించాడట. దీని ప్రకారం అరుదుగా జరిగే అవకాశం వున్న ఏదైనా సంఘటన ఆ సంఘటనకి ప్రాముఖ్యం వున్న సమయంలో నూటికి నూరుపాళ్ళూ జరుగుతుందట! అంటే మంచి రసకందాయంలో వున్నప్పుడు ఆటంకం జరిగితే 'అబ్బ! యిప్పుడే జరగాలా!' అనుకుంటామే- అలాగన్నమాట. నా జీవితంలో జరిగిన సంఘటనలకి కారణం కర్మసిద్ధాంతం కాదనుకున్నా 'సాడ్ సిద్ధాంతం' సరిగ్గా సరిపోతుంది!

ఈ సిద్ధాంతం ప్రకారం మానవుడికి అతీతమైన శక్తివల్లనే, అంటే ప్రకృతిలో వున్న ఏదో సహజగుణం వల్లనే అటువంటి సంఘటనలు జరుగుతాయట! వ్యాసం చివర ఆ వ్యాసకర్త ప్రశ్నిస్తాడు 'ఇలా ఎందుకు జరిగేను ?' అని. నిజమే! రిజిస్టర్డ్ పోస్ట్‌లో నా యింటిపేరు తప్పుగా ఎందుకు వ్రాయబడాలి ? ఆ చిన్న తప్పువల్ల గదా నా జీవితం యిన్ని మలుపులు తిరిగింది ?''

''అది ఏ శక్తీ ప్రేరేపించి కాదు! అది మనిషి చేసిన పొరపాటు!'' తక్కున సమాధానం చెప్పాడు శ్రీధర్.

''ఆ పొరపాటే ఎందుకు జరగాలి ? దానికి కారణం ?''

ఈసారి శ్రీధర్ వెంటనే సమాధానం యివ్వలేదు.

'తీరా నేను మనసు మార్చుకొని కొలువులోకి తిరిగిపోవాలనుకున్న సమయంలోనే ఆ ట్రెయిను యాక్సిడెంట్ ఎందుకు జరగాలి? అలా జరగకపోతే నేను రైల్వే డిపార్ట్‌మెంట్‌లోనే వుండిపోయేవాణ్ణి కదా! ఒకవేళ నేను ఆ ట్రెయినులో ఎక్కివుంటే మృతుల జాబితాలో చేరి వుండేవాణ్ణేమో! స్టేషనుదాకా వెళ్ళి వాళ్ళెవరికల్లో నా ప్రయాణం ఎందుకు ఆగిపోవాలి? అంతేకాదు. నేను బి. ఏ. లో చేరబోయే సమయానికే ఆ సెలక్షన్ ఆర్డర్ ఎందుకు రావాలి? అది రాకపోతే యింకా చదువుకొని వుండేవాణ్ణి! ఇంకా మంచి ఉద్యోగం వచ్చి వుండేదేమో!

ఇవన్నీ యిలా జరగటానికి కారణం ఏమిటి? ఇవన్నీ సాడ్ సూత్రాన్ని నిరూపిస్తున్నాయా లేదా ? మరి వాటి వెనుక వున్నది మానవాతీత శక్తి అవునా, కాదా ?''

శ్రీధర్ మాట్లాడలేదు.

ఆ మౌనం అర్ధాంగీకారమో! అంగీకారమో ?

వారఫలం

2-4-1982 శుక్రవారం మొదలు
8-4-1982 గురువారం వరకు

★మేషం— ధనరాబడి గల వారమే 'కృషితో నాస్తి దుర్భిక్షమ్' బాగా శ్రమిస్తారు. అయినా ప్రస్తుత పరిస్థితులలో ఇంకా శ్రమించాలి ఉద్యోగములో ఎలాంటి అంతరాయం రాదనే గ్రహించాలి స్త్రీలకు నూతన ప్రయత్నాలు తెలివితో కార్య సాధన గలవారం.

★వృషభం— ధనలబ్ధికి ఎలాగైనా అవకాశ మున్నది. గ్రహచారం చాల అనుకూలం గలవారం. బంధు విరోధం మాత్రం ఏర్పడే అవకాశమున్నది. వస్తువులు పోయే అవకాశమున్నది జాగ్రత్త. స్త్రీలకు ఇంటి పనితో సతమతం కావటం, కొందరి యింట శుభ కార్యములుండుట గమనించ దగిన అంశాలు.

★మిథునం : రాజకీయంగా మీకు మేలుజరిగే అవకాశం — కొందరికి క్రీడారంగంలో పదవ కాశాలు, అంతర్జాతీయంగా ఏర్పడటం గమ నించదగిన అంశాలు. వ్యాపారానికి ఎలాంటి విఘాతం రాదు. స్త్రీలకు బంధు సమాగమం, విందు వినోదాలతో కాలక్షేపం గల వారం.

★కర్కాటకం— యత్న కార్యసిద్ధికి అవకాశం. నూతన విషయాలు తెలిసికొనే అవకాశమున్నది. ఈ వారం చాలా ప్రధానంగా ఆర్థికంగా, వ్యాపార విషయంగా మీకు మేలు చేకూర్చగలదని గ్రహించ మన్నారు. ఏ రంగంలోనైనా మీకు సందేహం ఉదయిస్తే— అనుభవశాలురను సంప్రదించండి. స్త్రీలకు ప్రయాణావకాశాలు, శుభకార్య ప్రస్తావనలుండగలవు.

★సింహం — ఈ వారంలో మీ వృత్తి వ్యవహారాలలో గాని, ఆర్థిక రంగంలో గాని కొన్ని వూహించని మార్పులు రాగలవు. అవి ఉత్సాహ ఫలదాయకములైన మార్పులే. చాలా విధాల మేలు చేకూర్చగల విషయాలలో తొందరపడక తప్పదు. స్త్రీలకు వస్త్రాభరణాలు కొనుగోలు చేయుగల అవకాశాలు — అందులకు కావలసిన ఆర్థిక సోమత చేకూరగల వారమే.

★కన్య — ఈ వారం ఉత్సవ కాలం. ధనరాబడి వృత్తిలో పెంపు, ఉద్యోగంలో నూతన అవకాశాలు కూడా లభించగలవని చెప్పుటకు అవకాశ మున్నది. ఏది మంచిదో, దేన్ని వదలాలో గ్రహించే అవకాశం కూడా లేకపోలేదు, శుభ కార్యాలు నిర్వహించే అవకాశం తమ ఇంటలో, మిత్రులు ఇంటనో జరిగే అవకాశముంటుంది. స్త్రీలకు ఆదాయమవుంటుంది. అధికారుల ఆదరణ లభిస్తుంది. ఆరోగ్య లోపం లేకుంటుంది.

★తుల — 'స్వాతి' నక్షత్ర జాతకులు వ్యాపారములలో, భూసంబంధమైన వ్యవహారాలలో— నూతన వస్తుసేకరణకు అవకాశం ఉంటుందని కొందరకు రాజకీయంగా బాగుండగలదని చెప్ప నవసరం లేదు. మంచి కాలమే. స్త్రీలకు అప్రయత్నంగా ధనలబ్ధి, కార్యరంగంలో అనుకూలత గల వారం.

★వృశ్చికం— ఇంతవరకు విక్రయ రంగంలో మీకు అనుకూలత చేకూరింది గదా అది మరీ హెచ్చు స్థాయిలో అనుభవీయం కాగలదు. అవాత్ప వర్గీయుల మూలాన లాభదాయకం. స్త్రీలకు ఆర్థికంగా బాగుండటం సదవకాశాలు అడపాదడపా లభించడం. సభ గౌరవం కొందరికు దక్కటం గమనింపనున్నారు.


★ధనుస్సు: ఈ వారంలో మీ బాల్యమిత్రులు యింటికి రానున్నారు. మీతో ఒకానొక విషయమై మంతనాలు సాగింపనున్నారు. కృషిలోపం లేకుండా మీకు అన్ని విధాలా మేలు సంభవం. ఈవర్గాలు భావి కాలంలో మీకు మేలు చేకూర్చ గలదని నమ్మండి. కృషి చేయండి. స్త్రీలకు: అనుకోకుండా ధనాదాయం, స్థలమో, వస్తువులో బేరం చేసే అవకాశాలుండగలవు.

★మకరం:— కుటుంబానందానికి లోపంలేదు. పెద్దలకు అంటే వయసు మీరిన వారి ఆరోగ్య లోపం కనిపించే అవకాశమున్నది. రాజకీయంగా మీకు గణనీయమైన మార్పులు రానున్నవి. అత్యంత అనుకూలంగా మీకు చేయగలవారు దాపునకు రానున్నారు. స్త్రీలకు: యత్న కార్యసిద్ధి గలవారం.

★కుంభం:— అవివాహితులకు ఈ వారంలో శుభ ప్రస్తావనలు జరిగే అవకాశం గలవారం. ఉద్యోగ మార్పు కూడా కొందరకు ఆశింపవచ్చు. వాంఛనీయమే. వ్యాపార మార్గంలో మీకు అనుకూలత చెప్పదగి యున్నది. గ్రహానుకూలత కొంతలో కొంత మేలు. స్త్రీలకు: ఒకానొక విషయంలో ఆందోళన కలగటం, ఆర్థికంగా నిరుత్సాహత కనిపించనున్నది.

★మీనం:— ఈ వారం నుండి క్రయ విక్రయాలలో లాభం—అధికారుల ఆదరణ ఆపేక్షత లభించే అవకాశం కూడా ఉంటుంది. ఆనందమే గాక, తృప్తి కూడా సంభవమే. స్త్రీలకు: వృత్తిలో పెంపు, కృషి రాణింపు. ఆదాయం, సర్వానుకూలత శక్తి సామర్థ్యాలకు గుర్తింపుకు అవకాశం గలవారం. తృప్తికరమే.

— విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి



ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య


భక్తి ప్రదర్శించే పద్ధతి


భక్తి అనగా ప్రేమయే! దైవమునందును, గురువుయెడను, పెద్దల పట్లను గల ప్రేమయే భక్తి. ఆ ప్రేమ పిన్నలి యెడ ఉన్న యెడల వాత్సల్య మనబడును. భార్య యెడగల ప్రేమ ప్రణయం.


కొందరు పూజా గృహంలో కూర్చుండి మిక్కిలి ఆర్భాటంగా దేవపూజ సాగిస్తూ ఉన్నా మనస్సు మాత్రం స్థిరంగా ఉండదు ఇంట్లో పిల్లలు ఏడ్చినా, ఎవరైనా తమకు వినబడేటట్లు మాట్లాడుతున్నా కోపం వచ్చి అరుస్తారు. నిజమైన భక్తి ఉన్నవారి మనస్సు భగవంతుని పైనే లగ్నమై ఉంటుంది. అటి స్థిరచిత్తుడు ఇతరములను వేటినీ పట్టించుకోడు భగవద్భక్తికి మనస్సు ప్రధానం— పూజా ద్రవ్యాలన్నీ ఆ తర్వాతివే!

గురుభక్తి కూడా ఇటువంటిదే! శిష్యుని బుద్ధి గురువు బోధించే విషయం పైనే కేంద్రీకృతమై ఉండాలి. తాను చెప్పిన విషయాలను చక్కగా గ్రహించినవాని పైనే గురువునకు వాత్సల్యం ఉంటుంది. చదువు పయి శ్రద్ధ చూపక తన సేవయందే లగ్నమయి, వినయ విధేయలు చూపేవానిపయి గురువునకు మంచి అభిప్రాయం ఉంటుందని అనుకోలేము. విద్యయందాసక్తి లేనివాని వినయ విధేయతలు కేవలం నటనయే అనే భావం కూడా గురువునకు కలగవచ్చు. తనకు సేవ చెయ్యకపోయినా విద్యాసక్తి కలవాని పయినే ఉపాధ్యాయునికి ఎక్కువ వాత్సల్యం ఏర్పడుతుంది.

గురువును త్రిమూర్తి స్వరూపుడుగానూ, పరబ్రహ్మ స్వరూపునిగానూ చూడవలెనని పూర్వీకులు అనేవారు. అలా చూడకపోయినా అపధేయతగా ప్రవర్తించకుండా ఉంటే







జపాన్‌లో దిగువ మధ్యతరగతి పెరుగుదల!

జపాను ప్రజలు తమ జీవితం పట్ల సంతృప్తిని వ్యక్తంచేస్తున్నారు. అయితే ఎక్కువమంది తాము దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారమని తెలియచేస్తున్నారు. జపానులో ఇటీవల జరిపిన ఒక సర్వేలో, 3100 మందిని ప్రశ్నించడం జరిగింది. మూడు సంవత్సరాల క్రితం కూడా యిటువంటి సర్వే జరిగింది. అందులో 80 శాతం మధ్యతరగతి కుటుంబీకులమని తెలియచేశారు. అయితే ప్రస్తుత ఇంటర్వ్యూలో ఎగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారి సంఖ్య 5 శాతం తగ్గింది. కాగా, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారి సంఖ్య 3 శాతం పెరిగింది.

ధర్మపథం

గురుభక్తిని ప్రదర్శించడమని యీ కాలాన్ని బట్టి అనుకోవాలి.

తనకంటె పెద్దలైనవారిపట్ల వినయ విధేయతలు చూపడం శ్రేయోదాయకం. అలా చెయ్యకపోయినా, అధిక్షేపించకుండా వుంటే చాలునని కాలాన్ని బట్టి అనుకోవలసి ఉంటుంది.

ఇక తల్లిదండ్రుల విషయంలో —

వేదకాలము నుండియు తల్లిదండ్రులు దైవ సమానులుగా భావించబడుచున్నారు. దైవమునందువలెనే వారియెడలను భక్తి చూపవలసియున్నది. వారు చెప్పిన పనులు చేయుట, వారి మాట ననుసరించి నడచుకొనుట, తాము పెద్దయై ధనము నార్జించునపుడు వారి పోషించుట పుత్రుని ధర్మము. అదియే వారియందు చూపవలసిన భక్తి. పోషింప శక్తి లేకున్నపుడు వారి సేవ యైనను చేయవలెను.

పై రీతిని వారి వారి విషయమున భక్తిని ప్రదర్శింపవలెనేగాని, ఆర్భాటముగాని, నటనగాని- ఉచితమై యుండదు ఇట్టి నటనలను బట్టియే ''భక్తిలేని పూజ పత్రి చేటు'' అనే సామెత ఏర్పడింది.

వంటలు



పాకుండలు

కావలసిన సామగ్రి : బియ్యం పిండి — 2 డబ్బాలు, చక్కెర - 1 డబ్బా, కొబ్బరి కాయ - 1, నూనె - అరకిలో.

చేసే పద్ధతి : కొబ్బరికాయ కొట్టి కోరుకుని ఉంచాలి. బియ్యపు పిండి, మర పట్టించినదైనా విసిరినదైనా, దంచినదైనా ఫరవాలేదు పిండి తడిగా ఉన్నా ఫరవాలేదు. కొబ్బరికోరు, చక్కెర, బియ్యం పిండి మూడు చక్కగా కలపాలి. తడిపిండి అయినా లేక కొబ్బరి లేతదైనా ఏమాత్రం కూడ నీరు వేయకుండా ముద్ద కలపాలి. క్రమంగా కొద్ది సేపటికి ముద్దగా ఈ మిశ్రమం తయారవుతుంది. ఈ విధంగా కలిపిన ముద్ద నుండి చిన్న చిన్న ఉండలు తయారుచేసి పొయ్యిపై మూకుడులో నూనె మరిగాక ఈ ఉండలను కొద్ది కొద్దిగా వేసి ఎర్రగా వేపి చల్లారేక తింటే కరకరలాడుతూ రుచిగా వుంటాయి.

— ఎల్ ఉమా శ్యామల రావు

మసాలా జున్ను

కావలసినవి : పాలు - 2 లీటర్లు, ఉల్లి— 3 గడ్డ (పెద్దవి), లవంగాలు - 2 స్పూన్లు, ఏలకులు — 5, గసగసాలు — 1 స్పూన్, ధనియాలు—1స్పూను, జీలకర్ర 2స్పూన్లు, పిండుమిర్చి - కొంచెం, దాల్చినచెక్క — చిన్న ముక్క, దాల్చిన ఆకులు—2, వుప్పు — చాలినంత.

చేయు విధానం : మొదట పాలు విరగ్గొట్టి గట్టిగా వుండే జున్ను తయారు చేసుకుని

వుంచుకోవాలి తర్వాత ఉల్లి, లవంగాలు, ఏలకులు, గసగసాలు, దాల్చినచెక్క, ఆకులను మొత్తం కలిపి మెత్తగా నూరుకోవాలి. జున్ను ముక్కలుగా కోసుకుని పైన నూరుకున్న మసాలా ముద్దలో ముంచి, నూనెతోగాని, నెయ్యితోగాని, వ్రిరగా వేయిస్తే చాలా రుచిగా వుంటాయి.

డి సుధాలహరి

మజ్జిగ లేక పెరుగుతో స్వీట్

కావలసిన పదార్థములు ; మజ్జిక లేక పెరుగు - నాలుగు కప్పులు, పంచదార - నాలుగు కప్పులు, నెయ్యి లేక డాల్డా - ఒక కప్పు, శనగపిండి - ఒక కప్పు, నాలుగయిదు ఏలక్కాయులు లేక వెనిల్లా ఎసెన్స్, జీడిపప్పు, ఎండు ద్రాక్ష.

తయారుచేయు విధానము : అరకప్పు నెయ్యి లేక డాల్డాలో శనగపిండి వేయించాలి. పంచదార, మజ్జిగ లేక పెరుగు, శనగపిండి చేతితో బాగా మర్దించాలి. పొయ్యిపై పెట్టి కలుపుతూ ఉండాలి. కొంచెం గట్టిపడుతు వ్నప్పుడు నెయ్యి కొద్ది కొద్దిగా వేస్తూ మిగిలిన అరకప్పు నెయ్య దానికి కలపాలి. ఈ మిశ్రమం పాత్ర గోడలకు అంటుకోకుండా ఉన్నప్పుడు జీడిపప్పు, ఎండుద్రాక్ష, వెనిల్లా ఎసెన్స్ (లేక ఏలక్కాయల పొడి) వేసి, కలిపి, ఒక పళ్ళెంలో వేయాలి.

ఆర్ సంధ్య

పెసరు అటుకుల చూడ

ముందుగా పచ్చిమిర్చి – 25, కొత్తిమిర కట్ట – 1, పచ్చికొబ్బరిచిప్ప – 1, ఇంగువ – కొద్దిగా, ఉప్పు – తగినంత వేసి అన్ని కలిపి మెత్తగా దంచవలెను. తరువాత అర కేజి అటుకులకు ఈ దంచిన ముద్దను నూనెతో బాగా కలపాలి.


ఆ తరువాత బాణలిలో కొద్ది కొద్దిగా అటుకులను వేసి వేయించాలి. అటుకులకు ఒక నిమ్మపండు రసం పిండాలి. ఒక కప్పు వేయించిన శనగ విత నాలు వేయాలి. శనగ విత్తనాల జతకు అరకప్పు పప్పులుకూడా వేసుకోవచ్చును.

ఇవి చాలా రుచిగా, నిలువకూడ వుంటాయి.


— హెచ్. శేషశాయి



తెలుపు అమితం! ఉతుకులు అధికం!!
Test
Test DETERGENT CAKE
Himabindu
అయితే అది తప్పక...
సూపర్ టెస్ట్
ఉతుకులే మరి!!!
తయారు చేయువారు
టెక్నొక్రాట్ సర్ఫెక్టెంట్స్
516101



భారతదేశంలో ప్రప్రథమ తయారీ
గృహిణులకు కల్పవల్లి!
గోపి
కిచన్ మిషన్
GOPI
KITCHEN MACHINE
For years and years of trouble-free service
Blender & Liquidiser
Dry Grinder
Wet Grinder
Atta Kneader & Dough Maker
Centrifugal Juicer
Citrus Juicer
Slicer & Grater
Meat Mincer
ఫోన్ 75351.



లక్షలాది ప్రజల
(ప్రత్యేకంగా మహారాష్ట్ర)
విశేష అభిమానం పొందిన
నాగపూర్ ఫేమస్ బ్రాండ్
వాక్స్ కూలర్స్
మీ విజయవాడ నగరానికి
విచ్చేశాయి
NIK
Mini in size giant in cooling
Patent No. 138279
WOX
COOLERS
Wox Coolers Pvt. Ltd.
విజయవాడ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో
మా స్టాలు నెం. 25ను దర్శించి
మీ కూలర్‌ను బుక్ చేసుకోనండి!
డిస్కౌంట్ మరియు
ఫ్రీ గిఫ్ట్ పొందండి!
అధరైజ్డ్ డీలర్సు:
రాజ్ కమల్,
జై హింద్ టాకీసు రోడ్డు,
బకింగ్‌హాంపేట పోస్టాఫీసుదగ్గర,
విజయవాడ 2.
ఫోన్స్: ఆఫీసు: 73704 ★ P.P. Res: 73515

అవీ ఇవీ అన్నీ

యాభై సంవత్సరాల జ్ఞాపకాలు

1929 నుంచి 1979 వరకు. రచన : శ్రీ దేవులపల్లి రామానుజరావు, 140 పేజీలు గల ఈ పుస్తకం వెల 15 రూపాయలు. ప్రతులకు (1) ఆంధ్ర సారస్వతపరిషత్తు, బొగ్గులకుంట తిలక్‌రోడ్, హైదరాబాద్ 500001. (2) శ్రీ టి. బాలరాజు జిల్లా ట్రెజరీ కార్యాలయం, సుబేదారి హనుమకొండ, వరంగల్.

స్పందన

కవితల సంపుటి రచన శ్రీయుతులు ముదిగొండ ఈశ్వరచరణ్, మాదాడి నారాయణరెడ్డి, ముదిగొండ వీరేశలింగం, 36 పేజీలు గల ఈ పుస్తకం వెల రు. 3 రూపాయలు. ప్రతులకు: శ్రీ ఎం. నారాయణరెడ్డి, తెలుగు లెక్చరర్, ఎస్. ఆర్. ఆర్. గవర్నమెంట్ కాలేజి, కరీంనగర్—505001.

పాకిస్తాన్‌తో మరో యుద్ధం?

రచన : శ్రీశివరాం. 36 పేజీలు, వెల రు. 1—25. ప్రతులకు: నవభారతి ప్రచురణలు, 3.4.852, బర్కత్‌పుర, హైదరాబాద్ — 500 027.

నిశీధి సంగీతం

తెలుగు, ఇంగ్లీషు కవితా సంకలనం రచన : 'రవుద్రి' 36 పేజీలు. వెల: 5 రూపాయలు. ప్రతులకు : శ్రీమతి రామలక్ష్మి, శివప్రకాశ ముదలివీధి, మదరాసు—600017, లేద నవ భారత్ బుక్‌హవుస్, ఏలూరురోడ్, విజయవాడ-3.

జెంషెడ్‌పూర్ నివేదిక
రాజకీయ కుతంత్రమా?

రచన శ్రీ ఎన్. ఎస్. 38 పేజీలు, వెల రు. 1—25. ప్రతులకు నవభారతి ప్రచురణలు, 3.4.852, బర్కత్‌పురా, హైదరాబాద్—500027.

స్వేచ్ఛా సమర యోధులు

ప్రపంచంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని కాపాడడానికి కృషి చేసిన థామస్ పెయిన్, పేరిబాల్డి, మైకేల్ బకూనిన్, ఎర్రోల్ జీవిత సంగ్రహాలని డాక్టర్ జి. విజయం 44 పేజీల ఈ పుస్తకంలో ఆంధ్ర పాఠకులకి అందజేశారు. వెల 3 రూపాయలు. ప్రతులకు : నాస్తికకేంద్రం, పటమట, విజయవాడ — 520006.

హైదరాబాద్ నోట్ బుక్

—తిరుమల రామచంద్ర

"ఈ ఒక్క పని చాలు"

రాష్ట్ర సచివాలయం ఉద్యోగుల సంఘాలు మార్చి 2 వ తేదీన ఏర్పాటు చేసిన అభినందన సభలో ముఖ్యమంత్రి శ్రీ భవనం వెంకట్రామ్ ప్రసంగిస్తూ పరిపాలనలో జాప్యం జరుగకుండా శ్రద్ధ వహించాలని ప్రభుత్వోద్యోగులను కోరుతూ, ఉద్యోగి పదవీ విరమణ నాటికి అతనికి రావలసిన పెన్షన్ అతని చేతికిచ్చి పంపేరోజు ఎప్పుడు వస్తుందా అన్నదే తమ ఆకాంక్ష అనడం చాలా బాగుంది. మన రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగం విరమించిన వారు ఐదారేళ్ళు గడచినా పెన్షన్ సరిగా చేతికందక, అందినది సక్రమంగా అందక బాధ పడుతుండడం నగరంలోని మోతీగల్లీ మున్నగ పెన్షన్ పేమెంట్ కార్యాలయాలను చూస్తే తెలుస్తుంది. అక్కడ పడిగాపులు గాస్తున్న పెన్షన్ దారులను వారి అప్పులను చూస్తే వేదాంత దేశికుల వైరాగ్య పంచకం లోని "దురీశ్వరద్వార బహిర్వితర్దికా దురాసికా య్యై రచితోయ మంజలిః" (ఆ పాడు రాజద్వారాల వెలుపలి అరుగుల పై పడిగాపులు గాయడానికి నమస్కారం) అనే శ్లోకార్థం జ్ఞాపకం వస్తుంది. నా పెన్షన్ ఇంకా ఫిక్స్ కాలేదు. నా పెన్షన్ కాయితాలు ఎప్పుడు వెళుతాయో తెలీదు. ఎక్కడ వున్నాయో తెలీదు. పెన్షన్ ఫిక్స్ కాగానే పిల్ల పెళ్ళి తలపెడుతాను, పెన్షన్ రాగానే ఇల్లు నయ్యా- ప్రభుత్వంతో పని- చింతపండు వంకాయం బేరమా? అంటూ పలవించే మార్గాన్ని మంది దీనావస్థను ముఖ్యమంత్రి కాశీ మజిలీ కథల్లో లాగా మారువేషం వేసుకొని పోయి చూస్తే తెలుస్తుంది. పెన్షన్ రాక, అప్పులతో కుంగిపోయి ; మృత్యువు వాతబడిన వారూ నాకు పలువురు తెలుసు. ముఖ్యమంత్రి ఈ విషయములో తగిన చర్య తీసుకొని మాట ప్రకారం జరిగేట్టు చూస్తే గొప్ప సేవ చేసిన వారవుతారు.

పొంగే వయసు వారికి హెచ్చరిక!

పొంగే వయసులో వున్న పసివారికి తెల్లని వన్నీ పాలని, నల్లనివన్నీ నీళ్లని అనిపిస్తుంది. ప్రపంచ మంతా తమకోసమే ఉన్నట్టు ఎలాటి అన్యాయమూ తమక జరగదన్నట్టు, జరిగినా ఎదిరించగల బలం వున్నట్టు భావిస్తారు. కనుకనే మోసపోతారు. మోసపోయిన వారు మరల కోలుకోడం అదృష్ట విశేషం. సాధారణంగా అలా జరుగదు. వారి గతి అధఃపాతాళ నికే. మార్చి 3 వ తేదీన కర్తవ్య నిష్ఠులైన నగర పోలీసు అధికారులు ఒక మైనర్ బాలికను దుండగుల బారి నుంచి రక్షించడం యువతీ యువకులకు కనువిప్పు కావాలి. ఈ మైనర్ బాలిక వయసు 15 సంవత్సరాలు. విజయవాడ వాస్తవ్యురాలు. సినిమాకు ఒంటిగా వెళ్లతానంటే తలిదండ్రులు ఒప్పుకోనందుకు అలిగి ఇంటినుంచి వెళ్ళవచ్చిన అమాయకురాలు. ఇలాటి ఒంటి పిట్టలకోసం బ్రోకర్లనే డేగలు కాచుకొని వుంటాయి. అలాటి డేగ బారిపడి, నగరం శివారులోని ఒక గ్రామంలో వేశ్యా గృహం నడుపుతున్న బుచ్చయ్యను చేరింది ఎన్నో చేతులుమారి ఆ పసిది. అదృష్టవంతురాలు. సంవత్సరం కాక ముందే కర్తవ్య పరాయణులైన పోలీసులు తెలుసుకుని ఆమెను మార్చి 2 వ తేదీన కాపాడి, తలిదండ్రులకు అప్పగించారు. ఇలాటి సంఘటనలెన్నో తలిదండ్రులపైన, ఇష్టుల పైన అలిగి యువతులు జీవితాలను పాడు చేసుకోగూడదు. క్షణికమైన అవివేకం జీవితాన్ని కలకాలం నాశనం చేస్తుందని గ్రహించాలి.



మార్చి 5 వ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆంధ్రప్రదేశ్ నృత్య అకాడమీవారు ఏర్పాటుచేసిన కూచిపూడి నృత్య కార్యక్రమంలో ప్రదర్శన ఇచ్చిన శ్రీమతి గౌరీకుమార్.

హైదరాబాద్ నోట్ బుక్

దేశ ఆర్థిక పరిస్థితి :

రిజర్వు బ్యాంక్ గవర్నర్ శ్రీ ఐ. జి. పటేల్ ఫిబ్రవరి 5వ తేదీన పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ, దేశంలో ఆర్థిక పరిస్థితి నిరుటికన్నా మెరుగని, వ్యవసాయరంగంలో నాలుగు శాతం, పరిశ్రమరంగంలో ఎనిమిది శాతం ఉత్పత్తి పెరిగిందని, ఆహార ధాన్యాల ఉత్పత్తి 13 కోట్ల 30 లక్షల టన్నులు ఉండగలదని, చెరకు పత్తి వంటి వాణిజ్యపు పంటలు కూడా ఎక్కువేనని వివరించారు. బేరర్ బాండ్లను తిరిగి ప్రవేశపెట్టే ప్రతిపాదనలేదన్నారు. దొంగనోట్ల శాతం విదేశాలతో పోల్చిచూస్తే చాల తక్కువని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల ఆర్థిక వ్యవహారాలు చాల చక్కగా ఉన్నాయని ఈ రాష్ట్రాలు వోవర్ డ్రాఫ్టులను వినియోగించుకోడం లేదని అన్నారు.

శ్రీ రంగనాథానంద ప్రబోధం :

భారత వికాసపరిషత్తు, తదితర సేవాసంస్థల చతుర్థ యావద్భారత మహాసభను ఫిబ్రవరి 14న రామకృష్ణ మఠాధిపతి శ్రీస్వామి రంగనాథానంద ప్రారంభిస్తూ దేశపరిపాలన నిర్వహణలోనిలోపాన్ని సేవా సంస్థలు పూర్తించాలన్నారు. శతాబ్దాలుగా కోట్లకొలదిమనుష్యులు ఉపేక్షింపబడుతున్నారు. మానవసేవే మాధవసేవ అని ఉపనిషత్తులు ఉద్ఘోషిస్తుండగా ఆ మానవులను మనం జంతువుల కన్నా నికృష్టంగా చూస్తున్నాము. ప్రజాస్వామ్యంలోమర్యాద గౌరవం ప్రధానం. మానవులందరినీ మర్యాద చేయడం మన ధర్మం. మానవుని గౌరవ ప్రతిష్ఠలను పరిరక్షించడం మన కర్తవ్యం అని ఆయన అన్నారు. ఈ పరిర[illegible] ఎలా జరుగాలో సేవా సంస్థలు జరిపి ప్రభ[illegible] గుణపాఠం నేర్పాలని, సేవా సంస్థలకు [illegible] చిత్తశుద్ధి వుంటె, డబ్బు దానంతట[illegible] వస్తుందని ఆయన అన్నారు. ఈ [illegible] ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన [illegible] మూర్తి శ్రీ అల్లాడి కుప్పుస్వామి అధ[illegible] వహించారు.

ఉవాచ శ్రుతి :

చూచారా? ఆచార్య ఎన్.జి. రంగా శ్రీ మురార్జీ భాయి 87 వ జన్మదినోత్సవానికి వెళ్లారట—అన్నారు నాతో ఒక నాయకుడు. ఇక తనకు వచ్చే పదవులేమీ లేవుగదా ? కనుకనే ధైర్యంగా వెళ్లి వుంటారు — అన్నారు ప్రతిపక్షనాయకులొకరు. ★

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna.